

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



సోమవారం | 28-10-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 193 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, బహుళపక్షం; తిథి: ఏకాదశి ఉ. 7.51 తదుపరి ద్వాదశి; నక్షత్రం: పుబ్బ మ. 3.24 తదుపరి ఉత్తర; వర్జ్యం: రా. 11.33-1.21; దుర్ముహూర్తం: మ. 12.21-1.07, మ. 2.38-3.24; అమృతఘడియలు: ఉ. 8.12-10.00; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 6.15; సూర్యాస్తమయం: 5.41 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



చెలరేగిన శశికాంత్

● హిమాచల్ 198/4

● ఆంధ్ర 344 ఆలౌట్

విశాఖపట్నం (స్పోర్ట్స్): శశికాంత్ (3/50) దెబ్బకు తడబడినా.. అంకిత్ కల్సీ (53), ఆకాష్ వశిష్ట్ (52 బ్యాటింగ్) అర్ధ శతకాలతో ఆదుకోవడంతో హిమాచల్ కోలుకొంది. గ్రూప్-బీలో ఆంధ్రతో రంజీలో రెండో రోజు చివరకు హిమాచల్ తొలి ఇన్నింగ్స్‌లో 198/4 స్కోరు చేసింది. ఆదివారం ఆట ముగిసే సమయానికి ఆకాష్‌తోపాటు రిషి ధవన్ (38) క్రీజులో ఉన్నారు. ఓపెనర్లు ప్రశాంత్ చోప్రా (10), శుభమ్ అరోరా (16), ఏకాంత్ సేన్ (20)ను శశికాంత్ అవుట్ చేయడంతో.. హిమాచల్ 59/3తో కష్టాల్లో పడింది. ఈ దశలో అంకిత్, ఆకాష్ నాలుగో వికెట్‌కు 65 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకొనే ప్రయత్నం చేశారు. కాగా, ఓవర్‌నైట్ స్కోరు 295/6తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆంధ్ర 344 పరుగులకు ఆలౌటైంది. మనీష్ (42), విజయ్ (33) పర్వాలేదనిపించారు. దివేశ్ శర్మ 5 వికెట్లు, రిషి 3 వికెట్లు పడగొట్టారు. ప్రత్యర్థి మొదటి ఇన్నింగ్స్ స్కోరుకు హిమాచల్ ఇంకా 146 పరుగుల దూరంలో ఉంది.

పాక్ కొత్త కెప్టెన్ రిజ్వాన్



లాహోర్: పాకిస్థాన్ పరిమిత ఓవర్ల కెప్టెన్‌గా వికెట్ కీపర్-బ్యాటర్ మహ్మద్ రిజ్వాన్‌ను నియమించారు. బాబర్ ఆజమ్ స్థానంలో వన్డే, టీ20 ఫార్మాట్ పగ్గాలను రిజ్వాన్‌కు అప్పగించారు. ఆస్ట్రేలియా, జింబాబ్వేలతో జరిగే పరిమిత ఓవర్ల సిరీస్‌ల కోసం జట్లను సెలెక్టర్లు ఆదివారం ఎంపిక చేశారు. కాగా, వచ్చే నెలలో ఆసీస్‌తో జరిగే వన్డే, టీ20ల జట్లలో బాబర్, షహీన్ అఫ్రీది, నసీమ్ షాలకు మళ్లీ చోటుదక్కింది. అయితే, వచ్చేనెల 24 నుంచి డిసెంబరు 5 వరకు జరిగే జింబాబ్వే టూర్‌కు రిజ్వాన్‌తోపాటు కొందరు సీనియర్లకు విశ్రాంతినిచ్చారు. దీంతో ఈ టూర్‌లో వైస్ కెప్టెన్‌గా ఎంపికైన సల్మాన్ అగా జట్టును నడిపించనున్నాడు.

'బి' కేటగిరీకి అఫ్రీది: స్టార్ పేసర్ షహీన్ అఫ్రీదికి పాకిస్థాన్ క్రికెట్ బోర్డు షాక్ ఇచ్చింది. ఆటగాళ్ల సెంట్రల్ కాంట్రాక్ట్‌లో అఫ్రీదిని కేటగిరి-ఎ నుంచి తప్పించి.. గ్రేడ్-బిలో చేర్చింది. 2024-25 సీజన్‌కు సంబంధించి 25 మందికి సెంట్రల్ కాంట్రాక్ట్‌లు ఇచ్చారు. ఫఖర్ జమాన్, ఇఫ్తికార్ అహ్మద్, ఒసామా మిర్‌లను ఆ జాబితా నుంచి తప్పించారు. పాక్ టెస్ట్ కెప్టెన్ షాన్ మసూద్ కేటగిరి-బిలోనే ఉన్నాడు.

వారసులు వీరేనా?



(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

న్యూజిలాండ్‌తో మూడు టెస్ట్‌ల సిరీస్‌ను కోల్పోయిన దరిమిలా భారత జట్టు ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ అవకాశాలు ప్రమాదంలో పడ్డాయి. పరిస్థితులు అనుకూలించి వచ్చే ఏడాది జూన్‌లో జరిగే తుదిపోరుకు టీమిండియా అర్హత సాధిస్తే..వరుసగా మూడోసారి ఫైనల్‌కు చేరినట్టవుతుంది. ఇక తదుపరి డబ్ల్యూటీసీ సైకిల్ (2025-27) ఫైనల్ నాటికి కెప్టెన్ రోహిత్, అశ్విన్, విరాట్, జడేజాలాంటి స్టార్లు జట్టులో ఉండకపోవచ్చు. కివీస్‌తో రెండు టెస్ట్‌ల్లో ఘోర పరాభవం అనంతరం ఈ సీనియర్ క్రికెటర్ల సత్తాపై ఇప్పటికే చర్చలు మొదలయ్యాయి. రాబోయే డబ్ల్యూటీసీ సైకిల్‌లో భారత్ పరివర్తన దశలో ఉండడం ఖాయం. అయితే స్టార్ బ్యాటర్ల స్థానాన్ని భర్తీ చేసేందుకు సమర్థులైన యువకులు అందుబాటులో ఉండడం కోచ్ గంభీర్‌కు సానుకూలాంశం. కానీ బౌలర్ల విషయంలోనే పరిస్థితి ఆశాజనకంగా లేదు. గాయం నుంచి పూర్తిగా కోలుకొని షమి పునరాగమనం చేసినా.. అతడు కెరీర్ చరమాంకంలో ఉంటాడు. సిరాజ్, ఆకాశ్‌దీప్ ఆకట్టుకుంటున్నా.. బుమ్రా, షమి స్థాయిని అందుకోలేకపోతున్నారు. అవేశ్ ఖాన్, ఖలీల్ అహ్మద్ భవిష్యత్ ఆశాకిరణాలుగా అంచనా వేస్తున్నారు. కానీ నిలకడ, ఫిట్‌నెస్ లేకపోవడం వారిద్దరికీ ప్రతికూలంగా మారింది. ఇక, ఉమ్రాన్ మాలిక్ విఫలమయ్యాడు. ముకేష్ కుమార్, వైశాఖ్ విజయ్ కుమార్, విద్యుత్ కావేరప్ప ఉన్నా, బ్యాటర్లలో గుబులు పుట్టించేంత పేస్ వీరి బౌలింగ్‌లో కనిపించడంలేదు. అత్యంత వేగవంతమైన బంతులు విసురుతూ మయాంక్ యాదవ్ సంచలనం సృష్టిస్తున్నా గాయాల బెడద ఎదుర్కొంటున్నాడు. ఫిట్‌నెస్ కాపాడుకోగలిగితే మయాంక్‌కు తిరుగుండదు. మరోవైపు సీమ్ బౌలింగ్ ఆల్‌రౌండర్ కొరత కూడా జట్టును వేధిస్తోంది. హార్దిక్ పాండ్యానేమో టెస్ట్ క్రికెట్‌పట్ల ఆసక్తి చూపడం లేదు. ఈ క్రమంలో తెలుగు పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ భావితారగా తెరపైకి వచ్చాడు. మరి అతడు తన సత్తాను నిరూపించుకుంటాడేమో చూడాలి.

ఓపెనర్‌గా ఎవరంటే..

రోహిత్ రిటైర్ అయితే..యశస్వీ జైస్వాల్‌కు తోడుగా ఇన్నింగ్స్‌ను ఎవరు ఆరంభిస్తారనేది మరో చర్చ. అభిమన్యు ఈశ్వరన్, రుతురాజ్ గైక్వాడ్, సాయి సుదర్శన్ రేసులో ఉన్నారు. 27 ఫస్ట్‌క్లాస్ సెంచరీలతో ఈశ్వరన్ ముందంజలో ఉన్నాడు. కానీ పెద్ద మ్యాచ్‌ల్లో ఒత్తిడిని తట్టుకోలేడనే అపప్రథ ఈశ్వరన్‌పై ఉంది. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో ధనాధన్ బ్యాటింగ్ చేసే రుతురాజ్ శైలి టెస్ట్ క్రికెట్‌కు నప్పుతుందా అనేది ప్రశ్న. దాంతో ఎక్కువసేపు క్రీజులో నిలవడంతోపాటు చక్కటి టెక్నిక్ కలిగిన సాయి సుదర్శన్ ఉత్తమం. ఓపెనర్‌గానే కాదు నెంబర్ 3లోనూ బ్యాటింగ్ చేయగల సమర్థుడు సుదర్శన్. తదుపరి స్థానం విరాట్ కోహ్లీది. టెస్ట్ అరంగేట్రంలోనే అర్ధ శతకం బాదిన దేవదత్ పడిక్కళ్..విరాట్ స్థానానికి చక్కగా సరిపోతాడు. బౌలింగ్‌తోపాటు బ్యాటింగ్‌లోనూ రాణించే అక్షర్ పటేల్.. ఆల్‌రౌండర్ జడేజాకు ప్రత్యామ్నాయంగా కనిపిస్తున్నాడు. కానీ స్పిన్‌కు అనుకూలించని పిచ్‌లపై బౌలింగ్‌లో తేలిపోవడం అక్షర్‌కు మైనస్. పుణెలో 11 వికెట్లు తీయడంతోపాటు 2021 బ్రిస్బేన్ టెస్ట్‌లో బ్యాటింగ్‌తో భళా అనిపించిన వాషింగ్టన్ సుందర్..జడేజా-అశ్విన్‌ల వారసుడిగా భావిస్తున్నారు.

ప్రాక్టీస్‌కు అందరూ రావాల్సిందే!



ముంబై: న్యూజిలాండ్‌తో తొలి రెండు టెస్ట్‌ల్లో భారీ ఓటమి నేపథ్యంలో భారత జట్టు యాజమాన్యం కఠినమైన నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. సాధారణంగా జట్టు స్టార్ ఆటగాళ్లకు ప్రాక్టీస్ నుంచి మినహాయింపు ఉంటుంది. ఇక న్యూజిలాండ్‌తో ఇక్కడ జరిగే మూడో టెస్ట్‌కు సంబంధించి ఈనెల 30, 31 తేదీలను టీమిండియా ప్రాక్టీస్‌కు కేటాయించారు. దీనికి జట్టు ఆటగాళ్లంతా తప్పకుండా హాజరు కావాలని గంభీర్ ఆధ్వర్యంలోని జట్టు యాజమాన్యం ఆదేశించినట్టు తెలిసింది. అంటే స్టార్లు రోహిత్, విరాట్, బుమ్రా సైతం ప్రాక్టీస్‌లో పాల్గొనాల్సిందేనన్నమాట!

మళ్లీ చెన్నై తరఫున ధోనీ?



న్యూఢిల్లీ: టీమిండియా మాజీ ఆటగాడు ధోనీ వచ్చే ఏడాది జరిగే ఐపీఎల్‌లో కనిపించవచ్చునే సంకేతాలు వెలువడుతున్నాయి. అట్టిపెట్టుకొనే వారి జాబితాలో ధోనీ పేరు దాదాపుగా ఉంటుందని చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) సీఈవో కాశీ విశ్వనాథన్ చెప్పాడు. 'మరికొన్నేళ్లు క్రికెట్‌ను ఆస్వాదించాలనే కోరికను ధోనీ వ్యక్తం చేశాడు. మాకు అంతకంటే ఏం కావాలి?' అని కాశీ పేర్కొన్నాడు. అయితే, ధోనీని రిటైన్ చేసుకోవాలంటే ఐపీఎల్ రూల్స్ ప్రకారం అతడిని అన్‌క్యాప్డ్ ప్లేయర్‌గానే పరిగణించాలి. కాగా, సీఎస్‌కే రిటైన్ జాబితాలో జడేజా, కెప్టెన్ రుతురాజ్, పేసర్ మతీష పతిరన టాప్-3లో ఉన్నట్టు సమాచారం.

'ఎమర్జింగ్' విజేత అఫ్ఘాన్

ఫైనల్లో లంక ఓటమి

అల్‌అమెరాత్ (ఒమన్): ఎమర్జింగ్ టీమ్స్ ఆసియా కప్ టీ20 టోర్నీలో అఫ్ఘానిస్థాన్ 'ఎ' జట్టు విజేతగా నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్లో అఫ్ఘానిస్థాన్ 7 వికెట్లతో శ్రీలంక 'ఎ' జట్టును ఓడించింది. తొలుత లంక 20 ఓవర్లలో 133/7 స్కోరు చేసింది. సహన్ అరాచిగే (64 నాటౌట్) సత్తా చాటాడు. అనంతరం అఫ్ఘాన్ 18.1 ఓవర్లలో 134/3 స్కోరు చేసి నెగ్గింది. అతల్ (55 నాటౌట్), కరీమ్ జానత్ (33) రాణించారు.

విండీస్‌కు ఊరట విజయం

పల్లెకెలె: ఓపెనర్ ఎవిన్ లూయిస్ (102 నాటౌట్) సెంచరీతో చెలరేగిన వేళ..శ్రీలంక పర్యటనను వెస్టిండీస్ విజయంతో ముగించింది. శనివారం రాత్రి జరిగిన ఆఖరి వన్డేలో విండీస్ 8 వికెట్లతో నెగ్గింది. అయితే మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-1తో శ్రీలంక ఇంతకు ముందే కైవసం చేసుకుంది. ఇక వర్షం బారిన పడిన ఈ మ్యాచ్‌ను 23 ఓవర్ల చొప్పున కుదించారు. తొలుత లంక 23 ఓవర్లలో 156/3 స్కోరు చేసింది. లంక ఇన్నింగ్స్ మధ్యలో వర్షం కారణంగా ఐదు గంటలు మ్యాచ్ ఆగిపోయింది. దీంతో విండీస్ లక్ష్యాన్ని 23 ఓవర్లలో 195గా నిర్ధారించారు. అయితే, విండీస్ 22 ఓవర్లలోనే 196/2 స్కోరు చేసి నెగ్గింది.

పారా షట్లర్లకు 24 పతకాలు

టోక్యో: అంతర్జాతీయ పారా బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత పారా షట్లర్లు సత్తా చాటారు. జపాన్ పారా బ్యాడ్మింటన్ ఇంటర్నేషనల్ టోర్నీలో ఏకంగా 24 పతకాలు కొల్లగొట్టారు. ఇందులో ఆరు స్వర్ణాలు, తొమ్మిది రజతాలు, తొమ్మిది కాంస్యాలు ఉన్నాయి. శిరాజన్ సింగిల్స్ స్వర్ణంతో పాటు డబుల్స్‌లోనూ పసిడి సాధించాడు.

రాధ పోరాడినా..

రెండో వన్డేలో భారత్‌పై కివీస్ విజయం



రాధా యాదవ్ (4/69, 48)

సైమా (29)

సంక్షిప్త స్కోర్లు

న్యూజిలాండ్: 50 ఓవర్లలో 259/9 (డివైన్ 79, బేట్స్ 58, గ్రీన్ 42; రాధ 4/69, దీప్తి 2/30).

భారత్: 47.1 ఓవర్లలో 183 ఆలౌట్ (రాధ 48, సైమా 29; డివైన్ 3/27, తహూహు 3/42).

అహ్మదాబాద్: ఆల్‌రౌండర్ రాధా యాదవ్ (4/69, 48) పోరాడినా.. మిగతా బ్యాటర్ల వైఫల్యంతో భారత మహిళ జట్టుకు ఓటమి తప్పలేదు. కెప్టెన్ సోఫీ డివైన్ (79, 3/27) బ్యాట్, బంతితో అదరగొట్టడంతో.. ఆదివారం జరిగిన రెండో వన్డేలో భారత్‌ను 76 పరుగుల తేడాతో చిత్తు చేసిన న్యూజిలాండ్ 1-1తో సిరీస్‌ను సమం చేసింది. తొలుత కివీస్ 50 ఓవర్లలో 9 వికెట్లకు 259 పరుగుల భారీ స్కోరు చేసింది. ఓపెనర్లు సుజీ బేట్స్ (58), ప్లిమ్మర్ (41) మొదటి వికెట్‌కు 87 పరుగుల భాగస్వామ్యంతో పటిష్ట పునాది వేశారు. లారెన్ డౌన్ (3), బ్రూకీ హాలిడే (8) స్వల్ప స్కోర్లకే వెనుదిరగడంతో.. కివీస్ 139/4తో నిలిచింది. అయితే, డివైన్, మ్యాడీ గ్రీన్ (42) ఐదో వికెట్‌కు 82 పరుగుల భాగస్వామ్యంతో జట్టుకు భారీ స్కోరును అందించారు. దీప్తి శర్మ 2 వికెట్లు పడగొట్టింది. ఛేదనలో భారత్ 47.1 ఓవర్లలో 183 పరుగులకు ఆలౌటైంది. టాప్-8లో హర్మన్ (24) మినహా ఎవరూ రెండు పదుల స్కోరు కూడా చేయలేదు. తొలి ఓవర్‌లోనే స్మృతి మంధాన (0)ను తహూహు డకౌట్ చేయడంతో భారత పతనం ఆరంభమైంది. ఆ తర్వాత షఫాలీ వర్మ (11), యాస్తిక భాటియా (12), జెమీమా రోడ్రిగ్స్ (17), హర్మన్, తేజల్ (15), అరుంధతి (2) పెవిలియన్‌కు క్యూ కట్టడంతో 108/8తో భారత ఇన్నింగ్స్ ఎంతో సేపు సాగదనిపించింది. ఈ దశలో రాధ, సైమా ఠాకూర్ (29) తొమ్మిదో వికెట్‌కు 70 పరుగుల భాగస్వామ్యంతో ఘోర పరాజయాన్ని తప్పించారు. తహూహు 3 వికెట్లు పడగొట్టింది. సిరీస్ నిర్ణాయక మూడో వన్డే మంగళవారం జరగనుంది.



ఉత్కం'టై'

తలైవాస్, జైపూర్ మ్యాచ్ డ్రా

హైదరాబాద్: రైడర్ సచిన్ సోలో టాకిల్‌తో.. ఓడాల్సిన మ్యాచ్‌లో తమిళ తలైవాస్ టైతో గట్టెక్కింది. గచ్చిబౌలీ ఇండోర్ స్టేడియంలో ఆదివారం తలైవాస్, జైపూర్ పింక్ పాంథర్స్ మధ్య హోరాహోరీగా సాగిన మ్యాచ్ 30-30 స్కోరుతో డ్రాగా ముగిసింది. సచిన్ 11 రైడ్ పాయింట్లతో సూపర్-10 సాధించాడు. జైపూర్ ప్లేయర్లు అర్జున్ దేశ్వాల్ 7 పాయింట్లు, వికాస్ ఖండోలా 6 పాయింట్లు స్కోరు చేశారు. తలైవాస్ 29-30తో ఉన్న సమయంలో జైపూర్ తరఫున ఆఖరి రైడ్‌కు వచ్చిన రెజా టైమ్ కిల్ చేయాలని చూశాడు. కానీ, సచిన్ అనూహ్యంగా అతడిని పట్టేసి తలైవాస్‌ను పరాజయం నుంచి కాపాడాడు. అనంతరం జరిగిన మరో మ్యాచ్‌లో యూపీ యోధాస్ 35-29 స్కోరు తేడాతో గుజరాత్ జెయింట్స్‌పై విజయం సాధించింది. సోమవారం జరిగే పోటీలో హరియాణా స్టీలర్స్‌తో దబాంగ్ ఢిల్లీ, తెలుగు టైటాన్స్‌తో పట్నా పైరేట్స్ అమీతుమీ తేల్చుకోనున్నాయి.

బిజినెస్

గృహోపకరణాలకు పండగ జోష్

» 30% వరకు పెరగనున్న విక్రయాలు

న్యూఢిల్లీ: ఈ పండగల సీజన్ కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ కంపెనీలకు బాగానే కలిసొస్తోంది. గత ఏడాదితో పోలిస్తే ఈ సంవత్సరం వీటి అమ్మకాలు 30 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నాయి. ఆఫర్ల జోష్‌తో అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ఈ-కామర్స్ దిగ్గజాల అమ్మకాలూ ఈ పండగల సీజన్‌లో మరింత ఊపందుకున్నాయి. గత ఏడాదితో పోలిస్తే ప్రీమియం ఉత్పత్తుల డిమాండ్ అమాంతం పెరగడం ఈ సంవత్సరం ప్రత్యేకత. పెద్దపెద్ద నగరాలతో పాటు ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లోనూ ఇదే ట్రెండ్ కనిపిస్తోందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. అధిక సామర్థ్యం, మంచి ఇంధన సామర్థ్యం, పెద్ద సైజుతో పాటు ఏఐ, ఐఓటీ వంటి అధునాతన టెక్నాలజీ హంగులు ఉండే హై ఎండ్ టీవీలు, వాషింగ్ మెషిన్లు, డిష్‌వాషర్లు, డబుల్ డోర్ ఫ్రిజ్‌ల వంటి వాటికి అధిక ధర చెల్లించేందుకు వినియోగదారులు ఏ మాత్రం ఆలోచించడం లేదని వెల్లడించాయి.

నోయెల్‌కు ఇంకా అనుభవం రావాలి

రతన్ టాటా అంతరంగం

న్యూఢిల్లీ: తన వారసుడుగా టాటా గ్రూప్ హోల్డింగ్ కంపెనీ టాటా సన్స్ పగ్గాలు నోయెల్ టాటా చేపట్టాలంటే అతనికి మరింత అనుభవం అవసరమని రతన్ టాటా అభిప్రాయపడ్డారు. టాటా సన్స్ వంటి భారీ కంపెనీ కోసం సంక్లిష్టమైన కార్యాలు చేపట్టడానికి ఆ అనుభవం దోహదపడుతుందన్నది ఆయన అభిప్రాయం. ఇటీవల విడుదలైన రతన్ జీ జీవిత చరిత్ర "రతన్ టాటా ఎ లైఫ్" పుస్తకంలో ఆయన ఈ అభిప్రాయాలు ప్రకటించారు. రతన్‌జీ మరణానంతరం టాటా సన్స్ చైర్మన్‌గా ఇటీవలే నోయెల్ నియమితులయ్యారు. రతన్ టాటా వారసుని కోసం 2011 మార్చిలో నిర్వహించిన ఇంటర్వ్యూలకు హాజరైన పలువురు అభ్యర్థుల్లో నోయెల్ కూడా ఉన్నారు. ఆ సెలక్షన్ కమిటీకి రతన్ టాటా దూరంగా ఉన్నారు. కాని అలా దూరంగా ఉండడం పట్ల ఆయన తదుపరి దశలో విచారించినట్టు రచయిత థామస్ మాథ్యూ ఆ పుస్తకంలో రాశారు. టాటా గ్రూప్ చైర్మన్ కావాలంటే ఆ వ్యక్తికి "సాహసం, వ్యాపార చాతుర్యం" కావాలని సంస్థ వ్యవస్థాపకుడు జేఆర్‌డీ టాటా నిర్దేశించడమే నోయెల్ విషయంలో రతన్‌జీ ఈ వ్యాఖ్యలు చేయడానికి కారణమని అంటున్నారు.

● సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో జీజీ ఇంజనీరింగ్ లిమిటెడ్ నికర లాభం ఏకంగా 1,300 శాతం వృద్ధి చెంది రూ.75.31 లక్షల నుంచి రూ.10.52 కోట్లకు చేరుకుంది. సమీక్షా త్రైమాసికంలో మొత్తం రెవెన్యూ కూడా రూ.73.24 కోట్ల నుంచి రూ.105.70 కోట్లకు పెరిగింది.

● సన్‌ఫీస్ట్ మామ్స్ మ్యాజిక్ చేపట్టిన విల్ ఆఫ్ చేంజ్ (వీలునామా మార్పు) క్యాంపెయిన్‌కు దేశవ్యాప్తంగా మంచి స్పందన లభిస్తోందని ఐటీసీ వెల్లడించింది. ఈ కార్యక్రమం ద్వారా దాదాపు 7శాతం మంది కుమార్తెలు సమాన వారసత్వ హక్కును అందుకున్నారని తెలిపింది. వారసత్వ ఆస్తి విషయంలో కుమార్తెలకు ఎదురవుతున్న అన్యాయాన్ని వివరించటమే కాకుండా వారికి సమాన హక్కులు కల్పించేందుకు ఈ క్యాంపెయిన్ దోహదపడుతోందని తెలిపింది.

● రొయ్యల్లో వస్తున్న ఎంటెరోసైటోజూన్ హెపోపెనాయ్ (ఈహెచ్‌పీ) ఇన్ఫెక్షన్లను నివారించటానికి బహుళ జాతి సంస్థ కెమిన్.. పాథోరోల్ పేరుతో ప్రత్యేక ఉత్పత్తిని ఆంధ్రప్రదేశ్ మార్కెట్లోకి తీసుకువచ్చింది. ఈ పాథోరోల్.. రొయ్యల్లో వస్తున్న ఇన్ఫెక్షన్లను తగ్గించటమే కాకుండా వాటి ఆరోగ్యాన్ని మరింతగా పెంచుతుందని కంపెనీ తెలిపింది. దేశీయంగా రొయ్యల సాగులో ఏపీ వాటా 73%ఉంది.

● ఆక్వా పంబ్లింగ్స్ లిమిటెడ్‌కు చెందిన బాత్‌వేర్ బ్రాండ్.. ప్లంబర్ బాత్‌వేర్ మార్కెట్లోకి ఎక్సోటికా పేరుతో ఫాసెట్స్ (కుళాయిలు)ను విడుదల చేసింది. వీటి ధరలు రూ.2,500 నుంచి రూ లక్ష వరకు ఉన్నాయి. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రధాన నగరాల్లో ఈ ఉత్పత్తులు అందుబాటులో ఉండనున్నాయి.

బులియన్ ధరలు మరింత పైకే



కిలో వెండి రూ.1.25 లక్షలు!

రూ.లక్ష దాటనున్న పసిడి ధర

న్యూఢిల్లీ: బంగారం, వెండి ధరలు ఇప్పట్లో దిగొచ్చే సూచనలు కనిపించడం లేదు. కిలో వెండి ధర ఇప్పటికే రూ.లక్షకు చేరువైంది. పది గ్రాముల పసిడి ధరా రూ.80,000కు దగ్గరలో ఉంది. వీటి ధరలు మరింత పెరిగి వచ్చే దీపావళి లేదా 2026 జనవరి నాటికి కిలో వెండి ధర రూ.1.25 లక్షలకు, 10 గ్రాముల మేలిమి (24 కేరట్స్) బంగారం ధర రూ.లక్షకు చేరే అవకాశం ఉందని బ్రోకరేజీ సంస్థ మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్సియల్ సర్వీసెస్ (ఎంఓఎఫ్ఎస్ఎల్) ఒక నివేదికలో తెలిపింది. ఈ సంవత్సరం ఇప్పటికే మన దేశంలో వెండి 40 శాతం, పసిడి 30 శాతానికిపైగా లాభాలు పంచాయి. వచ్చే 12-15 నెలల్లో బంగారం, వెండి ధరలను ఈ కింది అంశాలు ముందుకు నడిపిస్తాయని ఎంఓఎఫ్ఎస్ఎల్ అంచనా.

వడ్డీ రేట్ల కోతలు: అమెరికా ఫెడ్ రిజర్వ్, ఈసీబీ, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ (బీఓఈ)తో సహా ప్రధాన దేశాల కేంద్ర బ్యాంకులు ఇప్పటికే వడ్డీ రేట్ల కోత ప్రారంభించాయి. ఆర్‌బీఐ కూడా త్వరలోనే ఇందుకు సిద్ధమవుతుందనే అంచనాలు వినిపిస్తున్నాయి. కేంద్ర బ్యాంకులు వడ్డీ రేట్లు తగ్గించినప్పుడల్లా బంగారం, వెండి ధరలు పెరగడం సాధారణంగా జరిగే విషయం.

డిమాండ్: కొవిడ్ ప్రభావం నుంచి కోలుకున్నా ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఇంకా అస్తవ్యస్థంగానే ఉంది. ప్రపంచంలో రెండో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ చైనా ఇంకా ఆపసోపాలు పడుతోంది. జర్మనీ, జపాన్ ఆర్థిక వ్యవస్థలైతే మాంద్యానికి చేరువలో ఉన్నాయి. ఈ అనిశ్చితుల నేపథ్యంలో చైనాతో సహా ప్రధాన కేంద్ర బ్యాంకులు తమ ఫారెక్స్ నిల్వల్లో భాగంగా పెద్ద మొత్తంలో బంగారం నిల్వలు పెంచుకుంటున్నాయి. పారిశ్రామిక అవకాశాలూ తోడవడంతో అంతర్జాతీయ మార్కెట్లో వెండి ధర కూడా చుక్కలంటుతోంది.

స్టాక్ మార్కెట్ అనిశ్చితి: దాదాపు రెండేళ్లపాటు రేసు గుర్రాల్లా పరుగెత్తిన దేశీయ స్టాక్ మార్కెట్లు ఇప్పుడు ఆపసోపాలు పడుతున్నాయి. దీంతో లాభాల సంగతి దేవుడెరుగు, పెట్టుబడుల విలువ తగ్గకుండా ఉంటే చాలని రిటైల్ మదుపరులు సురక్షిత పెట్టుబడిగా భావించే బంగారం, వెండి వైపు మళ్లుతున్నారు. వీటి ధరల పెరుగుదలకు ఇది కూడా ప్రధాన కారణం.

అంతర్జాతీయ ఉద్రిక్తతలు: రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ఇంకా రావణ కాష్టంలా రగులుతూనే ఉంది. ఇజ్రాయెల్-హెజ్బొల్లా-ఇరాన్ వైరం ఇందుకు మరింత ఆజ్యం పోస్తోంది. ఈ నేపథ్యంలో చమురు సెగ ఎక్కడ కొరలు చాస్తుందోనని భారత్‌తో సహా అనేక దేశాలు వణికి పోతున్నాయి. బంగారం, వెండి ధరల పెరుగుదలకూ అంతర్జాతీయ ఉద్రికతలు మరింత పొగ పెడుతున్నాయి.

రూపాయి పతనం: అమెరికా డాలర్‌తో మన రూపాయి మారకం రేటు గింగిరాలు పోతోంది. ఇప్పటికే ఒక డాలర్‌కు రూ.84 స్థాయికి పడిపోయింది. డాలర్‌తో రూపాయి మారకం రేటును రూ.84 దిగువన నిలబెట్టేందుకు ఆర్‌బీఐ ఈ సంవత్సరం ఇప్పటికే తన ఫారెక్స్ నిల్వల నుంచి 3,000 కోట్ల డాలర్ల (సుమారు రూ.2.52 లక్షల కోట్లు) వరకు ఖర్చు చేసింది. అయినా డాలర్‌తో రూపాయి మారకం రేటు పతనమవుతూనే ఉంది. త్వరలోనే ఇది రూ.84.25ను తాకే అవకాశం ఉందనే అంచనాలు వినిపిస్తున్నాయి. ఈ అంశం కూడా బంగారం, వెండి ధరలు మరింత పెరిగేలా చేస్తోంది.

23,750 దిగువన బేరిష్

(అక్టోబరు 28-నవంబరు 1 తేదీల మధ్య వారానికి)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

టెక్నో ట్రెండ్స్

నిఫ్టీ గత వారం 24,978-24,074 పాయింట్ల మధ్యన కదలాడి 673 పాయింట్ల నష్టంతో 24,181 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 23,750 కన్నా దిగువన ముగిస్తే స్వల్పకాలానికి బేరిష్ అవుతుంది.

20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 24,331, 24,555, 24,780, 25,205 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50 డిఎంఏ 200 డిఎంఏ కన్నా దిగువకు రావడం దీర్ఘకాలిక బేరిష్ ట్రెండ్ సంకేతం.

బ్రేకౌట్ స్థాయి : 24,500 బ్రేక్‌డౌన్ స్థాయి : 23,750

నిరోధ స్థాయిలు: 24,400, 24,500, 24,600 (24,300 పైన బుల్లిష్)

మద్దతు స్థాయిలు : 23,950, 23,850, 23,750 (24,050 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



28న తేదీ			
హైదరాబాద్	520	విజయవాడ	545
వరంగల్	522	గోదావరి	540
చిత్తూరు	578	విశాఖపట్నం	545
		డజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	120	విజయవాడ	120
వరంగల్	120	గుంటూరు	123
కరీంనగర్	120	ఒంగోలు	123
మహబూబ్‌నగర్	120	చిత్తూరు	126
కర్నూలు	120	నెల్లూరు	126
విశాఖపట్నం	105	అనంతపురం	126
గోదావరి	120		

టెక్ వ్యూ

కీలక మద్దతు స్థాయి 24,000



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం ప్రారంభంలో కీలక నిరోధం 25,000 వద్ద విఫలమై తదుపరి నాలుగు సెషన్లలోనూ డౌన్‌ట్రెండ్‌ను కొనసాగిస్తూ 673 పాయింట్ల భారీ నష్టంతో వారం కనిష్ఠ స్థాయి 24,180 వద్ద ముగిసింది. నాలుగు వారాల క్రితం ప్రారంభమైన డౌన్‌ట్రెండ్‌లో గరిష్ఠ స్థాయి 26,250 నుంచి 2,100 పాయింట్ల మేరకు నష్టపోయింది. మిడ్‌క్యాప్-100 ఇండెక్స్ కూడా 3,370 పాయింట్ల మేరకు భారీగా నష్టపోయింది. గత కొద్ది వారాల్లో ఈ సూచీ 6,000 పాయింట్లు దిగజారింది. స్మాల్‌క్యాప్-100 సూచీ కూడా 1,230 పాయింట్ల మేరకు నష్టపోయింది. ఈ రెండు సూచీలు కూడా రెండు వారాల్లో కనివిని ఎరుగని నష్టాన్ని చవిచూశాయి. నిఫ్టీ ప్రస్తుతం మానసిక అవధి, కీలక మద్దతు స్థాయి 24,000కి చేరువవుతోంది. గత జూన్, ఆగస్టు నెలల్లో ఇక్కడ బలమైన బాటమ్‌లు ఏర్పడ్డాయి. ఇక్కడ నిలదొక్కుకుని పాజిటివ్ ట్రెండ్‌లోకి ప్రవేశించాల్సి ఉంది.

బుల్లిష్ స్థాయిలు: సానుకూల ట్రెండ్ కోసం నిఫ్టీ తొలుత నిలదొక్కుకుని కన్సాలిడేట్ కావాలి. మార్కెట్ తీవ్ర ఆటుపోట్లలో ఉంది. ట్రెండ్‌లో సానుకూలత కోసం ప్రధాన నిరోధం 24,300 కన్నా పైన నిలదొక్కుకోవాల్సి ఉంది. మరో ప్రధాన స్వల్పకాలిక నిరోధం 24,550.

బేరిష్ స్థాయిలు: ప్రపంచ మార్కెట్లలో శుక్రవారం నాటి బలహీనత కారణంగా ఈ వారం బలహీనంగానే ప్రారంభం కావచ్చు. మరింత బలహీనతను నివారించుకోవాలంటే ప్రధాన స్వల్పకాలిక మద్దతు స్థాయి 24,000 వద్ద నిలదొక్కుకుని తీరాలి. ఇక్కడ స్వల్పకాలిక కన్సాలిడేషన్ ఉండవచ్చు. విఫలమైతే మరింత బలహీనపడుతుంది.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ కూడా బలమైన డౌన్‌ట్రెండ్‌ను సాధించి 1,300 పాయింట్ల మేరకు నష్టపోయి చివరికి 50,780 వద్ద ముగిసింది. గత కొద్ది వారాల్లో ఈ సూచీ 4,000 పాయింట్ల వరకు నష్టపోయి మానసిక అవధి 50,000 చేరువకు వచ్చింది. ప్రధాన నిరోధం 51,000. పాజిటివ్ ట్రెండ్ కోసం ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవాలి. 50,000 వద్ద విఫలమైతే అప్రమత్త సంకేతం ఇస్తుంది.

పాటర్న్: ట్రెండ్‌లో సానుకూలత కోసం 24,000 వద్ద "అడ్డంగా ఏర్పడిన ప్రధాన సపోర్ట్ ట్రెండ్‌లైన్" వద్ద నిలదొక్కుకుని తీరాలి. మార్కెట్ గత వారం 100 డీఎంఏ కన్నా దిగువకు వచ్చింది. ఆర్ఎస్ఐ సూచీల ప్రకారం మార్కెట్ స్వల్పకాలిక ఓవర్‌సోల్డ్ స్థితికి చేరువవుతోంది. కనిష్ఠ స్థాయిల్లో కన్సాలిడేషన్ ఉండవచ్చుననేందుకు ఇది సంకేతం.

టైమ్: ఈ సూచీ ప్రకారం బుధవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	24,240, 24,300
మద్దతు	24,060, 24,000

అప్రమత్తతే మేలు!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం మిశ్రమంగా కదలాడే అవకాశాలున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ఒక దిశ వస్తేనే కానీ మూమెంటమ్ మారటం కష్టం. ఇజ్రాయెల్, ఉక్రెయిన్ యుద్ధం మళ్లీ కొత్త మలుపులు తీసుకుంటే, అంతర్జాతీయంగా రాజకీయ పరిణామాలు మారితే మాత్రం మార్కెట్లు మరింతగా పడిపోవచ్చు. ఇప్పటికే బెంచ్‌మార్క్ ఇండెక్స్‌లు నిఫ్టీ, సెన్సెక్స్ జీవితకాల గరిష్ఠాల నుంచి 8 శాతం మేరకు పతనమయ్యాయి. ప్రస్తుతం సూచీలకు మద్దతు లభించటం అత్యంత ఆవశ్యకం. ఇన్వెస్టర్ల సెంటిమెంట్ మారితేనే కొనుగోళ్లకు ఆస్కారం ఉంటుంది.

స్టాక్ రికమండేషన్స్

థర్మాక్స్ : జీవితకాల గరిష్ఠ స్థాయి నుంచి 30 శాతం మేర దిద్దుబాటు జరిగిన ఈ షేరుకు రూ.4,250 వద్ద గట్టి మద్దతు లభించింది. సెప్టెంబరులో మూమెంటమ్ లభించింది. నెగటివ్ మార్కెట్లోనూ ఈ షేరు నిలకడగా కదలాడుతోంది. గత శుక్రవారం ఈ షేరు 4.77 శాతం లాభంతో రూ.5,431 వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లోకి రూ.5,300 శ్రేణిలో ప్రవేశించి రూ.5,450 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.5,260 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

మ్యాక్స్ హెల్త్: మదుపరులు లాభాలు స్వీకరించటం, మార్కెట్ సెంటిమెంట్ ప్రతికూలంగా ఉండటంతో ఈ షేరు 20 శాతం మేర పతనమైంది. ప్రస్తుతం ఈ షేరు సైడ్‌వేస్‌లో చలిస్తోంది. సెప్టెంబరు త్రైమాసిక ఫలితాలు మెరుగ్గా ఉంటాయన్న అంచనాలు కనిపిస్తున్నాయి. గత శుక్రవారం 3.51 శాతం లాభంతో రూ.938 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లోకి ఇన్వెస్టర్లు రూ.930 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.1,050 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. రూ.900 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

టొరెంట్ ఫార్మా: నిఫ్టీ, సెన్సెక్స్‌తో పోల్చితే ఈ షేరు మెరుగ్గా కదలాడుతోంది. ఈపీఎస్, అమ్మకాలు క్రమంగా పెరుగుతుండటం శుభసూచకం. సెప్టెంబరు త్రైమాసికంలో మంచి ఫలితాలు విడుదల చేయవచ్చనే అంచనాలున్నాయి. గత శుక్రవారం ఈ షేరు 3.36 శాతం లాభంతో రూ.3,432 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లో రూ.3,400 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.3,550 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించచ్చు. అయితే రూ.3,370 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

యాక్సిస్ బ్యాంక్: ఏడాది గరిష్ఠ స్థాయి నుంచి 12 శాతం మేర పతనమైన ఈ షేరు ప్రస్తుతం కీలక మద్దతు స్థాయిల వద్ద కదలాడుతోంది. వాల్యూమ్, మూమెంటమ్ క్రమంగా పెరుగుతోంది. ఆర్థిక ఫలితాలు ఇచ్చిన కిక్కుతో గత శుక్రవారం 1.85 శాతం లాభంతో రూ.1,189 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లో.. మదుపరులు రూ.1,180 వద్ద పొజిషన్ తీసుకుని రూ.1,300 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,160 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

దివీస్ లేబొరేటరీస్: నిఫ్టీతో పోలిస్తే మెరుగ్గా ట్రేడవుతున్న ఈ షేరు ప్రస్తుతం ఆకర్షణీయమైన ధరలో లభిస్తోంది. 10 శాతం మేర దిద్దుబాటు జరగటంతో ఇన్వెస్టర్లు ఆసక్తి చూపిస్తున్నారు. గత శుక్రవారం ఈ షేరు స్వల్ప లాభంతో రూ.5,780 వద్ద క్లోజైంది. మూమెంటమ్ ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో రూ.5,750 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.6,050 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. రూ.5,707 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com



నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
సోమవారం | 28-10-2024
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru
విజయవాడ సిటీ**

డిసెంబరు 9 నుంచి సీ ప్లేన్ సేవలు



ప్రకాశం బ్యారేజీ నుంచి శ్రీశైలం వరకు సర్వీసులు

కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

విశాఖ-బెజవాడ మధ్య మరో 2 విమానాలు

12

జంతర్‌మంతర్ జగన్మాయ!

ఆంధ్రజ్యోతి ప్రత్యేకం



అధికారమే పెట్టుబడిగా అక్రమ కుబేరుడి అవతారం

20 ఏళ్లలో వేల రెట్లు పెరిగిన సంపద.. 2004లో ఆయన ఆస్తి రూ.1.74 కోట్లే


2024 ఎన్నికల అఫిడవిట్‌లో 757 కోట్లు.. మార్కెట్‌లో వాటి విలువ వేల కోట్లు

తండ్రి సీఎంగా ఉండగా అక్రమార్జన.. సీబీఐ చార్జిషీట్లలో తీవ్ర అభియోగాలు

జగన్ సీఎం అయ్యాక మరింత సంపద.. రిలయన్స్, జియోలోనూ పెట్టుబడులు

భార్య భారతి, ఇద్దరు కుమార్తెల పేరిటా పెట్టుబడులు, బంగారు, వజ్రాభరణాలు

వైఎస్ సీఎం కాకముందు జగన్ ఆస్తులు 'సున్నా'తో ప్రారంభమయ్యాయనుకుంటే తండ్రి సీఎం అయ్యాక పైపైకి దూసుకెళ్లాయి. ఇక జగన్ సీఎం అయ్యాక అవి రాకెట్ వేగం అందుకున్నాయి.



సొంతంగా విజయవంతమైన వ్యాపారాలు లేవు. సత్య నాదెళ్ల, సుందర్ పిచాయ్‌లా అసాధారణ ప్రతిభావంతుడూ కాదు. ఆ మాటకొస్తే.. 2004 వరకు వ్యక్తిగతంగా చెప్పుకోవడానికి తనకంటూ ప్రత్యేకతలంటూ ఏవీ లేవు. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయ్యాకే ఆయన కుమారుడిగా బాగా 'ఫేమస్' అయ్యారు. 2004లో జగన్ సంపద రూ.1.74 కోట్లు (ఐటీ రిటర్నుల ప్రకారం) ఉండగా... నేడు ఆయన కుటుంబ ఆస్తి రూ.757 కోట్లు (ఎన్నికల అఫిడవిట్ ప్రకారం). మార్కెట్ విలువ ప్రకారం ఎన్ని వేల కోట్లు ఉంటుందో..! అంటే.. 20 ఏళ్లలోనే ఆయన సంపద వేల రెట్లు పెరిగింది. ఇది ఎలా సాధ్యమో..?

జగన్ సంపాదనకు నాడు తండ్రి అధికారమే పెట్టుబడి. రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కంపెనీలను కబ్జా చేశారు. నాడు ప్రభుత్వం నుంచి 'మేళ్లు' పొందిన బడా పారిశ్రామిక వేత్తల నుంచి రూ.10 విలువ చేసే షేర్‌ను వందలు పెట్టి కొనేలా వాటిలో పెట్టుబడులు పెట్టించుకున్నారు. అంటే.. క్విడ్ ప్రో కో అన్నమాట. తండ్రి సీఎంగా ఉన్నప్పుడు జగన్ అక్రమార్జన కొండలా పెరగగా... ఆయనే ముఖ్యమంత్రి అయ్యాక ఏకంగా ఆకాశం వైపు దూసుకుపోయింది.

జగన్ అక్రమ సామ్రాజ్యంపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనాలు నేటి నుంచి

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

మన దేశంలో ఎంతో మంది ముఖ్యమంత్రులు అయ్యారు. చాలామంది వారసులు రాజకీయాల్లోకి వచ్చారు. పలువురిపై అవినీతి ఆరోపణలు వచ్చాయి. కేసుల విచారణ కూడా ఎదుర్కొన్నారు. కానీ వైఎస్ రాజశేఖరరెడ్డి కుమారుడు జగన్మోహన్‌రెడ్డిలా అక్రమార్జనలో ఎవరూ అంత 'ఫేమస్' కాలేదు. ఎలాంటి పదవీ లేకపోయినా ఓ సీఎం కుమారుడిగా వేల కోట్ల అవినీతికి పాల్పడటం జగన్ ఘనత. రాజకీయ నాయకులే ముక్కున వేలేసుకునేలా

మిగతా 11వ పేజీలో...

'సరస్వతి'కి 'భూ'కంపం!

కంపెనీ కోసం వైఎస్ కుటుంబం తీసుకున్న భూములు తిరిగి ఇచ్చేయాలని రైతుల పట్టు

లేదా.. ఎకరాకు రూ.18 లక్షలివ్వాలని డిమాండ్

మాకు ఇచ్చిన హామీలు ఇప్పటికీ నెరవేర్చలేదు

మా భూములు ఇచ్చేస్తే సాగు చేసుకుంటాం

కాకుంటే పరిశ్రమ నిర్మించి ఉపాధి కల్పించాలి

మీడియాతో సరస్వతి భూ బాధితుల ఆవేదన

11



జగన్ విషనాగు

స్వప్రయోజనం కోసం తల్లిని కోర్టుకు ఈడ్చారు

అన్నపై మరోసారి షర్మిల నిప్పులు

వైఎస్ మరణానికి చంద్రబాబు కారణమైతే ఐదేళ్లు అధికారంలో ఉండి గాడిదలు కాశారా?

ప్రత్యేక విచారణ జరిపించలేదేం?

సాయిరెడ్డీ.. మీరూ జగన్ మోచేతి నీళ్లు తాగేవాళ్లేగా!

మీరు చదివింది కూడా ఆయన స్క్రిప్టే

అద్దంలో చూసుకున్నా మీ నేతకు చంద్రబాబే కనిపిస్తున్నట్లుగా ఉంది

ఆస్తుల్లో నలుగురు చిన్న బిడ్డలకూ సమాన వాటా అన్నది వైఎస్ ఆదేశం

అది అబద్ధమని మీ బిడ్డలపై ప్రమాణం చేస్తారా: షర్మిల

సాయిరెడ్డి ఆరోపణలపై ఆగ్రహం

అమరావతి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తన అన్న జగన్మోహన్‌రెడ్డిపై పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మళ్లీ విరుచుకుపడ్డారు. స్వప్రయోజనం కోసం తల్లిని కోర్టుకు ఈడ్చిన విషనాగుగా ఆయన్ను అభివర్ణించారు. తండ్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మరణానికి కారణమైన కాంగ్రెస్, చంద్రబాబుతో షర్మిల చేతులు కలిపారని.. జగన్ మళ్లీ సీఎం కాకూడదని ఆమె కంకణం కట్టుకున్నారని ఎంపీ విజయసాయిరెడ్డి ఆదివారం చేసిన వ్యాఖ్యలపై ఆమె 'ఎక్స్'లో మండిపడ్డారు. రాజశేఖర్‌రెడ్డి మరణానికి చంద్రబాబే కారణమైతే.. ఐదేళ్ల వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు గాడిదలు కాశారా అని ఆయన్ను నిలదీశారు. 'జగన్ ప్రత్యేక విచారణ ఎందుకు జరిపించలేదు? దర్యాప్తు చేసి నిజానిజాలు ఎందుకు బయటపెట్టలేదు? దోషులను ఎందుకు శిక్షించలేదు? అనుమానం ఉండి.. ఐదేళ్ల అధికారంలో ఉండి.. ఎందుకు ఒక్క ఎంక్వైరీ కూడా

మిగతా 11వ పేజీలో...

శత్రువులతో చేతులు కలిపి అన్నపై కుట్రలా?

జగన్ బెయిల్ రద్దు కోసమే ఇదంతా చేస్తున్నారు: సాయిరెడ్డి

రాజకీయాల్లో పిల్లాడినే.. బరిలో

భయపడేదే లేదు



తమిళనాడులోని విల్లుపురం జిల్లా విక్రవాండి వద్ద ఆదివారం నిర్వహించిన తొలి మహానాడులో మాట్లాడుతున్న తమిళగ వెట్రి కళగం(టీవీకే) అధినేత, సినీనటుడు విజయ్

బీజేపీ మాకు సైద్ధాంతిక ప్రత్యర్థి.. డీఎంకే రాజకీయ ప్రత్యర్థి

ద్రావిడ, తమిళ జాతీయవాద సిద్ధాంతాలు పాటిస్తాం

పెరియార్, కామరాజ్ వారసత్వాన్ని కొనసాగిస్తాం

తమిళ ప్రజలపై విశ్వాసంతో కెరీర్‌ను పీక్స్‌లో వదిలేసి వచ్చా

భారీ మహానాడు వేదికగా టీవీకే అధినేత, నటుడు విజయ్ సంచలన ప్రసంగం.. భారీగా తరలివచ్చిన కార్యకర్తలు

కుటుంబ పాలనను అంతం చేయడమే మా కర్తవ్యం

ద్రావిడ తరహా పాలన పేరిట మోసం.. డీఎంకేపై ధ్వజం

చెన్నై, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): 'రాజకీయాలు పాములాంటివి. నేను రాజకీయాల్లో చిన్న పిల్లాడినే కావచ్చు. నాకు అనుభవం కూడా లేకపోవచ్చు. అయినా బరిలోకి దిగిన తర్వాత ఎవ్వరికీ భయపడేదే లేదు' అని తమిళగ వెట్రి కళగం(టీవీకే) అధినేత, సినీనటుడు విజయ్ వ్యాఖ్యానించారు. తమ పార్టీకి బీజేపీ సైద్ధాంతిక ప్రత్యర్థి అయితే డీఎంకే రాజకీయ ప్రత్యర్థిగా ఆయన అభివర్ణించారు. తమిళనాడులోని విల్లుపురం జిల్లా

మిగతా 2వ పేజీలో...



శాన్‌ఫ్రాన్సిస్కోలో పారిశ్రామికవేత్తల భేటీలో మాట్లాడుతున్న మంత్రి లోకేశ్

పెట్టుబడులతో రండి

స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, అభివృద్ధి వికేంద్రీకరణ దిశగా ప్రభుత్వం అడుగులు

ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యం

ప్రవాసాంధ్రుల నుంచి పెట్టుబడుల కోసం ముఖ్యమంత్రి ఎదురుచూస్తున్నారు

గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతాం

శాన్‌ఫ్రాన్సిస్కో పారిశ్రామికవేత్తలతో భేటీలో మంత్రి లోకేశ్

రాష్ట్ర సమగ్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపు

అమరావతి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి వికేంద్రీకరణ, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ వైపు తమ ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. రాష్ట్ర యువతకు రాబోయే ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలన్న లక్ష్యానికి అనుగుణంగా

మిగతా 12వ పేజీలో...

యుద్ధమా? దాడులతో సరా?

ఇరాన్-ఇజ్రాయెల్ సంఘర్షణ పూర్తిస్థాయి యుద్ధంగా మారుతుందా?

కాల్బలం, యుద్ధట్యాంకుల్లో ఇరాన్ పైచేయి

టెక్నాలజీ, గగనతల రక్షణలో ఇజ్రాయెల్ టాప్

ఇప్పటికే సప్త ముఖ పోరుతో సతమతం

ఆ దేశ ప్రజల్లో యుద్ధం పట్ల వ్యతిరేకత

ఇజ్రాయెల్ రక్షణ సామర్థ్యాన్ని గుర్తించిన ఇరాన్

యుద్ధం ముప్పు తక్కువని నిపుణుల అంచనా

ప్రతీకార దాడులతోనే సరిపెట్టే అవకాశం!



ఆదివారం లెబనాన్‌లోని దహియోలో ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడులతో రేగిన మంటలు, పొగ

"తమలపాకుతో నువ్వొకటిస్తే.. తలుపుచెక్కతో నే రెండిస్తా" ..అనే సామెత చందంగా అక్టోబరు 1న ఇరాన్ తమ దేశంపై కురిపించిన క్షిపణుల వర్షానికి ప్రతిగా ఇజ్రాయెల్ 100 ఫైటర్ జెట్లతో వెళ్లి తీవ్ర ప్రతిదాడి చేసి విధ్వంసం సృష్టించడం ఎవరినీ ఆశ్చర్యపరచలేదు! ఈ దెబ్బతో.. ఇరాన్ క్షిపణి తయారీ కేంద్రాలు మళ్లీ యథావిధిగా పనిచేయడానికి ఏడాది నుంచి రెండేళ్ల సమయం పడుతుందని అంచనా!! దీనిపై ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ స్పందిస్తూ.. తమ శక్తిని ఇజ్రాయెల్‌కు

మిగతా 2వ పేజీలో...

లక్ష్యాలన్నీ సాధించాం

ఇరాన్‌పై దాడి గురించి నెతన్యాహు

మన సత్తా ఇజ్రాయెల్‌కు చూపాలి

దాడులను తక్కువ చేసి చూడొద్దు

ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ వ్యాఖ్యలు

గాజాపై విరుచుకుపడ్డ ఇజ్రాయెల్.. 47 మంది మృతి



పెట్టని పరీక్షకు.. రూ.కోట్ల ఖర్చు

గతేడాది అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాల భర్తీకి చర్యలు

ఉన్నత విద్యామండలి నిర్వాకంతో రోస్టర్‌లో తప్పులు

వెంటనే కోర్టుకు వెళ్లిన అభ్యర్థులు

దరఖాస్తుల దశలోనే నిలిపేసిన న్యాయస్థానం

అయినా ప్రశ్నపత్రాల తయారీకి 2.57 కోట్లు

కూటమి ప్రభుత్వమొచ్చాక చెల్లించిన మండలి

ప్రక్రియ సాగకపోయినా పేపర్ల సెట్టింగ్ ఎందుకో?

5

బాంబుల బూచోళ్లు!

తిరుపతి లక్ష్యంగా బెదిరింపులు.. ఎయిర్‌పోర్టు, హోటళ్లకు హెచ్చరికలు

వారంలోనే పలుమార్లు మెయిల్లు.. తాజాగా ప్రసిద్ధ గోవిందరాజస్వామి, ఇస్కాన్ ఆలయాల్లో బాంబులని మెసేజ్.. ప్రాక్సీ యాప్‌ల వాడకంపై సందేహం

విస్తృత తనిఖీలు చేపట్టిన అధికారులు.. బాధ్యులు, ఉద్దేశాలపై పోలీసుల దృష్టి

బెంగళూరు పోలీసుల అదుపులో బాధ్యుడు!

12

తెలంగాణ నుంచి వచ్చిన ఐఏఎస్‌లకు పోస్టింగులు



ఆమ్రపాలి



కరుణ

ఆరోగ్య శాఖ కమిషనర్‌గా వాకాటి కరుణ

ఏపీటీడీసీ ఎండీగా ఆమ్రపాలి

కార్మిక శాఖకు వాణీప్రసాద్.. జీఏడీకి వాణీమోహన్

12

కేటీఆర్ బావమరిది పార్టీలో డ్రగ్స్!

- రాజ్ పాకాల సన్నిహితుడు విజయ్‌కి కొకైన్ పాజిటివ్
- జన్వాడలోని ఫాంహౌస్‌లో అనుమతి లేకుండానే పార్టీ
- స్థానికుల ఫిర్యాదుతో ఎస్‌వోటీ పోలీసుల దాడి
- పార్టీలో 22 మంది పురుషులు.. 16 మంది మహిళలు


రాజ్ పాకాల


విజయ్

శంకర్‌పల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బావమరిది రాజ్ పాకాల ఇచ్చిన పార్టీలో డ్రగ్స్ వాడినట్లు తేలడం కలకలం సృష్టించింది! తమ ప్రాంతంలో పెద్దపెద్ద శబ్ధాలతో కొందరు పార్టీ చేసుకుంటూ ఇబ్బంది కలిగిస్తున్నారంటూ రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం జన్వాడకు చెందిన వ్యక్తులు కొందరు శనివారం రాత్రి 100కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. దీంతో మోకిల, శంకర్‌పల్లి, నార్సింగి, ఎస్‌వోటీ పోలీసులు నార్సింగి ఏసీపీ రమణగౌడ్ ఆధ్వర్యంలో జన్వాడలోని రాజ్ పాకాల ఫాంహౌస్‌పై దాడులు నిర్వహించారు. పోలీసుల సోదాల్లో విదేశీ మద్యంతో పాటు క్యాసినో ఆట వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా పలువురికి డ్రగ్ పరీక్షలు నిర్వహించారు. పార్టీలో అనుమతి లేకుండా వినియోగిస్తున్న విదేశీ మద్యం 7.6 లీటర్లు, ఐఎంఎఫ్ఎల్ మద్యం 8.1 లీటర్లు, బీర్లు 6 లీటర్లను స్వాధీనం చేసుకున్నారు. పార్టీలో 22 మంది పురుషులు, 16 మంది మహిళలు పాల్గొన్నారు. వీరందరికీ అక్కడే డ్రగ్ టెస్టులు చేసేందుకు ప్రయత్నించగా మహిళలు నిరాకరించారు. అయితే పురుషులందరికీ డ్రగ్ టెస్టులు నిర్వహించగా విజయ్ మద్దూరికి పాజిటివ్ వచ్చింది. విజయ్ తొలుత మూత్ర పరీక్షకు సహకరించలేదు. పోలీసులను ముప్పతిప్పలు పెట్టారు. తర్వాత పోలీసులు మూత్రంతో పాటు రక్తపరీక్షలు కూడా నిర్వహించారు. చివరకు పాజిటివ్ రావడంతో తాను ఇటీవలే విదేశాల నుంచి వచ్చానని, అక్కడ కొకైన్ తీసుకుని ఇండియాకు వచ్చానని విజయ్ పోలీసులను తప్పుదోవ పట్టించే యత్నం చేశాడు. మూత్ర పరీక్షలో పాజిటివ్ రావడంతో అతని గుట్టురట్టయింది. విజయ్‌ను అదుపులోకి తీసుకున్న మోకిల పోలీసులు.. ఎన్‌డీపీఎస్ సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. మిగిలిన వారి వివరాలు తీసుకొని వదిలేశారు.

రాజ్ పాకాల ఇస్తేనే కొకైన్ తీసుకున్నా..

రాజ్ పాకాల కోరిక మేరకే తాను కొకైన్ తీసుకున్నట్లు విజయ్ చెప్పినట్లు పోలీసులు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. కొత్తగా నిర్మించిన ఫాంహౌస్‌లో దీపావళి పార్టీకి రమ్మని రాజ్ పాకాల తనను ఆహ్వానించాడని విజయ్ తెలిపారు. ఆయనే కొకైన్ ఇచ్చినట్లు చెప్పారు. దీంతో విజయ్ ఇచ్చిన వాంగ్మూలం కేసులో కీలకంగా మారనుంది. వీరికి కొకైన్ ఎలా వచ్చింది? ఎవరి దగ్గర నుంచి కొనుగోలు చేశారనే దానిపై పోలీసులు కూపీ లాగుతున్నారు.

రాజ్ పాకాల ఎక్కడ?

ఈ కేసులో ప్రధాన ముద్దాయిగా ఉన్న రాజ్ పాకాల పరారీలో ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. ఆదివారం ఆయన్ని మోకిల పోలీస్ స్టేషన్‌కు రావాలని ఫోన్‌లో విచారణకు పిలిచారు. అలాగే ఎక్సైజ్ పోలీసులు కూడా విచారణకు రావాలని ఆదేశించారు. కానీ, ఆయన ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకొని.. విచారణకు రాలేదు. దీంతో పోలీసులు వారెంట్ జారీ చేయాలని నిర్ణయించారు.

క్యాసినో ఆట వస్తువుల స్వాధీనం..

ఫాంహౌస్‌లో నిర్వహించిన పార్టీలో క్యాసినో ఆట ఆడేందుకు ఏర్పాటు చేసినట్లు తెలిసింది. క్యాసినో ఆటకు ముంబై, గోవా నగరాలతో పాటుగా నేపాల్, థాయిలాండ్ దేశాలు ప్రముఖమైనవి. తెలంగాణలో ఇలాంటి ఆటలపై నిషేధం ఉంది. ఫాంహౌస్ పార్టీలో క్యాసినో ఆట వస్తువులను స్వాధీనం చేసుకోవడం ఆందోళన కలిగించే విషయం. ప్లేయింగ్ కార్డులు, క్యాసినో ఆట వస్తువులు ఉండడంతో రాజ్ పాకాలతో పాటు విజయ్ మద్దూరిపై గేమింగ్ యాక్టు కింద కేసు నమోదైంది.

వక్ఫ్ బిల్లును ఎట్టిపరిస్థితిల్లోనూ అడ్డుకుంటాం

- ముస్లిం పర్సనల్ లా బోర్డు చీఫ్ రెహ్మనీ ప్రకటన

న్యూఢిల్లీ, అక్టోబరు 27: వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లును ఎట్టి పరిస్థితుల్లోనూ వ్యతిరేకిస్తామని అఖిల భారత ముస్లిం పర్సనల్ లా బోర్డు(ఏఐఎంపీఎల్‌బీ) అధ్యక్షుడు మౌలానా ఖాలిద్ సైఫుల్లా రెహ్మనీ ప్రకటించారు. ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఏఐఎంపీఎల్‌బీ హక్కులను పరిమితం చేసే లక్ష్యంతో కేంద్రంలోని మోదీ ప్రభుత్వం వక్ఫ్ సవరణ బిల్లును తెచ్చిందని ఆరోపించారు. ఇప్పటికే దేశంలోని వక్ఫ్ ఆస్తులు పెద్ద మొత్తంలో ఆక్రమణలకు గురయ్యాయన్నారు. 'ఇది మాకు జీవన్మరణ సమస్య. ఎట్టి పరిస్థితుల్లోనూ బిల్లును అడ్డుకుంటాం. అవసరమైతే నేరస్తులను ఉంచేందుకు ఖాళీ లేనంతగా జైళ్లను నింపేందుకు దేశంలోని ముస్లింలు సిద్ధంగా ఉన్నారు. ప్రాణాలు ఇచ్చేందుకు సైతం వెనుకాడబోం' అని అన్నారు.

ఆలయ భూములను స్వాధీనం చేసుకున్న వక్ఫ్ బోర్డు

- దర్గాకు చెందినవని వెల్లడి.. అభ్యంతరం తెలిపిన ఆలయ ట్రస్టీ

అహ్మద్‌నగర్, అక్టోబరు 27: మహారాష్ట్రలోని అహ్మద్‌నగర్‌లో దేవాలయం సమీపంలోని 40 ఎకరాల స్థలాన్ని వక్ఫ్ బోర్డు స్వాధీనం చేసుకోవడంతో వివాదం నెలకొంది. కానిఫ్‌నాథ్ ఆలయం సమీపంలో ఉన్న ఈ స్థలం దర్గాకి చెందినదని పేర్కొంటూ బోర్డు పెట్టింది. ఇందుకు ఆధారాలుగా కొన్ని పత్రాలను పేర్కొంది. ఈ స్థలాన్ని 2005లో వక్ఫ్ చట్టం కింద రిజిస్టర్ చేశారు. అప్పటి నుంచి చట్టపరమైన వివాదం నడుస్తోంది. ఈ చర్యను ఆలయ ట్రస్టీ శ్రీహరి అంబేకర్ ఖండించారు. బ్రిటిష్ కాలం ముందు నుంచే ఆ స్థలం ఆలయ పరిధిలో ఉందని, ఇందుకు సంబంధించిన పత్రాలను కోర్టు కూడా అంగీకరించిందని తెలిపారు. ఆలయ ట్రస్టీలకు సమాచారం ఇవ్వకుండానే, తగిన నిబంధనలను పాటించకుండానే ఈ స్థలాన్ని వక్ఫ్ చట్టం ప్రకారం రిజిస్టర్ చేశారన్నారు.

29న సీనియర్ సిటిజన్ల ఆరోగ్య పథకం ప్రారంభం

న్యూఢిల్లీ, అక్టోబరు 27: ఆదాయంతో సంబంధం లేకుండా 70 ఏళ్లు నిండిన సీనియర్ సిటిజన్లందరికీ అమలు చేయనున్న ఆయుష్మాన్ భారత్ ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన(ఏబీ పీఎంజేఏవై)ను ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 29న ప్రారంభించనున్నట్లు సమాచారం. అలాగే తల్లీబిడ్డల టీకాల కార్యక్రమాన్ని నమోదు చేసే యూ-విన్ పోర్టల్‌ని కూడా ప్రధాని అదే రోజు ప్రారంభిస్తారని అధికార వర్గాలు తెలిపాయి. కాగా ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య పథకం 4.5 కోట్ల కుటుంబాల్లోని ఆరు కోట్ల మందికి లబ్ధి చేకూర్చుతుందని అంచనా. పేదలు, మధ్య తరగతి, ఉన్నత మధ్య తరగతి, ఉన్నత.. ఇలా అన్ని వర్గాల్లో 70 ఏళ్లు నిండిన లేదా ఆపైన వయస్సు ఉన్న వారందరూ ఆయుష్మాన్ భారత్ కార్డు పొందడానికి అర్హులు. ఏబీ పీఎంజేఏవైలో నమోదైన ఏ ఆస్పత్రిలోనైనా వీరికి 5 లక్షల వరకు ఉచితంగా చికిత్స అందిస్తారు.

శ్రీశ్రీ రవిశంకర్‌కు ఫిజీ పౌర పురస్కారం

న్యూఢిల్లీ, అక్టోబరు 27: ప్రపంచ ఆధ్యాత్మిక గురువు, ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు శ్రీశ్రీ రవిశంకర్‌ను ఫిజీ ఆ దేశ అత్యున్నత పౌర పురస్కారంతో సత్కరించింది. మనుషుల్లో స్ఫూర్తిని పెంపొందించడానికి, విభిన్న సమాజాలను శాంతి, సామరస్యంతో ఒక చోటికి తీసుకురావడానికి ఆయన అవిశ్రాంతంగా చేస్తున్న కృషికి గుర్తింపుగా ఈ పురస్కారాన్ని అందజేసింది. 'హానరరీ ఆఫీసర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ఫిజీ' పురస్కారాన్ని శ్రీశ్రీ రవిశంకర్‌కు ఫిజీ అధ్యక్షుడు రతు విలియం ఎం కటోనివెరె ప్రదానం చేశారు. దీంతో శ్రీశ్రీ రవిశంకర్‌కు అత్యున్నత పౌర పురస్కారాన్ని అందించిన ఆరో దేశంగా ఫిజీ నిలిచింది. ఫిజీ పర్యటన సందర్భంగా ఫిజీ ఉప ప్రధాని విలియం గవోకా, ఫిజీలో యూఎన్ రెసిడెంట్ కోఆర్డినేటర్ డిర్క్ వాగెనర్ తదితరులతో శ్రీశ్రీ రవిశంకర్ భేటీ అయ్యారు. యువతకు సాధికారతను కల్పించడం ద్వారా ద్వీప దేశం సమగ్ర పురోగతికి ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఏ విధంగా దోహదపడుతుందన్న దానిపై వారు చర్చించారు.

'ఉపాధి' తగ్గుదల అవాస్తవం!

- ఎన్‌రోల్‌మెంట్ తగ్గుతుందనడాన్ని తోసిపుచ్చిన కేంద్రం

న్యూఢిల్లీ, అక్టోబరు 27: గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఎన్‌రోల్‌మెంట్ తగ్గుతుందన్న వార్తలను కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఖండించింది. ఆర్థిక సంవత్సరం పూర్తి కాకుండానే ఇప్పుడే దానిపై ఒక అంచనాకు రావడం సరైంది కాదని వ్యాఖ్యానించింది. గత ఏడాదితో పోలిస్తే ప్రస్తుతం ఉపాధి హామీ పథకం కింద ప్రయోజనం పొందే కార్మికుల సంఖ్య తగ్గిందని పేర్కొంటూ కథనాలు వెలువడిన నేపథ్యంలో ఆ శాఖ స్పందించింది. అయితే, లిబ్‌టెక్ ఇండియా వెలువరించిన నివేదిక ప్రకారం గతంతో పోలిస్తే ఉపాధి పథకంలో కార్మికుల సంఖ్య ఎనిమిది శాతం తగ్గినట్లు తెలుస్తోంది. దాదాపు 39 లక్షల కార్మికులను సదరు పథకం నుంచి తొలగించారని ఇది ఆందోళనకరమైన విషయమని ఆ నివేదిక పేర్కొంది. దీనిని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ తోసిపుచ్చింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం కొనసాగుతున్నందున పనిదినాల కల్పనపై ఇప్పుడే తుది అంచనాలకు రావడం సరైంది కాదని పేర్కొంది.

యుద్ధమా? దాడులతో సరా?

(మొదటి పేజీ తరువాయి)

రుచిచూపిస్తామని ప్రకటించారు! అయితే.. ఎలాంటి దాడులు చేయాలనే అంశంపై సైన్యం ప్రణాళికలు రచిస్తోందన్నారు. ఈ నేపథ్యంలో.. రెండు దేశాల మధ్య పూర్తిస్థాయి యుద్ధం జరిగే ప్రమాదం ఉందా? అనే ఆందోళన చాలామందిలో వ్యక్తమవుతోంది. కానీ.. ఖమేనీ వ్యాఖ్యలను, ఇరాన్‌పై ఇజ్రాయెల్ చేసిన ప్రతీకార దాడుల తీరును పరిశీలిస్తే రెండు దేశాల మధ్య పూర్తిస్థాయి యుద్ధం జరిగే ముప్పు తక్కువనే అభిప్రాయాన్ని రక్షణ రంగ నిపుణులు వ్యక్తం చేస్తున్నారు. ఎందుకంటే.. పూర్తిస్థాయి యుద్ధానికి వెళ్తే దెబ్బ తింటామనే విషయం రెండు దేశాలకూ తెలుసు. మరీ ముఖ్యంగా.. నిరుడు అక్టోబరులో హమాస్ కిరాతకదాడితో మొదలైన యుద్ధంలో తాము ఏడుగురు శత్రువులతో పోరాడుతున్నామని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కొద్దిరోజుల క్రితమే అన్నారు! ఆ ఏడుగురు శత్రువులూ.. గాజాలో హమాస్, లెబనాన్‌లో హెజ్బొల్లా, యెమెన్‌లో హౌతీలు, వెస్ట్‌బ్యాంక్‌లో ఉగ్రవాదులు, ఇరాన్, ఇరాక్, సిరియాలకు చెందిన షియా మిలిటెంట్లు. వారిలో హెజ్బొల్లా, హౌతీ, షియా మిలిటెంట్లు ఇరాన్ ప్రాక్సీలే. ఒకవైపు వీరందరితో పోరాడుతూ మరోవైపు ఇరాన్‌తో నేరుగా యుద్ధంలోకి దిగడం ఇజ్రాయెల్‌కు అంతమంచిది కాదు. అందునా.. ఇప్పటికే ఏడాదికాలంగా నెలకొన్న యుద్ధవాతావరణంతో ఇజ్రాయెలీలు విసిగిపోయి ఉన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పూర్తిస్థాయి యుద్ధమంటే ప్రజల మద్దతు ఉండదు. ఇక, ఇజ్రాయెల్‌తో పోలిస్తే.. సంఖ్యలో ఇరాన్ వద్ద భారీగా క్షిపణులు, డ్రోన్లు ఉన్నా, పటిష్ఠమైన ఇజ్రాయెల్ రక్షణ వ్యవస్థ ముందు వాటి శక్తి తక్కువే. అక్టోబరు 1న జరిపిన దాడితోనే ఇరాన్‌కు ఆ విషయం అర్థమైంది. కాబట్టి.. రెండు దేశాలూ ఇలాగే అప్పుడప్పుడూ ప్రతీకార దాడులతో సరిపెట్టే అవకాశం ఉందని అంచనా! అలాగని పూర్తిస్థాయి యుద్ధం జరిగే ప్రమాదాన్నీ కొట్టిపారేయలేం. అదే జరిగితే అందులో ఎవరు గెలిచే అవకాశం ఉంది? ఎవరి బలం, బలగం ఎంత? పరిశీలిస్తే..

బాలిస్టిక్ క్షిపణులు

ఇరాన్ వద్ద 2000 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలపైన కూడా దాడులు చేయగలిగే పలు శ్రేణుల క్షిపణులు 3,500 దాకా ఉన్నాయి. అందులో కొన్ని 500 కిలోల బరువున్న ఆయుధాలను కూడా మోసుకెళ్లగలవు. ఇటీవలే.. ఫతా పేరుతో హైపర్‌సానిక్ క్షిపణులను కూడా రంగంలోకి దించింది. వేల సంఖ్యలో డ్రోన్లను కూడా అభివృద్ధి చేసుకుంది. ఇరాన్ క్షిపణుల్లో చాలావరకూ ఇజ్రాయెల్‌లోని వివిధ ప్రాంతాలపై దాడులు చేయగల సామర్థ్యం ఉన్నవి. మరోవైపు, ఇజ్రాయెల్ వద్ద.. 4,800 నుంచి 6,500 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను సైతం ఛేదించగల అత్యంత అధునాతనమైన, శక్తిమంతమైన క్షిపణులున్నాయి. ఇజ్రాయెల్ వద్ద ఉన్న హెరాన్ డ్రోన్లు నిరంతరాయంగా 30 గంటలపాటు ప్రయాణించగలవు.




అణ్వాయుధాలు

ఇజ్రాయెల్ వద్ద 90 న్యూక్లియర్ వార్‌హెడ్స్ ఉన్నట్టు సమాచారం. ఇరాన్ వద్ద ప్రస్తుతానికి అణ్వాయుధాలు లేవుగానీ.. వారి అణు కార్యక్రమం చాలా అడ్వాన్స్‌డ్ దశలో ఉంది. పౌర అవసరాల నిమిత్తమే అణు కార్యక్రమాన్ని చేపట్టినట్టు చెబుతున్న ఇరాన్ వద్ద నాలుగు అణ్వాయుధాలు తయారుచేయడానికి సరిపడా అణు పదార్థం (నియర్ వెపన్స్ గ్రేడ్ మెటీరియల్) ఉన్నట్టు ఐక్యరాజ్య సమితి అణు సంస్థ చెబుతోంది. అయితే.. అణ్వాయుధాలు తయారీకి అవసరమైన పరిజ్ఞానం తమ వద్ద ఉందని.. జనహనన ఆయుధాలను తయారుచేయబోమన్న తమ వైఖరిని అవసరమైతే ఏ క్షణమైనా మార్చుకుంటామని ఇరాన్ ఇటీవలికాలంలో హెచ్చరించడం గమనార్హం.

గగనతల రక్షణ వ్యవస్థలు

ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన గగనతల రక్షణ వ్యవస్థలను కలిగి ఉన్న దేశం ఇజ్రాయెల్. ఆ దేశ 'ఐరన్ డోమ్', 'డేవిడ్స్ స్లింగ్', 'యారో' వ్యవస్థల సత్తా గురించి ప్రపంచం మొత్తానికీ తెలుసు. గతంలో ఇరాన్ కురిపించిన క్షిపణులు, డ్రోన్ల వర్షాన్ని ఇజ్రాయెల్ వీటి ద్వారానే సమర్థంగా ఎదుర్కొంది. ఇక, ఇరాన్ విషయానికి వస్తే.. ఆ దేశం రష్యన్లు రూపొందించిన ఎస్-200, ఎస్-300లతోపాటు, స్థానికంగా అభివృద్ధి చేసుకున్న బవర్-373లపై ఆధారపడింది. కానీ, తాజా దాడితో ఇజ్రాయెల్.. ఆ వ్యవస్థలను ఛేదించి మరీ ఇరాన్‌కు తీవ్ర నష్టం వాటిల్లేలా చేయగలిగింది. ఇక.. ఇరు దేశాల సైనికశక్తి, యుద్ధ ట్యాంకులు, శతఘ్నుల వంటివాటిని చూస్తే.. అంకెల పరంగా అన్నింటా ఇరాన్‌దే పైచేయిగా కనిపించవచ్చుగానీ, టెక్నాలజీ, రక్షణ ఖర్చు, వైమానిక శక్తి, బాలిస్టిక్ క్షిపణులు, అణ్వాయుధాల పరంగా చూస్తే ఇజ్రాయెల్ శక్తి చాలా ఎక్కువ. రెండువేల కిలోమీటర్లకు పైగా దూరంలో ఉన్న ఈ రెండు దేశాల సైన్యాలూ తలపడడం కల్ల! ఇక మిగిలింది వైమానిక, క్షిపణి దాడులే. ఆ విషయంలో ఇజ్రాయెల్‌కు స్పష్టమైన ఆధిక్యం ఉంది. ఇరాన్ వద్ద ఎఫ్-4, ఎఫ్-14, సుఖోయ్-24, మిగ్-29ఎస్ యుద్ధవిమానాలున్నాయి (అమెరికాకు ప్రస్తుతం బద్ధశత్రువుగా ఉన్న ఇరాన్‌కు ఎఫ్-14 యుద్ధవిమానాలు ఎలా వచ్చాయంటే.. 1972లో ఇరాన్ రాజు షాతో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు 80కిగాను.. 79 ఎఫ్-14 యుద్ధవిమానాలను అమెరికా సరఫరా చేసింది. మరో ఎఫ్-14ను సరఫరా చేసే సమయానికి అక్కడ ఇస్లామిక్ విప్లవం రావడంతో దాన్ని విరమించుకుంది). వీటిలో ఎఫ్-4, ఎఫ్-14, సుఖోయ్ 24 యుద్ధవిమానాలు చాలా పాతవి. వాటితో పోలిస్తే.. ఇజ్రాయెల్ వద్ద అత్యంత అధునాతనమైన ఎఫ్-15, ఎఫ్-16, ఎఫ్-35లున్నాయి. కాబట్టి ఇరాన్ ఆచితూచి స్పందిస్తుందనే ఆశించవచ్చు. ఇజ్రాయెల్ కూడా పూర్తిస్థాయి యుద్ధానికి సిద్ధంగా లేదు కాబట్టి రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు మరింత ముదరకపోవచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

లోకం తీరు



	ఇరాన్	ఇజ్రాయెల్
సైన్యం	6,10,000	1,69,500
రిజర్వ్ బలగాలు	3,50,000	4,65,000
యుద్ధ ట్యాంకులు	10,513	1,650
శతఘ్నులు	6798	530
కవచం కలిగిన వాహనాలు	640	1,190
యుద్ధవిమానాలు	312	345
దాడి చేసే హెలికాప్టర్లు	57	43
టాక్టికల్ జలాంతర్గాములు	17	5
గస్తీ నౌకలు	68	49
రక్షణ ఖర్చు		
ఇరాన్	రూ. 86,625 కోట్లు	
ఇజ్రాయెల్	రూ. 2.31 లక్షల కోట్లు	



ఇరాన్‌పై దాడిలో లక్ష్యాలన్నీ సాధించాం

- ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ప్రకటన
- ఇరాన్ సత్తా చూపాలన్న ఖమేనీ

టెల్ అవీవ్, బీరుట్, గాజా, టెహ్రాన్: ఇరాన్‌లోని టెహ్రాన్, ఇలాం, కుజెస్తాన్‌లో ఉన్న సైనిక స్థావరాలు, క్షిపణి, డ్రోన్ తయారీ, ప్రయోగ కేంద్రాలపై శనివారం తెల్లవారుజామున చేసిన దాడిలో లక్ష్యాలన్నీ పూర్తి చేశామని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ప్రకటించారు. దాడిలో ఇరాన్ క్షిపణి తయారీకి ఉపయోగించే ఘన ఇంధన మిశ్రమం ఉత్పత్తి కేంద్రాన్ని ధ్వంసం చేసినట్లు ఇజ్రాయెల్ వెల్లడించింది. ఈ కారణంగా ఇరాన్ క్షిపణి కార్యక్రమం కోలుకోవడానికి కనీసం ఏడాది కాలం పడుతుందని నిపుణులు చెబుతున్నారు. అదే సమయంలో ఇరాన్ ఎస్-300 గగనతల రక్షణ వ్యవస్థను కూడా దెబ్బతీసినట్లు ఐడీఎఫ్ తెలిపింది. 2023 అక్టోబరు ఏడున హమాస్ దాడిలో మరణించినవారి సంస్మరణార్థం నిర్వహించిన కార్యక్రమంలో నెతన్యాహు ప్రసంగిస్తుండగా బందీల బంధువులు కొందరు అడ్డుకున్నారు. సిగ్గుపడు అంటూ నినాదాలు చేశారు. దీంతో నెతన్యాహు తన ప్రసంగాన్ని ప్రారంభించిన కాసేపటికే ముగించాల్సి వచ్చింది. మరోవైపు.. ఇరాన్‌పై ఇజ్రాయెల్ జరిపిన ప్రతిదాడిపై సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ స్పందించారు. ఇరాన్ సత్తా ఏంటో ఇజ్రాయెల్‌కు చూపాలని పిలుపునిచ్చారు. అయితే ఎలా స్పందించాలనేదానిపై ఇరాన్ అధికారులు నిర్ణయిస్తారని చెప్పారు. ఇజ్రాయెల్ దాడులను తక్కువ చేసి చూడొద్దని, అలాగని అతిగా కూడా ఊహించుకోవద్దన్నారు. ఇజ్రాయెల్ జరిపిన దాడిని తాము తిప్పికొట్టామని, అందువల్లే నష్టం పరిమిత స్థాయిలో జరిగిందని ఇరాన్ ప్రకటించింది. నలుగురు సైనికులు మరణించారని వెల్లడించింది. ఇజ్రాయెల్‌పై సరైన సమయంలో దాడి చేస్తామనీ హెచ్చరించింది.

గాజాలో ఇజ్రాయెల్ దాడులు

గాజాలో ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతున్నాయి. బేట్ లహియాలో ఆరు భవనాలపై కురిపించిన బాంబుల వర్షంలో 47 మంది పాలస్తీనియన్లు మృతిచెందారు. కాగా, ఇజ్రాయెల్ రాజధాని టెల్ అవీవ్ సమీపంలోని ఓ బస్టాప్‌లోకి ట్రక్కు దూసుకుపోయిన ఘటనలో ఒకరు చనిపోయారు. 35 మంది గాయపడ్డారు. వీరిలో ఆరుగురి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ఇజ్రాయెల్ ఇంటలిజెన్స్ ఏజెన్సీ మొసాద్ ప్రధాన కార్యాలయానికి అతి సమీపంలో ఈ ఘటన జరగడం, ట్రక్కు నడిపిన వ్యక్తి అరబ్ ఇజ్రాయెలీ కావడంతో ఉగ్రదాడిగా అనుమానిస్తున్నారు. నిందితుడిని కాల్చి చంపారు. మరోవైపు.. హెజ్బొల్లా సంస్థ లాటిన్ అమెరికా దేశాల ఆపరేషనల్ చీఫ్.. హుస్సేన్ అహ్మద్ కరాకీ ఆచూకీని గుర్తించామని అర్జెంటినా రక్షణ మంత్రి ప్యాట్రికా బలారిచ్ ప్రకటించారు.

డిజిటల్ అరెస్టు.. అబద్ధం

- చట్టంలో ఆ ప్రక్రియ లేనేలేదు
- ఏ ప్రభుత్వ సంస్థా ప్రజల్ని బెదిరించదు
- ఆన్‌లైన్ మోసగాళ్ల బారిన పడొద్దు
- 'మన్ కీ బాత్'లో ప్రజలకు ప్రధాని సూచన
- సైబర్‌నేరాలపై టీఎస్ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ చేసిన ట్వీట్‌ను ప్రస్తావించిన మోదీ
- చేర్యాల నకాశీ కళాకారుడు ధనాలకోట వైకుంఠంపై ప్రశంసల జల్లు



న్యూఢిల్లీ, హైదరాబాద్ సిటీ, చేర్యాల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఈ రోజుల్లో సైబర్ నేరాలు ప్రధాన సమస్యగా మారాయని ప్రధాని నరేంద్రమోదీ ఆందోళన వ్యక్తం చేశారు. డిజిటల్ అరెస్టులు, ఆన్‌లైన్ మోసాలపై ప్రజలకు మరింత అవగాహన అవసరమన్నారు. మోసగాళ్లు తాము పోలీసులుగా, సీబీఐ, ఆర్‌బీఐ, నార్కోటిక్స్ అధికారులుగా పరిచయం చేసుకొని వ్యక్తిగత సమాచారాన్ని రాబడతారని, తర్వాత ఆలోచించే సమయం కూడా ఇవ్వకుండా నిర్ణీత సమయంలోగా డబ్బులు చెల్లించాలని భయపెడుతూ ఒత్తిడి చేస్తారని తెలిపారు. ఆదివారం ప్రసారమైన 115వ 'మన్ కీ బాత్'లో ప్రధాని మోదీ సైబర్ నేరాల అంశాన్ని ప్రస్తావించారు. సైబర్ దాడుల నుంచి ప్రజలను కాపాడేందుకు అనేక సంస్థలు రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి పనిచేస్తున్నాయని చెప్పారు. ఈ మోసాల బారిన పడకుండా ఉండేందుకు 'ఆగి... ఆలోచించి... ఆ తర్వాత నిర్ణయించండి..' అనే మూడు అంచెల విధానాన్ని పాటించాలని ప్రజలకు సూచించారు. 'చట్టంలో డిజిటల్ అరెస్టు వంటి ప్రక్రియ లేనేలేదు. ఇది నేరగాళ్ల ముఠా చేసే మోసం. ఏ ప్రభుత్వ సంస్థా మిమ్మల్ని డిజిటల్ అరెస్ట్ చేయదు. ఫోన్లు చేసి డబ్బులు చెల్లించాలని బెదిరించదు. ప్రశాంతంగా ఆలోచించండి... వ్యక్తిగత సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోవద్దు.. వీలైతే స్క్రీన్ షాట్ తీసుకోండి. ఆ కాల్‌ను రికార్డు చేయండి. ప్రభుత్వ సంస్థలు ఎవరినీ బెదిరించవని గుర్తుంచుకోండి... ఇలాంటి పరిస్థితి ఎదురైతే వెంటనే నేషనల్ సైబర్ హెల్ప్‌లైన్ (1930)కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయండి' అని మోదీ సూచించారు. ఈ సందర్భంగా టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ గతంలో సైబర్‌నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించేలా చేసిన ఒక ట్వీట్‌ను ప్రధాని ప్రస్తావించారు. కర్ణాటకకు చెందిన సందీప్ పాటిల్.. తనకు వీడియో కాల్ చేసిన సైబర్ నేరగాళ్ల బారినపడకుండా తప్పించుకోవటమేగాక వారి ప్రయత్నాన్ని వీడియో రికార్డ్ చేశాడు. ఈ వీడియోను సజ్జనార్ ఎక్స్‌లో పోస్ట్ చేసి ఈతరహా మోసాల గురించి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆ ట్వీట్‌ను ప్రధాని ప్రస్తావించటమేగాక పాటిల్ ధైర్యాన్ని మెచ్చుకున్నారు. దీనిపై ప్రధానికి సజ్జనార్ ధన్యవాదాలు తెలిపారు.

యానిమేషన్ పవర్‌హౌస్‌గా భారత్

యానిమేషన్ ప్రపంచంలో కొత్త విప్లవానికి నాంది పలికేదిశగా భారత్ ముందుకెళ్తోందని ప్రధాని చెప్పారు. దేశాన్ని యానిమేషన్ పవర్ హౌస్‌గా మార్చేందుకు సహకరించాలన్నారు. భారత్‌లోని యానిమేషన్ సిరీస్‌లకు ప్రపంచవ్యాప్తంగా ఆదరణ ఉందంటూ.. 'చోటా భీమ్', 'హనుమాన్', 'మోటు-పట్లూ'వంటి సిరీస్‌లను గుర్తుచేశారు. యానిమేషన్ ప్రపంచంలో 'మేడిన్ ఇండియా', 'మేడ్ బై ఇండియన్స్' ప్రతిచోటా కనిపిస్తాయన్నారు.

50 ఏళ్లుగా ధనాలకోట వైకుంఠం కృషి...

చేతివృత్తుల కళారంగాల్లో కృషి చేస్తున్న పలువురిని ప్రధాని ప్రశంసించారు. సిద్దిపేట జిల్లా చేర్యాల నకాశీ చిత్రకళను ప్రస్తావించారు. నకాశీ కళాకారుడైన ధనాలకోట వెంకటరామయ్య చిన్నకుమారుడు ధనాలకోట వైకుంఠం 50ఏళ్లుగా చేర్యాల జానపద, చిత్రకళను ప్రాచుర్యంలోకి తీసుకువస్తున్నారని, అరుదైన కళ పరిరక్షణలో ఆయన కృషి అద్భుతమని మోదీ కొనియాడారు. చేర్యాల పెయింటింగ్స్ ప్రత్యేకమని, స్క్రోల్ రూపంలో కథలను కళ్లకు కట్టినట్లుగా ముందుకు తీసుకువస్తాయని, వీటిలో మన చరిత్ర, పురాణాల గురించి ఉంటుందన్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్‌కు చెందిన బుట్లూరామ్ మాత్రాజీ అబూజ్ మాడియా తెగకు చెందిన జానపద కళలను సంరక్షించటానికి ఎంతో కృషి చేస్తున్నారని ప్రధాని ప్రశంసించారు.

'డిజిటల్' కండోమ్!

- యాప్ రూపొందించిన జర్మనీ సంస్థ బిల్లీ బాయ్
- శృంగార సమయంలో రహస్య రికార్డింగ్‌లకు చెక్

బెర్లిన్, అక్టోబరు 27: సైబర్ నేరాలు విపరీతంగా పెరిగిన కాలమిది. ఇక కొందరు.. సన్నిహిత సందర్భాలను స్మార్ట్ ఫోన్లలో రహస్యంగా రికార్డు చేస్తూ ఆ తర్వాత వాటిని చూపి బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఇలాంటివాటికి అవకాశం లేకుండా జర్మనీకి చెందిన లైంగిక ఆరోగ్య సంస్థ బిల్లీ బాయ్ ఓ యాప్‌ను తీసుకొచ్చింది. దీని పేరు కామ్‌డోమ్. రహస్య రికార్డింగ్‌లకు చెక్ పెట్టేలా రూపొందించిన ఈ యాప్‌ను.. సన్నిహిత సందర్భాల్లో, శృంగారంలో పాల్గొనేముందు మొబైల్ ఫోన్లను ఒకదగ్గరకు చేర్చి యాక్టివేట్ చేయాల్సి ఉంటుంది. వర్చువల్ బటన్ స్వైప్ చేస్తే.. బ్లూ టూత్ ద్వారా కెమెరా, మైక్రోఫోన్‌లు రికార్డు చేయకుండా చూస్తుంది. ఏదైనా ఫోన్‌ను అన్ బ్లాక్ చేసేందుకు ప్రయత్నిస్తే అలర్ట్ సైరన్ మోగుతుంది. ఈ యాప్ ద్వారా పలు డివైజ్‌లను ఒకేసారి నియంత్రించడం సాధ్యమని బిల్లీ బాయ్ తెలిపింది. కాగా, కామ్‌డోమ్‌ను డిజిటల్ కండోమ్‌గా వ్యవహరిస్తున్నారు. నిజమైన కండోమ్‌లను వినియోగించినంత సులభం అని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. బిల్లీ బాయ్ దీనిని 30 పైగా దేశాల్లో విడుదల చేసింది.

కాన్పూర్‌లో మరో 'దృశ్యం'

- మహిళను చంపి నిర్మాణంలో ఉన్న కలెక్టర్ భవనంలో ఖననం

కాన్పూర్, అక్టోబరు 27: ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో దృశ్యం తరహా ఘటన జరిగింది. ఓ మహిళతో వివాహేతర సంబంధంలో ఉన్న జిమ్ ట్రైనర్.. ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో ఆమెను చంపి దృశ్యం సినిమా తరహాలో నిర్మాణంలో ఉన్న కలెక్టర్ భవంతిలో పాతిపెట్టాడు. ఈ ఏడాది జూన్‌లో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కాన్పూర్‌కు చెందిన ఓ మహిళ (32)కు ఆమె నిత్యం వెళ్లే జిమ్‌లోని ట్రైనర్‌తో వివాహేతర సంబంధం ఏర్పడింది. జూన్ 24న జిమ్‌కెళ్లిన మహిళ జిమ్ ట్రైనర్‌తో కలిసి కారులో బయటకెళ్లింది. ఈ క్రమంలో జిమ్ ట్రైనర్‌కు వేరొకరితో పెళ్లి నిశ్చయమైన విషయం గురించి వారిద్దరి మధ్య తీవ్ర వాగ్వివాదం జరిగింది. కోపోద్రిక్తుడైన జిమ్ ట్రైనర్ ఆమె మెడపై గట్టిగా గుద్దడంతో స్పృహ తప్పి పడిపోయింది. అనంతరం ఆమెతో ఎప్పటికైనా ప్రమాదమని భావించి హతమార్చాడు. ఆమె శవాన్ని తీసుకెళ్లి నిర్మాణంలో ఉన్న కలెక్టర్ భవంతిలో పాతిపెట్టాడు. జిమ్‌కెళ్లిన తన భార్య ఇంటికి తిరిగి రాలేదని వివాహిత భర్త పోలీసులను ఆశ్రయించడంతో వారు జిమ్ ట్రైనర్‌ను అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించి శవాన్ని స్వాధీనం చేసుకున్నారు.

రాజకీయాల్లో పిల్లాడినే.. బరిలో భయపడేదే లేదు

ఈవీఆర్ పెరియార్, కె.కామరాజ్, బీఆర్ అంబేడ్కర్, రాణి వేలు నాచియార్, అంజలి అమ్మాళ్ వారసత్వాన్ని కొనసాగిస్తాం. వారి ఆశయాలతో పార్టీని ముందుకు తీసుకెళ్తాం. లౌకిక, సామాజిక న్యాయ సిద్ధాంతాల ప్రాతిపదికగా పనిచేస్తాం.

నా రాజకీయ ప్రయాణంలో మహిళలదే కీలక పాత్ర. చనిపోయిన నా సోదరి మరణం నాపై ఎంత ప్రభావం చూపిందో, నీట్‌లో ఉత్తీర్ణత సాధించలేక అరయలూరుకు చెందిన విద్యార్థిని ఎస్. అనిత ఆత్మహత్య చేసుకోవడం కూడా అంతే ప్రభావం చూపించింది. నీట్ నిర్వహణకు మా పార్టీ వ్యతిరేకం. జాతీయ స్థాయిలో మెడికల్ ఎంట్రన్స్ పరీక్ష అవసరం లేదు.

రాష్ట్రంలోని పాలకులు ప్రత్యర్థి పార్టీ (బీజేపీ)ది ఫాసిస్టు పాలన అంటూ విమర్శిస్తున్నారు. మరి వీరు చేస్తున్నదేమైనా పాయసం పాలనా? - విజయ్

(మొదటి పేజీ తరువాయి)

విక్రవాండి వద్ద ఆదివారం సాయంత్రం భారీఎత్తున నిర్వహించిన టీవీకే తొలి మహానాడులో లక్షలాది మంది కార్యకర్తల సమక్షంలో విజయ్ ప్రసంగించారు. ఇప్పటి వరకూ ఆడియో లాంచ్ ప్రోగ్రామ్‌లలో ప్రసంగించిన తాను తొలిసారిగా ఇంతమంది ప్రజల ముందు, వారి సంక్షేమమే ధ్యేయంగా ప్రసంగించడం ఎంతో గర్వంగా ఉందని చెప్పారు. 'సమాజంలో విభేదాలు సృష్టించేవారు, అవినీతిపరులు మనకు మొదటి శత్రువులు. ద్రావిడ భావజాలాన్ని కాపాడుతున్నామని చెప్పుకొంటూ రాష్ట్రాన్ని కుటుంబ సంస్థలా వాడుకుంటున్న వారు తదుపరి శత్రువులు' అని విజయ్ పేర్కొన్నారు. ద్రవిడ, తమిళ జాతీయవాద సిద్ధాంతాలు పాటిస్తామని, పుట్టుకతో అందరూ సమానులే అన్నది తమ పార్టీ సిద్ధాంతమని అన్నారు. కెరీర్‌ను పీక్స్‌లో వదిలేసి, తమిళనాడు ప్రజలపై తిరుగులేని విశ్వాసం, నమ్మకంతో రాజకీయాల్లోకి వచ్చానన్నారు. తమిళనాడు రాజకీయ ముఖచిత్రంలో మార్పు రావాల్సిన అవసరం ఉందన్న ఆయన.. రాజీపడే ప్రసక్తే లేదని, సర్దుబాటు రాజకీయాలు ఉండబోవని కార్యకర్తలకు హామీ ఇచ్చారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం రాజకీయాల్లోకి రాలేదని, సామాజిక నిబద్ధతతో వచ్చానని చెప్పారు. రాజకీయాల్లోకి తాను కొత్తవాడిని కావచ్చని, కానీ తన నిబద్ధత మాత్రం చెక్కుచెదరలేదని తెలిపారు. అవినీతి, మతతత్వమే తమ పార్టీకి ప్రధాన శత్రువులని విజయ్ పేర్కొన్నారు.


మహానాడుకు హాజరైన కార్యకర్తల వైపు చేతులూపుతున్న టీవీకే నేత విజయ్

ఉంటే ఏంటి... ఊడితే ఏమిటి?


తమిళనాట ద్రావిడ తరహా సుపరిపాలన అందిస్తున్నామంటూ ఓ కుటుంబ పరిపాలన కొనసాగుతోందని, దాన్ని అంతమొందించడమే తన కర్తవ్యమని విజయ్ ధ్వజమెత్తారు. పెరియార్, అన్నాదురై పేర్లు చెప్పుకుని రాష్ట్రంలో ఓ గుంపు కుటుంబ పాలన కొనసాగిస్తోందని, ప్రజా వ్యతిరేక ప్రభుత్వాన్ని ద్రావిడ మోడల్ ప్రభుత్వంగా చెప్పుకొంటూ ప్రజలను మోసగిస్తోందని పరోక్షంగా డీఎంకేపై విరుచుకుపడ్డారు. పేదలకు ఇల్లు, ఆహారం, ఉపాధి కల్పించడంలో విఫలమైన ఈ ప్రభుత్వం ఉంటే ఏంటి, ఊడితే ఏమిటంటూ అంటూ విరుచుకుపడ్డారు. తమ పార్టీకి ద్రవిడ ఉద్యమ నేత పెరియార్ ఆదర్శమని, అయితే దేవుడు లేదంటూ ఆయన బలపరచిన నాస్తికవాదాన్ని మాత్రం తమ పార్టీ అంగీకరించే ప్రసక్తేలేదని విజయ్ స్పష్టం చేశారు. సినీనటులు రాజకీయ ప్రవేశం చేస్తే 'కూత్తాడి' (నాటకాలు వేసేవారు, సినీ నటులు) అంటూ ఓ పార్టీ (డీఎంకే) హేళన చేయడం ఆనవాయితీగా పెట్టుకుందని, తమిళనాట ఎంజీఆర్, ఆంధ్రప్రదేశ్‌లో ఎన్టీఆర్ అనే ఇద్దరు కూత్తాడిలు రాజకీయాల్లో చరిత్ర సృష్టించారనే విషయాన్ని మరచిపోయిందని విమర్శించారు. ఇక 2026 అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే తమ పార్టీ లక్ష్యమని, అదే సమయంలో తమతో పొత్తు పెట్టుకునే పార్టీలకు అధికారంలో భాగస్వామ్యం కల్పిస్తామని ప్రకటించారు.

సోమవారం 28 అక్టోబరు 2024
వివిధ
vividha@andhrajyothy.com
సాహిత్య వేదిక
బొమ్మలు: అక్బర్

పరిమాణ చరిత్రతో మొదలై పరిణామ చరిత్రకు..



చరిత్రలో తమకు లభించిన స్థానమేమిటన్న ప్రశ్న దాదాపు అన్ని అస్తిత్వ సమూహాలూ వాదాలను నిర్మించుకోవడానికి కారణమైంది. తెలంగాణ ప్రాంతీయ అస్తిత్వ ఉద్యమం కూడా ఆ ప్రశ్న వేసుకుంది. సాహిత్యచరిత్రలో తమ ప్రాతినిధ్యం గురించి మరింత ఎక్కువగా మథన పడింది. తెలంగాణ ప్రాచీన సాహిత్యాన్ని చరిత్రీకరించి 'ముంగిలి' లో నిలబెట్టిన కవి, రచయిత డాక్టర్ సుంకిరెడ్డి నారాయణ రెడ్డి.. తెలుగు సాహిత్యచరిత్రల రచనాచరిత్ర అధ్యయనంలో భాగంగా కె.శ్రీనివాస్ ఆయనతో జరిపిన సంభాషణ ఇది.



తెలుగుసాహిత్యచరిత్ర మీద సమగ్రమైన తెలంగాణవాద విమర్శ ఉన్నదా?

సమగ్రమో కాదో కానీ, అలాంటి విమర్శ ఖచ్చితంగా ఉంది. విస్మృతి, వివక్ష, కాంట్రిబ్యూటరీ కోణాల నుంచి, తనదైన ప్రస్థాన కోణం నుంచి, ఆ విమర్శ ఉన్నది.

1. మొదటి విమర్శ సురవరం ప్రతాపరెడ్డిది. గోలకొండ కవుల సంచిక సంపాదకీయంలో దాన్ని చూడవచ్చు. 'నవ్యాంధ్ర సాహిత్య వీథులు'పై ఆయన చేసిన సమీక్షలోనూ ఉంది. 2. దేవులపల్లి రామానుజ రావు వ్యాసాల్లో ఉంది. 3. వానమామలై వరదాచార్యులు రాసిన ఒక వ్యాసంలో ఉంది. 4. మీరు, నేను, సంగిశెట్టి శ్రీనివాస్, కాసుల ప్రతాపరెడ్డి రాసిన వ్యాసాల్లో ఉంది. వీటన్నిటినీ క్రోడీకరిస్తే అది సమగ్ర తెలంగాణ వాద విమర్శ అవుతుంది.

తెలంగాణ రచయితలకు తెలుగు సాహిత్యచరిత్రలో లభించిన పరిగణన ఎటువంటిది?

ప్రాచీన సాహిత్యంలో పాల్కురికి, పోతన, గోనబుద్ధారెడ్డిలాంటి కొద్దిమందే పరిగణన పొందిండ్రు. నూతన కవి సూరన, చరిగొండ ధర్మన, కాణాదం పెదసోమన, భైరవ కవి, తెలంగాణ నుంచే అత్యధికంగా వెలువడిన కులపురాణాలు, వీరగాథలు, కీర్తన, తత్వకవులు పరిగణన పొందలేదు. ఆధునిక సాహిత్యంలో, కొద్దిగా సురవరం, వట్టికోట, కొంత విస్తృతంగా కాళోజీ, దాశరథి, సినారె లాంటి కొద్దిమందే పరిగణన పొందిండ్రు. 1965 నుంచి ముఖ్యంగా 1970 నుంచి తగినంతగా, తగినంత మంది పరిగణన పొందిండ్రు. వానమామలై సోదరులు, ఒద్దిరాజు సోదరులు, మామిళ్ల రామగౌడ్, గంగుల శాయిరెడ్డి, భాస్కరభట్ల లాంటి చాలా మంది ఊసే లేకుంట పోయిండ్రు.

తెలంగాణ స్థలాలు, తెలంగాణ కథావ్యక్తులు, తెలంగాణ రాజ్యాలు సాహిత్యచరిత్రలో ఎటువంటి ప్రాతినిధ్యాన్ని పొందాయి?

"ఇప్పటికీ తెలంగాణకు చారిత్రక ప్రతీకలు కొదవే. ముఖ్యంగా చారిత్రక నాయకులు, యుద్ధాలు, ఘనమైన చారిత్రక దశ వంటివే లేవు" అని దాగ్మార్ బెర్న్ స్టార్ఫ్ అనే ప్రసిద్ధ పరిశోధకుడు రాసినాడు. తెలంగాణ తగినంత ప్రాతినిధ్యం పొందలేదని చెప్పటానికి ఈ మాటలు గొప్ప నిదర్శనం.

'విజయనగరం' అంత పొందకపోయినా ఓరుగల్లు ఒక్కటే తగినంత ప్రాచుర్యాన్ని పొందింది. అమరావతి ప్రాచుర్యం కోటిలింగాలకు దక్కలేదు. వేములవాడ, రాచకొండ, దోమకొండ, పాపన్న పేట, హైద్రాబాద్ (గోల్కొండ).. ఇలాంటి వాటి సంగతి సరే సరి.

ప్రతాపరుద్రుడు, రుద్రదేవుడు, గణపతిదేవుడు, అనపోతా నాయకుడు, లింగమనీడు, కులీ కుతుబ్ షా ఇలాంటి వారికి రెడ్డి రాజులకు లభించిన స్థానం కూడ లభించలేదు. నా రచనలు 'ముంగిలి', ' తెలంగాణ చరిత్ర' ల ముగింపు అధ్యాయాలలో ఈ అంశాలను వివరించాను.

తెలంగాణ వైపు నుంచి సాహిత్యచరిత్ర ఎట్లా ఉండాలని భావిస్తారు?

తెలుగు సాహిత్యాన్ని తెలంగాణ సాహిత్యం ఎట్లా సుసంపన్నం చేసిందీ తెలుపుతూనే, అంటే, కాంట్రిబ్యూటరీ, అంటే దోహదకారి చరిత్రగా ఉంటూనే తెలంగాణ చేసిన తనదైన ప్రత్యేక ప్రస్థానాన్ని తెలిపేదిగా తెలంగాణ వైపు నుంచి సాహిత్యచరిత్ర ఉండాలని అనుకుంటున్న.

సామాజిక, తదితర అస్తిత్వాల నుంచి సాహిత్యచరిత్రపై అనేక ప్రశ్నలు వచ్చాయి. తెలంగాణవాదం నుంచి తగినన్ని ప్రశ్నలు వచ్చాయని భావిస్తున్నారా?

వచ్చినయి కదా! మీ మొదటి ప్రశ్నకు చెప్పిన జవాబులోనే ఆ ప్రశ్నలు కూడా ఇమిడి ఉన్నాయి. అయితే, ప్రశ్నల స్వభావంలో మౌలికమయిన భేదం ఉంది. స్త్రీ, దళిత, బహుజన అస్తిత్వాల ప్రశ్నలు వివక్షకు, అణచివేతకు సంబంధించినవి. అవి కేవలం సాహిత్య చరిత్ర కారులపై ఎక్కుపెట్టబడినవి కావు. సాహిత్య సృజనకారులతో సహా మొత్తం సమాజంపై ఎక్కుపెట్టబడినవి. అందువల్ల, వాట్లిలో తీవ్రత ఉంటుంది. అది కూడా స్ట్రయికింగ్ గా ఉంటుంది.

తెలంగాణవాద ప్రశ్నలు చరిత్రకారులపై ఎక్కుపెట్టినవి. అందువల్ల అంత తీవ్రత కనిపించదు. ప్రశ్నలే లేనట్టు అనిపిస్తది. అయితే, వర్తమానానికి సంబంధించిన ప్రశ్నల్లో ఆ తీవ్రత ఉన్నది.

తెలంగాణ కవులు, పండితుల జీవితాలను, కావ్యాలను లేదా రచనలను గురించి రాసే పుస్తకాలు సాహిత్యచరిత్ర అవుతాయా?

అవుతయి. ఏ భాషా సాహిత్యచరిత్ర నిర్మాణ క్రమంలోనైనా తొలిదశలో కవుల చరిత్రలే సాహిత్యచరిత్రలు. ముందు ఎంతమంది కవులున్నారో, ఎన్ని రచనలున్నవో బయటికి రావాలి గదా? సాహిత్య పరిణామ చరిత్రనే సాహిత్యచరిత్ర అని మీ ఉద్దేశం కావచ్చు. అది అనంతర దశలో సాధ్యం కావచ్చునేమో. ఎందుకంటె తొలికవుల చరిత్ర (కావలి రామస్వామి, దక్కన్ కవుల చరిత్ర, (1829) వచ్చి దాదాపు 200 సంవత్సరాలయినా ఇప్పటికీ సమగ్ర తెలుగు సాహిత్య చరిత్ర రాలేదు.

> తెలుగు సాహిత్యాన్ని తెలంగాణ సాహిత్యం ఎట్లా సుసంపన్నం చేసిందీ తెలుపుతూనే, అంటే, కాంట్రిబ్యూటరీ, అంటే దోహదకారి చరిత్రగా ఉంటూనే తెలంగాణ చేసిన తనదైన ప్రత్యేక ప్రస్థానాన్ని తెలిపేదిగా తెలంగాణ వైపు నుంచి సాహిత్యచరిత్ర ఉండాలని అనుకుంటున్న

'ముంగిలి'ని మీరు కవుల చరిత్ర, పాలకుల యుగవిభజన కలిసిన ధోరణిలో రాశారు. వస్తు, ప్రక్రియ, శిల్ప ధోరణుల రీత్యా తెలంగాణా సాహిత్య చరిత్ర గతిని నిర్వచించి, నిర్మించడం సాధ్యమేనా, మీకు ఆలోచన ఉందా?

మొన్నటిదాకా వచ్చిన చరిత్రలు సాహిత్య చరిత్రలు అన్నీ సాధారణీకరించిన ప్రధాన కథనాలే, మహా కథనాలే. వస్తు ప్రక్రియ, శిల్ప తదితర ప్రాతిపదికన వచ్చిన సాధారణ (Generalise చేసిన) పరిణామ చరిత్రలే. వీటివల్ల ప్రాదేశిక నిమ్న శ్రేణుల తదితరాలకు సంబంధించిన ఎన్నో విస్మరణలు జరిగినవి. వాటిలో నిర్దిష్టతకు విభిన్నతలకు స్థానం లభించలేదు. అందుకే వాటిని తిరస్కరించి సబాల్టరన్, విభిన్నతల, నిర్దిష్టతల, అట్టడుగు నుంచి చరిత్ర రచనల (History from below) అధ్యయనాలు ముందుకు వచ్చినవి. ముందుగా తెలంగాణ నుంచి వచ్చిన సాహిత్యమంతా వెలుగులోకి రావాలె. అలా జరగాలంటే ఏ ప్రాతిపదికన చేసిన యుగ విభజనను అనుసరించినా ఏదో ఒక విస్మరణ జరుగుతుంది. అంటే ఒక విస్మరణను సవరించబోయి మరొక విస్మరణకు కారకులమౌతం. అలా జరగకూడదనే రాజవంశ యుగాలను (ఇందులో కూడా కొన్ని విస్మరణలున్నవి) తీసుకొని 'ముంగిలి'లో కాలక్రమంగా కవుల చరిత్రను రాసిన. ఏ భాష, ప్రాంత సాహిత్య చరిత్ర నిర్మాణంలోనైనా తొలుత జరగాల్సింది ఇదే. అంతేకాక జిల్లాల వారీగా నిమ్నశ్రేణుల వారీగా ప్రక్రియల వారీగా తెలంగాణ సాహిత్యమంతా వెలుగులోకి రావాలె. అది రికార్డ్ కావాలె. అప్పుడు మాత్రమే తెలంగాణ సాహిత్య చరిత్ర గతిని నిర్వచించి సమగ్ర సాహిత్య చరిత్రను నిర్మించడం సాధ్యం అవుతుంది. అప్పుడైనా ఏదో ఒక అంశం ప్రాతిపదికన 'గతి' (పరిణామ సూత్రం)ని నిర్వచించడం సరి అయింది కాదు.

ప్రాదేశిక సాహిత్య చరిత్రలో ఇతర స్థానిక భాషల సాహిత్యాలు కూడా భాగమేనా?

ఒక ప్రాదేశిక విభాగంలో ప్రధాన భాషతో పాటు సంస్కృతం, ఉర్దూ, కోయ, గోండి లాంటి భాషలు, వాటి సాహిత్యం ఉంటయనేది తెలిసిన విషయమే. వీటన్నిటి సాహిత్యచరిత్రనే మీరు 'సమగ్ర సాహిత్యచరిత్ర' గా ఉద్దేశిస్తే, అలాంటి సాహిత్య చరిత్ర అవసరమే.

ఒక ప్రాంతంలో ప్రధాన భాషకు చెందిన సాహిత్యంలో జరిగే పరిణామమే ఆ ప్రాంత ఇతర భాషా సాహిత్యాల్లో జరగొచ్చు, కొన్ని సందర్భాల్లో జరగకపోవచ్చు. వాటి ప్రత్యేకత వాటికి ఉండొచ్చు. అందువల్ల అన్ని భాషా సాహిత్యాల సమగ్ర చరిత్ర అవసరం.

సాహిత్య చరిత్రకారుడిగా, తెలంగాణ సాహిత్య పరిణామ క్రమంలో ఏదైనా ప్రత్యేకమైన క్రమానుగత సరళిని గుర్తించారా?

సంస్కృతాంగ్ల ప్రభావంతో కాకుండా స్థానిక సామాజిక పరిస్థితుల నుండి సాహిత్యం ఉత్పన్నం కావడం ఇక్కడి ఒకానొక ప్రత్యేకత.

ప్రఖ్యాతంగా ఉన్న యుగవిభజనకు భిన్నమైన విభజనను ప్రతిపాదిస్తారా?

ప్రక్రియను బట్టి, కవులను బట్టి చేసిన విభజన అవ్యాప్తి, అతివ్యాప్తి దోషాలకు గురైందనే విషయం తెలిసిందే. యుగ సాహితీ స్వభావాన్ని సూచించక పోయినా, రాజ్య వంశాలను అనుసరించి చేసిన విభజననే కొంత అనుకూలమైనది. తెలుగు సాహిత్యచరిత్రల్లో చేసిన ఏ విభజనా మిగతా ప్రాంతాలకు, ముఖ్యంగా తెలంగాణకు వర్తించదు.

తెలంగాణ సాహిత్య చరిత్రకు నేను ఒక విభజన చేశాను. యుజిసి కి అందించిన మేజర్ రీసర్చ్ ప్రాజెక్టు ప్రతిపాదనలో దాన్ని పేర్కొన్నాను. ప్రాచీన సాహిత్యాన్ని ప్రధాన రాజవంశాల యుగాలుగా విభజించాను. ఆధునికత సాహిత్యాన్ని నవ్య ప్రజాస్వామిక, అభ్యుదయ, అభ్యుదయానంతర, విప్లవ, విప్లవ కవిత్వానంతర, అస్తిత్వవాద యుగాలుగా ప్రతిపాదించాను.

ఒక భాషకు సంబంధించిన సాహిత్య చరిత్రలో ప్రాదేశిక ఉపవర్గీకరణ ఎంతవరకు సాధ్యం? రెండు లేదా మూడు లేదా అంతకంటె ఎక్కువ ప్రాంతాలలో ఉండే విభిన్నతలతో పాటు సారూప్య అంశాలను చరిత్ర రచనలో ఎట్లా నిర్వహించాలి?

చాలా గొట్టు ప్రశ్న.

వినిర్మాణ వాదం చర్చించిన అంశాలలో ఇది కూడ ఒకటి. దాన్ని మీరు 'విభిన్నత' అన్న పదం ద్వారా సూచించారు.

ఉపవర్గీకరణ సాధ్యమే. కాని దాని వల్ల ఇతర ప్రాదేశికతలకు న్యాయం చేకూరదు. వాటికి 'ఉప' శ్రేణి హోదానే లభిస్తుంది. సారూప్య అంశాలను చెప్పబోతే సాధారణీకరణ అయి కూర్చుంటుంది. విభిన్నతలు విస్మృతికి లేదా అణచివేతకు గురైతవి.

భారతదేశ చరిత్రలో భాగంగా చూసినంత కాలం దక్షిణ భారతదేశ చరిత్ర మరుగున పడే ఉంది. నీలకంఠశాస్త్రి దక్షిణ భారతదేశ చరిత్ర రాసిన తర్వాత మాత్రమే దక్షిణ భారతానికి ఎంతో కొంత గుర్తింపు వచ్చింది.

అందువల్ల, ఆయా ప్రాదేశికతల విడి విడి చరిత్రలు రాసుకోవడమే తొలుత చేయాల్సింది. తర్వాత సారూప్య అంశాలు ఒక్క చోట చేరుస్తూ అక్కడికక్కడే విభిన్నతలను ప్రత్యేకంగా ప్రస్తావించాల్సి ఉంటుంది.

ఇంటర్వ్యూ ■ కె.శ్రీనివాస్

ప్రేమలో కొన్ని తప్పులూ ఒప్పులూ

రెండు రెళ్ళు నాల్గనీ, చీకటైతే రాత్రనీ ఈ లోకంలో చెల్లుబాటయ్యే మాటలు ఎన్నైనా చెప్పచ్చు కానీ, కవిత్వ ప్రపంచంలో అడుగుపెట్టాక, గుప్పెడు పదాలు కవిత్వమెందుకు అవుతాయో, ఆ పొందికలో ప్రాణాన్ని దాచుకున్న మాట ఎక్కడుందో వివరించి చెప్పడం చాలా కష్టం. 'ప్రూఫ్ రీడింగ్' అని నందకిషోర్ రాసిన ఈ కవిత్వం, అచ్చంగా ఈ కోవలోకే చెందుతుంది. ఈ పద్యంలో మిరుమిట్లు గొలిపే పదాలు, ఉపమానాలు లేవు. హడావుడి లేదు. ఉన్నదల్లా ఒక అపురూపమైన భావం. అపూర్వమైన అల్లిక.

ప్రేమికుల కవిత్వంలో ఏ కాలాల్లోనైనా అదే ప్రేమ విన్నపం, అదే ఎడబాటు, అదే కోర్కె, మాయని అదే జ్ఞాపకం.

ప్రియ పద్యం



కానీ వ్యక్తీకరణను సంభాషణగా మార్చడం ద్వారా కవితలో కొత్తదనం తీసుకురావడమెట్లానో ఇందులో చూడగలం. భాషలో తప్పులు వెదుకుతున్న ప్రేయసిని ఆపి, ఆ తప్పులన్నీ నీ వల్లేనమ్మీ అని ఎత్తిపొడిచే ప్రియుడి అల్లరి ఈ కవిత. ఆ జవాబులోక నెపంగా మళ్ళీ తన ప్రేమని నొక్కి చెప్పి, పాత జ్ఞాపకమొకటి ఆమెలోనూ తట్టి లేపి రెచ్చగొట్టే జాణతనం ఈ కవిత. ఒత్తుగా నిండుగా విరబూసిన గులాబీని అడ్డు పెట్టుకుని తన ప్రేమనంతా మొదటి పాదంలోనూ, ఒక్కటిగా ఉండాల్సిన ఇంద్రధనుస్సు రంగులు ఎడమైతే ఎంత ఎబ్బెట్టుగా ఉంటుందో, తమ మధ్య దూరమూ అలాంటిదేనన్న ఊహని రెండో పాదంలోనూ చెప్పాడు. ఆపైన, ఆ ఎడబాటులో నుండీ ఆమెను కూడిన క్షణాలను తల్చుకుంటున్నాడు. ఆ కలిసిన క్షణాల ప్రేమ సాఫల్యతను కలగంటున్నాడు. పొద్దులు పడట మంటే, నెల తప్పడం. కడుపులో నలుసు పడటం. అది ఉత్త కలే. కానీ అందులోనే ఆ ప్రేమ జ్వరతీవ్రత ఉంది. ఆమెను కలిసిన, ఆమెతో కూడిన క్షణాలను మరపుకు తెచ్చుకోలేని అశక్తతతో నిండిన దిగులూ ఉంది. అంత దిగులుపడ్డ హృదయానికి ఊరట ఆమెదొక్క ముద్దు. ఊపిరి నిలిచేలా సుదీర్ఘమైన ముద్దిచ్చిన ప్రియురాలి ప్రేమతో లయ తప్పిన హృదయపు సౌందర్యం పరిచింది కనుకే, ఇది నాకు ప్రియమైన పద్యం.

■ మానస చామర్తి



ప్రూఫ్ రీడింగ్

"గులాబీలో ఈ ఒత్తెవరా పెట్టింది?"
అది ఒత్తుగా పూసిందమ్మి
"ఇంద్ర ధనుస్సు మధ్యలో ఈ ఖాళీ ఎందుకు?"
అదీ... మన ఎడబాటు గుర్తుగా...
"పద్యం పొట్టలో ఈ చుక్కేంటి మరి?"
ఊ.. నీకు పొద్దులు పడ్డట్టు కల..
"రేయ్ రేయ్... హృదయంలో ఈ దీర్ఘం"
అది ఊపిరిదమ్మి, నువ్వు ముద్దిచ్చినప్పటిది.

■ నందకిశోర్



వీల్ చైర్...

భలే మనుషులం మనం..
ఎక్కడ వదిలేస్తే అక్కడే ఉండిపోతాం

పరుపులు, సోఫాల్లో రోజూ తనువు చాలిస్తూ
చిత్ర విచిత్ర హింసలు పొందుతుంటాం

దాటలేని దూరాల కోసం
శరీరాన్నంతా కాళ్లలోకి తెచ్చుకుంటాం
కానీ, బయలుదేరిన దగ్గరే చతికిలబడతాం

భయపెట్టే సీను వచ్చినప్పుడు
గట్టిగా కళ్లు మూసుకుంటాం

యుద్ధ రజను వాసనకు
లేసొస్తున్న రెక్కల దెయ్యాలు
తెరను కిందకు లాగేయమని
విదూషకుడు అరుస్తున్నాడు
భలే మనుషులం మనం
ఆ క్షణానికి కళ్లు మూస్తే, తెర లాగేస్తే
బతికేయొచ్చు అనుకుంటాం.

■ రివేరా


నా విజిటింగ్ కార్డుగా మారిపోయింది

నా మొదటి పుస్తకం

■ వాడ్రేవు చినవీరభద్రుడు



మా అన్నయ్య వాడ్రేవు సుందర్రావు ప్రోద్బలంతో నా మొదటి పుస్తకం 'నిర్వికల్ప సంగీతం' 1986లో వెలువరించాను. ఆ పుస్తకం వేసుకోడానికి సాంస్కృతిక శాఖ 1800 రూపాయలు ఆర్థిక సహాయం ప్రకటించింది గాని తొమ్మిది వందలే ఇచ్చింది. మిగిలిన సొమ్ము నా మిత్రుడు సోమయాజులు పెట్టుకున్నాడు. ముఖ పత్రం మా మిత్రుడు చట్టి హనుమంతరావు డిజైన్ చేసాడు. రాజమండ్రి మ్యూజియంలో ఉన్న ఒక మదర్ గాడెస్ శిల్పాన్ని ముఖచిత్రంగా వాడుకున్నాం. సమాచారం సుబ్రహ్మణ్యం తన మిత్రుడు ప్రతాప్‌కి చెందిన ప్రింటోఫైన్ ప్రెస్సులో ఆ పుస్తకం వేయించాడు. రాజమండ్రి సాహితీ వేదిక ఆధ్వర్యంలో గౌతమీ గ్రంథాలయంలో ఆ పుస్తక ఆవిష్కరణ జరిగింది. ఆవిష్కరణ సమావేశం ఖర్చు వంద రూపాయలు మిత్రుడు గోపీచంద్ పెట్టుకున్నాడు. మా బామ్మగారు వాడ్రేవు లక్ష్మీదేవమ్మ నాకు నా పసితనాన పోతన భాగవతంలో ఎన్నో పద్యాలు కంఠస్థం చేయించారు. సాహిత్యానికి ఆమె నా తొలిగురువు. కాబట్టి ఆ పుస్తకం ఆవిష్కరించమని ఆమెని అభ్యర్థించేను. మల్లంపల్లి శరభయ్య గారూ, ఆర్.ఎస్. సుదర్శనం గారూ, మిత్రులు మహేశ్, గోపీచంద్‌లతో పాటు మా అక్క కూడా ఆ రోజు ఆ పుస్తకం మీద మాట్లాడేరు. 500 కాపీలు వేయించాం. ఒక్కొక్క కాపీ పది రూపాయలు వెల పెట్టానుగానీ ఆ కాపీలన్నీ దాదాపుగా మిత్రులకీ, సాహిత్యాభిమానులకీ పంచిపెట్టేసాను. ఆ పుస్తకం వెలువడగానే ఇంద్రగంటి శ్రీకాంత శర్మ ఆంధ్రజ్యోతి దినపత్రిక సాహిత్యానుబంధంలో దాదాపు సగం పేజీ రివ్యూ రాసారు. ఆ రివ్యూ చదివి సిరిసిల్ల నుంచి జూకంటి జగన్నాథం పది రూపాయలు మనియార్డరు పంపించాడు. ఆయనే ఆ కవిత్వానికి మొదటి, చివరి కొనుగోలుదారు. మరొక గొప్ప ఆశ్చర్యం ఆంధ్రప్రభలో దాశరథి కృష్ణమాచార్య దాన్ని సమీక్షించటం. సాహిత్యలోకంలో నా పేరు అప్పటిదాకా ఎవరికీ తెలియదు. అందుకని దాశరథి నేను ఎక్కడో విదేశాల్లో ఉంటున్నానేమో అనుకున్నారట. మా అక్కయ్యకి ఉత్తరం రాస్తూ నేను ఏ దేశంలో ఉంటానో చెప్తే తాను అక్కడికి వెళ్ళినప్పుడు నన్ను కలుసుకుంటానని రాసారు. అజంతాకి ఒక కాపీ పంపిస్తే 'అద్భుతం, మరో మాట లేదు' అని రాసాడు. శేషేంద్ర రాజమండ్రి వచ్చినప్పుడు 'ఈ కవిని వసంతశాఖ మీద కోకిలగా ప్రతిష్ఠిస్తున్నాను' అని ఆశీర్వదించాడు. ఇస్మాయిల్, చండీదాస్, మో, త్రిపుర వంటి కవులు ఎందరో ఆ పుస్తకాన్ని మనసారా స్వాగతించారు. నూతలపాటి గంగాధరం స్మారక పురస్కారం అందుకోడానికి తిరుపతి వెళ్ళినప్పుడు మధురాంతకం రాజారాం గారు మనసారా స్వాగతించడం మరొక జ్ఞాపకం. ఆ తర్వాత రోజుల్లో ఆ పుస్తకం నాకు విజిటింగ్ కార్డుగా మారిపోయింది అంటే అతిశయోక్తి కాదు.



మండల స్వామి సంస్మరణ సభ

దివంగత కవి రచయిత మండల స్వామి సంస్మరణ సభ, మిత్రులచే స్వామి కవిత్వ పఠన కార్యక్రమం అక్టోబర్ 30 సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్ కవుల వేదిక సమావేశ మందిరం, విజయశ్రీ కాలనీ కమ్యూనిటీ హాల్, వనస్థలిపురం, హైదరాబాద్‌లో జరుగుతుంది. మండల స్వామి మిత్రులందరికీ ఆహ్వానం. వివరాలకు: 89788 69183

ఏనుగు నరసింహారెడ్డి

జి.ఎన్. సాయిబాబా సంస్మరణ సభ

జి.ఎన్. సాయిబాబా సంస్మరణ సభ సి.యస్.ఆర్. ప్రసాద్ అధ్యక్షతన అక్టోబర్ 30 సాయంత్రం 5.30 గంటలకు సి.పి.యం. కార్యాలయంలోని కొరటాల సత్యనారాయణ హాలు, 2/7, బ్రాడీపేట, గుంటూరులో జరుగుతుంది. 'తెలుగు కవిత్వంలో కా. సాయిబాబా' అంశంపై అరసవెల్లి క్రిష్ణ, 'ప్రజా ప్రతిఘటన నమూనాగా కా. సాయిబాబా' అంశంపై పాణి ప్రసంగిస్తారు.

విరసం

'చారల పిల్లి' కథల పుస్తకం

వేంపల్లె షరీఫ్ రాసిన 'చారల పిల్లి' కథల పుస్తకం ఆవిష్కరణ నవంబరు 3 సాయంత్రం 5 గంటలకు విజయవాడలోని బుక్ ఫెస్టివల్ కాన్ఫరెన్సు హాల్లో జరుగుతుంది. ఖాదర్ మొహియుద్దీన్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తారు. వక్తలుగా కాట్రగడ్డ దయానంద్, మల్లీశ్వరి, అరుణాంక్ లత, బత్తుల ప్రసాద్, అనిల్ డానీ పాల్గొంటారు.

సూఫీ పబ్లికేషన్స్

కవి వారం – కవిత్వ తరగతి

తెరసం – జంట నగరాలు, తెలుగు భాషా సంస్కృతి శాఖల నిర్వహణలో నవంబర్ 3 మధ్యాహ్నం 2గంటలకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో 'కవి వారం- కవిత్వ తరగతి, కవి సమ్మేళనం' కార్యక్రమం జరుగుతుంది. నందిని సిధారెడ్డి 'వర్తమాన జీవితం-వచన కవిత నిర్మాణం' అంశంపై ప్రసంగిస్తారు. కందుకూరి శ్రీరాములు, మామిడి హరికృష్ణ, సంపత్ కుమార్ పాల్గొంటారు.

తెలంగాణ రచయితల సంఘం

రాయలసీమ నాటక రచనా పోటీలు

రాయలసీమ సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో 'రాయలసీమ సమాజం - జీవ సంస్కృతి' నేపథ్యంగా ఏకాంకిక, నాటిక, నాటక రచనా పోటీలను ఎం.వి. రమణారెడ్డి స్మారకంగా నిర్వహిస్తున్నాం. డిసెంబరు 22 లోపు రచనలను పంపాలి. మొత్తం రూ.15వేల నగదు బహుమతులు అందచేస్తాం. పూర్తి వివరాలకు: 99639 17187.

అప్పిరెడ్డి హరినాథరెడ్డి

వచన కవిత అధ్యయన శిబిరం

తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో నవంబర్ 24న ఇప్పటికే కవిత్వ రంగంలో కొంత కృషి చేసినవారికి వస్తు, శిల్పపరమైన శిక్షణ కోసం వచన కవిత్వ అధ్యయన శిబిరం జరుగుతుంది. కవులు ఇప్పటివరకు వెలువరించిన కవితల వివరాలను తెలియజేస్తూ, మచ్చుకు ఒక కవితను 9603727234 వాట్సాప్ నెంబర్‌కు పంపాలి.

జె. చెన్నయ్య

నిన్ను ఎవరైనా ప్రేమిస్తే...

ఎట్లా లేచావు ఉదయం! రాత్రంతా, ఎవరో
వెన్నెలని తైలంగా మార్చి
నిన్నో వొత్తిని చేసి వెలిగించినట్లు, మరి

నీ ముఖంలో, ఊరకనే నవ్వు! మెరుస్తోంది
నీ శరీరం, బంతిపూవులాగా!
నీలో మట్టిపై చిందే చినుకుల సువాసన!

ఊరకనే, శిశువులు నవ్వినట్టు నవ్వుతావు
శృతి చేసినట్టు, సర్వాన్నీ ఇక
బిడ్డని తాకినట్టు తాకి, ఎత్తుకుంటావు

"ఎందుకిలా అయ్యారు, మీరు?" అని అడిగి
Diaper మార్చినట్టు, వాళ్ళల్లో
పేరుకున్న పరాయితనాన్ని తీసివేస్తావు

నీ ఎదురుగా అక్టోబర్ నెల చంద్రుడు. చెప్పు
ఎవరి ముఖం అది? మంచులో
తడిచీ, రాత్రిలో గాలికి ఊగే గడ్డి పూవులు,

ఎవరి మాటలు, అవి? కూర్చుని ఉన్నా, మరి
లేచినా, నువ్వేం చేసినా కూడా,
నిన్ను వానగా మార్చిన ఆ రూపం ఎవరిది?

◆◆◆

అన్నం తిన్నావా? అని అడుగుతావు? జాగ్రత్త
అని చెబుతావు. క్షణానికోసారి
Msg చేసి, ఏం చేస్తున్నావు అనడుగుతావు!

అబ్బా అని వాళ్ళు విసుకున్నా సరే, తల్లి కోడి
వెనుకే తిరిగే, పిల్లవి నువ్వు
వస్తున్నావా అనీ, జాగ్రత్త అనీ, ఎక్కడ అనీ!

◆◆◆

ఎట్లా పడుకున్నావు నువ్వు! నీలో నువ్వు చేరి
దగ్గరగా ముడుచుకుని
చీకట్లో దీపం వెలిగించినట్లు నీ పెదాలపై


చిరునవ్వు. ఎవరో, దుప్పటి కప్పి వెళ్లినట్లుగా
అంత నిద్రలోనూ నీకు
తెలిసినట్లు, ఒక తేలికైన ఆనందం. ఇష్టం

◆◆◆

తాకకుండానే స్పర్శ తెలిసినట్లుగా, ఊరకనే
నిజంగా మరి బ్రతికి
ఉండటం బావుంటుంది అని తెలిసీ, నీలో

నువ్వే వెలిగీ, గాలై వీచీ, వాళ్ళే నువ్వైపోయి!

■ శ్రీకాంత్





శ్రీశైలంలో దర్శనానికి క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

శ్రీగిరిలో భక్తుల రద్దీ

శ్రీశైలం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా శ్రీశైలం మహాక్షేత్రానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం కావడంతో రెండు తెలుగు రాష్ట్రాలు, దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్ల దర్శనానికి వచ్చారు. వేకువజాము నుంచే భక్తులు పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి, గంగమ్మకు దీపహారతులు సమర్పించారు. దేవస్థానం కల్యాణకట్ట వద్ద తలనీలాలు సమర్పించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం స్వామి, అమ్మవార్ల దర్శనార్థం క్యూలైన్లలో బారులుదీరారు. నవంబరు రెండో తేదీ నుంచి కార్తీకమాసం ప్రారంభం కానున్న నేపథ్యంలో దేవస్థానం అధికారులు భక్తుల సౌకర్యాల కల్పనకు చర్యలు చేపడుతున్నారు. ఆర్జిత సేవా టికెట్లను దేవస్థానం వెబ్‌సైట్ ద్వారా పొంది శ్రీశైలానికి రావాలని అధికారులు సూచించారు.

9న శ్రీవారి ఆలయంలో పుష్పయాగం

తిరుమల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో నవంబరు 9వ తేదీన పుష్పయాగం శాస్త్రోక్తంగా జరగనుంది. సాయంత్రం సహస్రదీపాలంకార సేవ అనంతరం నాలుగు మాడవీధుల్లో మలయప్పస్వామి ఊరేగుతారు.

31న వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు

ఈ నెల 31న శ్రీవారి ఆలయంలో దీపావళి ఆస్థానం సందర్భంగా వీఐపీ బ్రేక్ దర్శనాలను రద్దు చేశారు. స్వయంగా వచ్చే ప్రొటోకాల్ ప్రముఖులకు మినహా ఇతర వీఐపీ బ్రేక్ దర్శనాలన్నీ రద్దు చేస్తూ టీటీడీ నిర్ణయం తీసుకుంది.

పెట్టని పరీక్షకు.. రూ.కోట్ల ఖర్చు

గతేడాది అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాల భర్తీకి చర్యలు... దరఖాస్తుల దశలోనే నిలిపివేత

అయినా ప్రశ్నపత్రాల తయారీకి 2.57 కోట్లు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలోని యూనివర్సిటీలు, ఆర్జీయూకేటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్, లెక్చరర్ పోస్టులను భర్తీ చేసేందుకు వైసీపీ హయాంలో ప్రక్రియ మొదలైంది. ఈ పోస్టులకు ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించారు. పరీక్షల నిర్వహణ బాధ్యతను ఏపీపీఎస్సీకి అప్పగించారు. ఈ మేరకు ఏపీపీఎస్సీ, ఉన్నత విద్యామండలి, ఆంధ్రా యూనివర్సిటీల మధ్య 2023, ఆగస్టు 6న త్రైపాక్షిక ఒప్పందం కుదిరింది. ఆ తర్వాత ఉన్నత విద్యామండలి పోస్టుల భర్తీకి రహస్యంగా నోటిఫికేషన్లు జారీ చేసింది. నవంబరులో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ మొదలైంది. అయితే, రోస్టర్ విధానాన్ని తప్పుబడుతూ.. అభ్యర్థులు హైకోర్టుకు వెళ్లడంతో ప్రక్రియ నిలిచిపోయింది. దరఖాస్తులు స్వీకరించాలని, ఆ తర్వాత ప్రక్రియను తాము ఆదేశాలు ఇచ్చే వరకు చేపట్టవద్దని న్యాయస్థానం ఆదేశించింది. దరఖాస్తుల పరిశీలన కూడా చేయొద్దని స్పష్టం చేసింది.

> దరఖాస్తుల స్వీకరణ సక్రమంగా జరగలేదు. పరీక్షలు సైతం నిర్వహించలేదు. కానీ, ఏపీపీఎస్సీ ప్రశ్నపత్రాలు రూపొందించింది. దీనికిగాను ఉన్నత విద్యామండలి రూ.2.57 కోట్లు చెల్లించింది. తీరా చూస్తే ఇప్పుడు కథ మొదటికొచ్చింది. మళ్లీ కొత్తగా నోటిఫికేషన్లు జారీచేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో ప్రశ్నపత్రాల రూపకల్పనకు చేసిన ఖర్చు వృథా అయిపోయింది.

రిజర్వేషన్‌లో తప్పులు

ఎన్నికల వేళ పోస్టులు భర్తీ ప్రక్రియ చేపడితే రాజకీయ లబ్ధి చేకూరుతుందని వైసీపీ ప్రభుత్వం పక్కా ప్లాన్‌తో ఎన్నికలకు కొద్ది నెలల ముందు పోస్టుల భర్తీకి చర్యలు ప్రారంభించింది. అయితే, రోస్టర్‌లో తప్పులతడకలు చోటు చేసుకున్నాయి. ఎక్కడాలేని విధంగా సొంత నిబంధనలు తయారు చేసుకుని ఖాళీలకు కొత్త రోస్టర్ రూపొందించడం వివాదానికి దారితీసింది. ఉదాహరణకు ఒక యూనివర్సిటీలో ఒక సబ్జెక్టు ఫ్యాకల్టీకి కేటాయించిన మొత్తం పోస్టులకు రోస్టర్ పాటించాలి. అంటే, ఉద్యోగులున్న పోస్టులు, ఖాళీలకు కలిపి రోస్టర్ ఉంటుంది. కానీ.. ఉన్నత విద్యామండలి అప్పటి వైస్ చైర్మన్, ప్రస్తుత ఇన్‌చార్జ్ చైర్మన్ కె.రామ్మోహన్‌రావు నేతృత్వంలో సొంత నిబంధనలు రూపొందించారు. పనిచేస్తున్నవారి రోస్టర్‌ను పరిగణనలోకి తీసుకోకుండా, ఖాళీలకు మాత్రం కొత్తగా రోస్టర్ రూపొందించారు. దీనివల్ల కొందరికి మేలు జరిగితే, కొందరికి అన్యాయం జరిగింది. మొత్తంగా నిబంధనలకు విరుద్ధంగా ఈ రోస్టర్ తయారు చేయడంతో ఈ ప్రక్రియకు కోర్టు బ్రేకులు వేసింది.

ఆగిపోతుందని తెలిసినా

రోస్టర్‌లో తప్పులు చేయడంతో ఈ ప్రక్రియ ముందుకు సాగదని ఉన్నత విద్యామండలి అధికారులకు ముందే అర్థమైంది. అందుకే అంత కీలకమైన నోటిఫికేషన్లను రహస్యంగా విడుదల చేశారు. మొత్తం 18 యూనివర్సిటీలు, ఆర్జీయూకేటీల్లోని 2 వేల పోస్టులకు రాత పరీక్ష జరగాలి. వాటిలో 97 రకాల సబ్జెక్టులు ఉన్నాయి. ఒక్కో ప్రశ్నపత్రంలో 150 ప్రశ్నలుంటాయి. ఒక్కో ప్రశ్న తయారీకి రూ.1,770 ఖర్చు అవుతుందని ఏపీపీఎస్సీ అంచనా వేసింది. దీనికిగాను రూ.2.57 కోట్లు ఖర్చు అయిందని, ఆ మేరకు బిల్లులు చెల్లించాలని ఏపీపీఎస్సీ.. ఉన్నత విద్యామండలిని కోరింది. గత ప్రభుత్వంలోనూ పలుమార్లు బిల్లులు చెల్లించాలని కోరితే పట్టించుకోని ఉన్నత విద్యామండలి, కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ ఆగస్టులో ఆ బిల్లులు చెల్లించింది. అసలు ప్రక్రియ ముందుకు సాగదని అర్థమైనా ప్రశ్నపత్రాల రూపకల్పనను ఆపాలని ఒక్కసారి కూడా ఏపీపీఎస్సీని ఉన్నత విద్యామండలి కోరలేదు. దీంతో చేసుకున్న ఎంవోయూ ప్రకారం ఏపీపీఎస్సీ పరీక్షకు ఏర్పాట్లు చేసింది.

ఇప్పుడు కొత్త.. కొత్తగా!

అసిస్టెంట్ ప్రొఫెసర్, లెక్చరర్ పోస్టుల భర్తీని గత ప్రభుత్వం రాజకీయ లబ్ధికి వాడుకోవాలని ప్రయత్నించిన విషయాన్ని గుర్తించిన కూటమి ప్రభుత్వం మళ్లీ కొత్త నోటిఫికేషన్లు విడుదల చేయాలని నిర్ణయించింది. దీంతో రూ.2.57 కోట్లు దాదాపుగా వృథా అయిపోయినట్లేనని అధికారులు భావిస్తున్నారు. అయితే, గత ప్రభుత్వంలో రోస్టర్‌ను గందరగోళం చేసిన మండలి ఇన్‌చార్జ్ చైర్మన్ రామ్మోహనరావే ఈ బిల్లులు చెల్లించారు. ఇప్పుడు కొత్త నోటిఫికేషన్లు, యూనివర్సిటీల వైస్ చాన్సలర్ల నియామక ప్రక్రియను కూడా ఆయనే పర్యవేక్షిస్తున్నారు.



డిప్యూటీ సీఎం పవన్‌తో పార్థిబన్ భేటీ

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌ను ప్రముఖ సినీ నటుడు పార్థిబన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం సాయంత్రం మంగళగిరిలోని ఉప ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయంలో పవన్‌కళ్యాణ్‌తో ఆయన భేటీ అయ్యారు.

- ఆంధ్రజ్యోతి, అమరావతి

నేడు విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో

బ్లాస్ట్‌ఫర్నేస్-1 పునఃప్రారంభం



స్టీల్‌ప్లాంట్‌లోని బ్లాస్ట్‌ఫర్నేస్-1 (గోదావరి)

ఉక్కుటౌన్‌షిప్ (విశాఖపట్నం), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్‌ప్లాంటులోని బ్లాస్ట్‌ఫర్నేస్-1 (గోదావరి)లో సోమవారం నుంచి ఉత్పత్తి పునఃప్రారంభం కానుంది. ముడిసరకు అందుబాటులో లేకపోవడం, విభాగం నిర్వహణ, తదితర కారణాలతో ఆర్నెల్ల కిందట దీనిలో ఉత్పత్తి నిలిపివేశారు. ప్లాంటు ఉత్పత్తిలో ఇది కీలక విభాగం కావడంతో పునఃప్రారంభించేందుకు యాజమాన్యం చర్యలు తీసుకుంది. స్టీల్‌ప్లాంట్‌లో బ్లాస్ట్‌ఫరేస్-1 (గోదావరి), బ్లాస్ట్‌ఫర్నేస్-2 (కృష్ణ), బ్లాస్ట్‌ఫర్నేస్-3 ఉన్నాయి. మూడో ఫర్నేస్‌లో రెండేళ్ల కిందటే ఉత్పత్తి నిలిపివేశారు. ఆర్నెల్ల క్రితం ఒకటో ఫర్నేస్‌లో ఉత్పతి నిలిపివేయడంతో ఒక్క (కృష్ణ) ఫర్నేస్‌లో మాత్రమే ఉత్పత్తి జరుగుతోంది. తాజాగా ఒకటో ఫర్నేస్‌ను పునఃప్రారంభించనుండడంతో ఉత్పత్తి పెరుగుతుందని, ఇది శుభపరిణామమని కార్మికులు, ఉద్యోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

టైరు పంక్చరై ఇంటిలోకి దూసుకెళ్లిన కారు

» ఇద్దరు మృతి.. ఒకరికి తీవ్రగాయాలు



ఇంటిని ఢీకొట్టిన కారు, మృతులు నరహరి, బొజ్జప్ప

హిందూపురం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం పట్టణ పరిధిలోని మోతుకపల్లి వద్ద శనివారం అర్ధరాత్రి దాటాక కారు టైరు పంక్చరై ఇంటిని ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు మరణించగా.. ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. హిందూపురం వన్‌టౌన్ సీఐ రాజగోపాల్‌నాయుడు కథనం మేరకు.. ఆర్మీలో పనిచేస్తున్న ప్రవీణ్‌కుమార్‌ది కాలువపల్లి. స్వగ్రామంలో శనివారం కుమారుడి నామకరణం నిర్వహించారు. ఆదివారం కేశఖండన కార్యక్రమం పెట్టుకున్నారు. సరుకుల కోసమని ప్రవీణ్‌కుమార్.. బంధువులైన బొజ్జప్ప(44), నరహరి(26)తో కలిసి శనివారం రాత్రి హిందూపురం వెళ్లారు. తిరుగు ప్రయాణంలో మోతుకపల్లి వద్దకు వెళ్లేసరికి కారు టైరు పంక్చరై, అదుపుతప్పి రోడ్డుపక్కనున్న చెట్టును, ఆ తర్వాత ఇంటిని ఢీకొంది. నరహరి, బొజ్జప్పను ఆస్పత్రికి తరలిస్తుండగా మరణించారు. ప్రవీణ్‌కుమార్‌ను బెంగళూరు ఆర్మీ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

బైక్ ఢీకొని ఇద్దరు మహిళలు మృతి



శబరి భవాని, వెంకటపద్మకుమారి

ఉంగుటూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రోడ్డు దాటుతున్న ఇద్దరు మహిళలను వేగంగా వస్తున్న బైక్ ఢీకొట్టడంతో తీవ్రగాయాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. ఆత్కూరు ఎస్సై సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు జిల్లా నూజివీడు మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన కంభంపాటి శబరి భవాని (55) పిన్నమనేని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భర్తను చూడటానికి ఆదివారం ఉదయం బయల్దేరారు. బంధువులను పరామర్శించేందుకు మెరుగు వెంకట పద్మకుమారి (55) కూడా వచ్చారు. ఇద్దరూ ఆస్పత్రి ఎదురుగా రోడ్డు దాటుతుండగా, గన్నవరం నుంచి ఏలూరు వైపు బైక్‌పై వేగంగా వెళ్తున్న ఇద్దరు యువకులు అదుపుతప్పి వారిని ఢీకొట్టారు. తీవ్రగాయాలైన మహిళలను స్థానికులు పిన్నమనేని ఆస్పత్రికి తరలించారు. ఇద్దరు ఆదివారం సాయంత్రం మృతి చెందారు. బైక్ నడుపుతున్న దాసరి జాన్ (21), వెనుక కూర్చున్న యువకుడికి గాయాలు కావడంతో అదే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతిచెందిన మహిళల కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కృష్ణానదిలో మునిగి ఇద్దరు మృతి

తాడేపల్లి టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఈతకు వెళ్లి ఇద్దరు యువకులు కృష్ణానదిలో మునిగి మృతిచెందిన ఘటన తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరంలో ఆదివారం జరిగింది. విజయవాడలోని ఆర్‌ఆర్‌పేట అరుణోదయ నగర్‌కు చెందిన గుడివాడ దుర్గాప్రసాద్ అలియాస్ తేజ (23), శివుకు హేమంత్ కుమార్ (17) స్నేహితులతో కలిసి కృష్ణానదిలో స్నానానికి వచ్చారు. సీతానగరం రైలు వంతెన రెండో పిల్లర్ వద్ద నదిలో దిగి గోతుల్లో మునిగిపోయారు. స్నేహితులు వారిని కాపాడేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. సమీపంలో ఉన్న మత్స్యకారుడు దుర్గారావు వారిని బయటకు తీసుకువచ్చేసరికి మృతిచెందారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసినట్టు సీఐ కళ్యాణ్‌రాజు తెలిపారు.

దూసుకెళ్లిన లారీ.. 40 గొర్రెలు మృతి



మృతి చెందిన గొర్రెలు

ఉరవకొండ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా ఉరవకొండ పట్టణ శివారులోని అనంతపురం-బళ్లారి రహదారిపై ఆదివారం తెల్లవారుజామున గొర్రెల మందపై లారీ దూసుకెళ్లడంతో 40 జీవాలు మృతి చెందాయి. కర్ణాటకలోని హగరి పరిధి షగిడి మాల గ్రామానికి చెందిన ఆరుగురు కాపరులు తమ గొర్రెలను మేపునకు జిల్లాలోకి తోలుకొచ్చారు. తిరిగి వెళ్తుండగా ఉరవకొండ వద్ద అనంతపురం నుంచి హోస్పేట్‌కి వెళ్తున్న లారీ.. గొర్రెల మందపై దూసుకెళ్లింది. రూ.5లక్షలు వరకూ నష్టం వాటిల్లిందని బాధితులు వాపోయారు. పోలీసులు లారీని స్టేషన్‌కు తరలించారు.

సూర్యలంక తీరంలో ఒకరు మృతి

బాపట్లరూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): బాపట్ల మండలం సూర్యలంక సముద్రతీరంలో ఆదివారం ఇద్దరు యువకులు గల్లంతవగా ఒకరు ప్రాణాలతో బయటపడ్డారు. మరొకరి మృతదేహం లభించింది. గుంటూరుకు చెందిన 9 మంది యువకులు సూర్యలంక తీరానికి స్నానాలకు వచ్చారు. వీరిలో హుస్సేన్, కళ్యాణ్ అలల తాకిడికి కొట్టుకుపోతుండగా గమనించిన గజ ఈతగాళ్లు, మెరైన్ పోలీసులు హుస్సేన్‌ను కాపాడి ఒడ్డుకు చేర్చారు. కళ్యాణ్ (20) మృతదేహం సాయంత్రం ఒడ్డుకు కొట్టుకు వచ్చింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. బాపట్ల రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పీఎంకిసాన్ కటాఫ్ డేట్‌తో కట్!

» లక్షలాది మంది రైతులకు అందని ఆర్థిక సాయం
» అడ్డంకిగా కేంద్ర ప్రభుత్వ పాత మార్గదర్శకాలు
» అనర్హులుగా 1.2.2019 తర్వాత భూమి సంక్రమించినవారు
» ప్రభుత్వం నిబంధనలు సవరించాలని అన్నదాతల విజ్ఞప్తి

అమరావతి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం(పీఎం కిసాన్)లో కటాఫ్ డేట్ కారణంగా లక్షలాది మంది రైతులకు కేంద్ర ప్రభుత్వ సాయం అందడం లేదు! దేశవ్యాప్తంగా ఐదెకరాలలోపు సాగుభూమి ఉన్న రైతులకు కేంద్రం పీఎం కిసాన్ స్కీమ్‌ను ప్రవేశపెట్టింది. ఈ పథకం కింద ఏటా రూ.6 వేల నగదును మూడు విడతలుగా రైతుల ఖాతాల్లో జమ చేస్తోంది. 2018 డిసెంబరు నుంచి 2019 ఫిబ్రవరి 1 మధ్య భూమి ఎవరి పేరుతో ఉంటే వారే పీఎంకిసాన్‌కు అర్హులని కేంద్రం మార్గదర్శకాల్లో పేర్కొంది. భూయజమాని మరణిస్తే.. వారసులకు భూమి సంక్రమించడం సహజం. లేదా ఇతర రైతులు భూమి కొనుగోలు చేయడం జరుగుతుంటుంది. యాజమాన్య బదిలీతో భూమి ఉన్న రైతులకు ఈ పథకం వర్తింపజేయాల్సి ఉంది. కానీ 1.2.2019 తర్వాత సేల్ డీడ్, పార్టీషియన్ డీడ్, గిఫ్ట్ డీడ్ ద్వారా భూమి సంక్రమించిన రైతులు అర్హులు కాదంటూ 2020 మార్చి 29న కేంద్రం సవరణ మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ ఉత్తర్వులు 2019 నుంచి ఐదేళ్లపాటు కొనసాగుతాయని తెలిపింది. దీంతో 2019 ఫిబ్రవరి 1 తర్వాత భూమి బదిలీ కాబడిన రైతులు పీఎం కిసాన్‌కు అనర్హులవుతున్నారు. కటాఫ్ తేదీ ముగిసిన తర్వాత కేంద్రం పీఎంకిసాన్ పథకాన్ని అందరికీ వర్తించే విధంగా నిబంధనలు సవరించాల్సి ఉన్నా.. ఈ దిశగా కేంద్ర, రాష్ట్ర వ్యవసాయ శాఖ అధికారులు దృష్టి సారించలేదు. దీంతో పీఎంకిసాన్ నిధులు అర్హులైన సన్న, చిన్నకారు రైతులకు అందకుండా పోతున్నాయి. ఈ విషయాన్ని గత వైసీపీ ప్రభుత్వం కేంద్రం దృష్టికి తీసుకెళ్లలేదన్న విమర్శలున్నాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వ పెద్దలు, ఎంపీలు దీనిపై కేంద్రంతో చర్చించాలని రైతులు కోరుతున్నారు.

కటాఫ్ డేట్ తర్వాత చేసుకున్న దరఖాస్తులు కూడా..

కటాఫ్ డేట్ తర్వాత భూ బదిలీ జరిగిన సన్న, చిన్నకారు రైతులు చేసుకున్న దరఖాస్తులను కూడా అధికారులు తిరస్కరిస్తున్నారు. నేరుగా మీసేవా కేంద్రాల్లో పీఎం కిసాన్ పోర్టల్‌లో నమోదు చేసుకున్నా అనర్హులుగా చూపుతున్నారు. ఈ విధంగా ఒక్కో రెవెన్యూ డివిజన్‌లో 4 వేల మంది దరఖాస్తు చేసుకుంటే.. సగం మందికి పీఎంకిసాన్ వర్తించలేదని చెప్తున్నారు. ఈ విధంగా దేశంలో, రాష్ట్రంలో లక్షలాది మంది రైతులు అనర్హులుగా మిగిలారని సమాచారం. రాష్ట్రంలో 41.84 లక్షల రైతులు పీఎం కిసాన్‌కు అర్హులుగా అధికారులు చెప్తున్నా.. ఈనెల 5న ప్రధాని మోదీ విడుదల చేసిన పీఎం కిసాన్ నిధులు 41.22 లక్షల ఖాతాలకే జమ అయినట్లు కేంద్రపోర్టల్‌లో ఉంది.

ఉపాధి పనుల నాణ్యతలో రాజీ వద్దు

» ప్రతి దశలో తనిఖీలు చేపట్టండి
» అధికారులకు డిప్యూటీ సీఎం పవన్ ఆదేశం



అమరావతి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లో రాజీ పడకూడదని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణతేజ, ఉపాధి హామీ పథకం, ఇంజనీరింగ్ అధికారులతో ఆదివారం ఆయన సమీక్ష నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన ఉపాధి హామీ, 15వ ఆర్థిక సంఘం నుంచి నిధులను సక్రమంగా, పారదర్శకంగా సద్వినియోగం చేయాలని స్పష్టం చేశారు. శనివారం రాష్ట్రవ్యాప్తంగా 13,326 పంచాయతీల్లో అభివృద్ధి పనుల నాణ్యతను అధికారులు తనిఖీ చేశారు. 2024-25 సంవత్సరంలో 3 వేల కిలోమీటర్ల సిమెంట్ రోడ్లు, 500 కిలోమీటర్ల బీటీ రోడ్లు, 22,525 గోకులాలు, 25 వేల ఫారంపాండ్లు, 30 వేల ఎకరాలకు సంబంధించి నీటి సంరక్షణ కందకాలు చేపట్టామని, వాటి పనులు పల్లె పండుగ కార్యక్రమం నుంచి మొదలుపెట్టామని అధికారులు డిప్యూటీ సీఎంకు తెలిపారు. పనులన్నీ నిర్దేశించిన విధంగా సాగుతున్నాయని వివరించారు. పవన్ కల్యాణ్ స్పందిస్తూ.. ఉపాధి హామీ, ఆర్థిక సంఘం నిధుల ద్వారా చేపట్టే పనులను నిర్దేశిత ప్రమాణాల ప్రకారం చేయాలన్నారు. ప్రతి దశలోనూ నాణ్యతా ప్రమాణాలు తనిఖీ చేయాలన్నారు. పనులు ఏ దశలో ఉన్నాయో ప్రజలకు తెలియజేస్తే పారదర్శకత వస్తుందన్నారు. గత ప్రభుత్వ పాలనలో మాదిరి పంచాయతీలకు దక్కాల్సిన నిధులు పక్కదారి పట్టడం లేదని ప్రజలకు తెలుస్తుందన్నారు. సిటిజన్ ఇన్ఫర్మేషన్ బోర్డుల ద్వారా ఏ పంచాయతీకి ఎంత నిధులందాయో, వాటి ద్వారా చేస్తున్న పనులు ఏమిటో కూడా ప్రజలకు వివరించే ప్రక్రియను ప్రభావవంతంగా చేపట్టాలని అధికారులకు పవన్ సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి గ్రామసభల నిర్వహణ, పల్లె పండుగ ద్వారా చేపట్టిన పనుల ప్రారంభం జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించాయని, పనులను సైతం నాణ్యంగా పూర్తి చేయడం ద్వారా అందరికీ ఆదర్శంగా నిలవాలని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

రాష్ట్రంలో డబులింజన్ అభివృద్ధి

» పోలవరం, అమరావతి, రైల్వే, రోడ్లకు నిధుల వరద
» ప్రగతి వైపు దూసుకెళ్తున్న దేశం, రాష్ట్రం: పురందేశ్వరి

అమరావతి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే డబులింజన్ సర్కారు అవసరమని ఎన్నికల్లో ప్రజలకు వివరించాం. భారీ మెజారిటీతో ఎన్డీఏ ప్రభుత్వాలకు అవకాశమిచ్చిన ప్రజల నిర్ణయంతో రాష్ట్రానికి కేంద్రం నుంచి నిధుల వరద వస్తోంది. పోలవరానికి, రాజధాని అమరావతికి, రైల్వే ప్రాజెక్టులు, జాతీయ రహదారులకు వేల కోట్లు వస్తున్నాయి' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి వ్యాఖ్యానించారు. ప్రకాశం జిల్లా పర్చూరు నియోజకవర్గానికి చెందిన వైసీపీ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు ఆదివారం బీజేపీలో చేరారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో పురందేశ్వరి మాట్లాడుతూ ఎన్డీఏ పాలనలో దేశం, రాష్ట్రం ప్రగతి వైపు దూసుకెళ్తున్నాయని చెప్పారు. కేంద్రం ఇస్తోన్న 4,800 కోట్లు గ్రామాల అభివృద్ధికి ఖర్చు చేయబోతున్నట్లు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చెప్పడం డబులింజన్ సర్కారు వల్ల రాష్ట్రానికి జరుగుతున్న మేలుకు నిదర్శనమన్నారు. రాష్ట్రంలో 20లక్షల మంది బీజేపీ సభ్యత్వం తీసుకున్నారని చెప్పారు.

వణికిస్తున్న లంపీ వైరస్

» పట్టించుకోని పశుసంవర్ధక శాఖ.. ఆందోళనలో పోషకులు

కురిచేడు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లాలో లంపీ వైరస్ కలకలం సృష్టిస్తోంది. దీని బారినపడి కురిచేడు మండలంలో గోవులు మృత్యువాత పడుతున్నాయి. దీంతో పశుపోషకులు వణికిపోతున్నారు. నివారణకు చర్యలు తీసుకోవాల్సిన పశుసంవర్ధక శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారు. కురిచేడు మండలంలో గోవుల సంఖ్య అధికంగానే ఉంది. అయితే కొద్దిరోజులుగా గోవులకు లంపీ వైరస్ సోకుతోంది. దీనిబారిన పడిన ఆవుల శరీరంపై బొబ్బలతోపాటు జ్వరం రావడం, మేత మేయకపోవడం వంటి లక్షణాలతో బాధపడుతున్నాయి. వెంటనే మందులు వినియోగించకపోతే బొబ్బలు పెద్దవై శరీరం మొత్తం వ్యాపిస్తున్నాయి. అవి పగిలి రసిక కారుతూ మిగిలిన ఆవులకూ వైరస్ సోకుతోంది. దీంతోపాటు కొన్ని ఆవులకు శరీరం మొత్తం పగిలినట్లు అవుతోంది. గతంలో పశువైద్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి ఆవులు, ఎద్దులకు లంపీ వైరస్ వ్యాక్సిన్ వేసేవారు. ఈసారి దానిమీద దృష్టి పెట్టలేదు. దీంతో ఆవులకు వైరస్ ఉధృతంగా వ్యాపించింది. వాటిని పశువైద్యశాలకు తీసుకెళ్లినా ఫలితం ఉండటం లేదని పోషకులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

సోదరిపై అన్న లైంగిక దాడి

» బాలికకు అబార్షన్ చేయించిన తల్లిదండ్రులు
» ప్రకాశంలో ఘటన.. ఆలస్యంగా వెలుగులోకి

తాళ్లూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సోదరి ప్రేమాయణాన్ని అవకాశంగా తీసుకున్న సోదరుడు ఆమెను బెదిరించి లైంగిక వాంఛ తీర్చుకుని గర్భవతిని చేశాడు. ఈ దారుణ ఘటన ప్రకాశం జిల్లాలో ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసుల కథనం మేరకు.. తాళ్లూరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక అక్కడే జడ్పీ హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతోంది. తోటి విద్యార్థులతో రోజూ చాటింగ్ చేస్తూ ఉండేది. ఆ చనువుతో విద్యార్థుల్లో ఒకరికి దగ్గరయ్యింది. విషయం తెలుసుకున్న అదే స్కూల్లో 9వ తరగతి చదువుతున్న సోదరుడు ఈ విషయం తల్లిదండ్రులకు చెబుతానంటూ బెదిరించి ఆమెపై లైంగిక దాడి చేశాడు. ఇటీవల బాలికకు విపరీతమైన కడుపు నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు దర్శి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షల అనంతరం ఆ బాలిక గర్భవతి అని వెల్లడైంది. దీంతో తల్లిదండ్రులు గట్టిగా ప్రశ్నించగా జరిగిన విషయాన్ని వివరించగా, అబార్షన్ చేయించారు. మెరుగైన చికిత్స కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్సై ఎస్.మల్లికార్జునరావు కేసు నమోదు చేశారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం

నంబులపూలకుంట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా నంబులపూలకుంట మండలం నల్లగుట్టపల్లి తండా గ్రామ సమీపాన బీడు భూమిలో డంప్ చేసిన ఎర్రచందనం దుంగలను పోలీసులు ఆదివారం స్వాధీ నం చేసుకున్నారు. నంబులపూలకుంట ఎస్ఐ వలీబాషా తెలిపిన వివరాల మేరకు.. నల్లగుట్టపల్లి గ్రామం వద్ద హంద్రీనీవా కాల్వ సమీపంలో చాలా రోజులుగా దాచిన ఎర్రచందనం దుంగలను బయటకు తీసి, ఓ పొలం వద్ద ఉంచినట్టు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే ఎస్ఐ అక్కడికి చేరుకుని, దుంగలను స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 21 దుంగలు 275 కిలోల బరువు ఉన్నట్టు తెలిపారు. వీటి విలువ రూ.5.50 లక్షలు ఉంటుందని లెక్కగట్టారు. దుంగలను పోలీసు స్టేషన్‌కు తరలించారు. అటవీ శాఖాధికారులకు అప్పగించనున్నట్టు ఎస్ఐ తెలిపారు.

సవర చిత్రకళపై మన్యం కలెక్టర్ మక్కువ



సవర చిత్రాలను గీస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ సవర చిత్ర కళపై ప్రత్యేక దృష్టి సారించారు. ఆయన ఈ ఏడాది జూలై 7న జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. అప్పటి నుంచి వారసత్వ, సంస్కృతి సంపద ద్వారా జిల్లాను ప్రత్యేకంగా నిలబెట్టేందుకు అనేక చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగానే స్వచ్ఛ పార్వతీపురం కాన్సెప్ట్‌ను అమలు చేస్తున్నారు. జిల్లాను సుందరంగా మార్చేందుకు అడుగులు వేస్తున్నారు. జిల్లా కేంద్రంతో పాటు పట్టణంలోని అనేక ప్రాంతాలను చెత్త రహితంగా తీర్చిదిద్దుతున్నారు. ఆ ప్రాంతాల్లో సవర పెయింటింగ్ ఉండేలా చర్యలు చేపడుతున్నారు. ఈ మేరకు కళలు, క్రాఫ్ట్ ఉపాధ్యాయులతో అవగాహన సదస్సు నిర్వహించారు. మరోవైపు విధి నిర్వహణలో ప్రజలకు అందుబాటులో ఉంటూ, ఖాళీ దొరికిన సమయంలో బోర్డుపై సవర చిత్రాలు వేస్తూ కలెక్టర్ కనిపిస్తున్నారు. జిల్లా కలెక్టర్‌గా ఉన్నప్పటికీ సవర కళ ప్రాముఖ్యతను వివరిస్తూ, ఈ ప్రాంతంలో ఆ కళ శాశ్వతంగా ఉండాలనే లక్ష్యంగా ఆయన పనిచేస్తున్నారు.

నర్సుల సంఘం అధ్యక్షురాలిగా రాధమ్మ

» ఆరేళ్ల తర్వాత ప్రభుత్వ నర్సుల సంఘం ఎన్నికలు

విజయవాడ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ నర్సుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలిగా చిత్తూరు జిల్లాకు చెందిన ఎస్.రాధమ్మ, ప్రధాన కార్యదర్శిగా పల్నాడు జిల్లాకు చెందిన ఎస్.కోటమ్మ ఎన్నికయ్యారని ఏపీఎన్జీజీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేవీ శివారెడ్డి తెలిపారు. ఆరేళ్ల ఎదురుచూపులకు చెక్ పెడుతూ ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వ నర్సుల సంఘం ఎన్నికలు జరుపుకొన్నామని, ఈ ఎన్నికల్లో తమ సంఘం బలపరిచిన ప్యానెల్ అభ్యర్థులు విజయం సాధించారని చెప్పారు. స్థానిక ఏపీఎన్జీజీవో భవన్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో శివారెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులంతా ఐక్యంగా ఉంటేనే హక్కులు సాధించుకోగలరన్నారు. నర్సుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఉపాధ్యక్షులుగా కొత్తపల్లి మంజేష్ (ప్రకాశం), గోవిందు శాంతి భవాని (కర్నూలు), పుప్పాల లలిత (అనంతపురం), వీపీ చంద్రసాయి (విజయనగరం), సంయుక్త కార్యదర్శిగా ఎం.దయావతమ్మ (పశ్చిమగోదావరి), కార్యనిర్వహణ కార్యదర్శిగా పి.జాన్సన్ రాణి (విజయవాడ), కోశాధికారిగా టి.గంగాభవాని (విశాఖ)తో పాటు ఉమ్మడి జిల్లాల పరిధిలో ఎగ్జిక్యూటివ్ సభ్యులు కూడా ఓటింగ్ ద్వారానే ఎన్నికయ్యారని చెప్పారు.





కమ్మని కాఫీ తాగేద్దామా!



కాఫీని ఇష్టపడనివారుండరు. ఇది అందరికీ అందుబాటులో ఉండే ఎనర్జీ డ్రింక్. కాఫీ తాగినపుడు అందులో ఉండే కెఫిన్ వల్ల నాడీ వ్యవస్థ ప్రభావితమై మెదడు పనితీరు వేగవంతమవుతుంది. మనసు ఉత్తేజంగా అనిపిస్తుంది. విద్యార్థుల్లో జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, చురుకుదనం పెరుగుతాయి. ఇలా కాఫీ అందించే మరిన్ని ఆరోగ్య ప్రయోజనాల గురించి తెలుసుకుందాం!

- కాఫీలో మెగ్నీషియం, పొటాషియం, మాంగనీస్, పాస్ఫరస్, సోడియం, జింక్ వంటి ఖనిజ లవణాలు, తక్కువ పరిమాణంలో క్యాలరీలు, కార్బోహైడ్రేట్లు, బి, కె విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. వీటివల్ల తక్షణ శక్తి లభిస్తుంది. మానసిక ఒత్తిడి తగ్గుతుంది.
- రోజుకు రెండు కప్పుల కాఫీ తాగడం వల్ల డోపమైన్ హార్మోన్ నియంత్రణలో ఉండి కుంగుబాటు సమస్యను నిరోధిస్తుంది. కరోనరీ గుండె జబ్బులు, కార్డియోవాస్కులర్ రుగ్మతలు, టైప్-2 డయాబెటిస్ సమస్యలు తగ్గుతాయి. కాఫీలో ఉండే క్లోరోజెనిక్ ఆమ్లాలు ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించి కళ్లను రెటినాల్ డిజనరేషన్ సమస్యల నుంచి కాపాడతాయి.
- మెదడు, వెన్నెముకల్లోని నరాల రక్షణ కవచాన్ని దెబ్బతీసే ప్రొ ఇన్‌ఫ్లమేటరీ సైటోకైన్స్ అణువుల ఉత్పత్తిని కెఫిన్ అడ్డుకుంటుందనీ అందుకే ప్రతి రోజూ కాఫీ తాగేవారిలో మల్టిపుల్ స్క్లెరోసిస్ సమస్యలు రావని నిపుణులు చెబుతున్నారు.
- తరచూ కాఫీ తాగడం వల్ల కాలేయంలో ఇన్‌ఫెక్షన్లు తగ్గుతాయి. కాలేయంలో అత్యధిక ఎంజైమ్‌ల ఉత్పత్తి, కాలేయ క్యాన్సర్, ఫైబ్రోసిస్ వంటి సమస్యల నివారణకు కెఫిన్ తోడ్పడుతుంది.
- మహిళలు రోజూ కాఫీ తాగితే మెనోపాజ్ తరవాత రొమ్ము క్యాన్సర్ రాకుండా ఉంటుంది. కాఫీలోని బయో యాక్టివ్ సమ్మేళనాలు పెద్దపేగు క్యాన్సర్, ప్రొస్టేట్ క్యాన్సర్. ఓరల్ క్యాన్సర్లను నిరోధిస్తాయి.
- కాఫీ పొడిని స్వచ్ఛమైన పాలతో కలిపి తాగాలి. బ్లాక్ కాఫీ కూడా ఆరోగ్యానికి మంచిదే. చక్కెరలేని కాఫీ తాగడం వల్ల బరువు నియంత్రణలో ఉంటుంది. వ్యాయామం తరవాత వచ్చే అలసట తగ్గుతుంది. ఆస్తమా, మూత్రపిండాల్లో రాళ్లు, దంతక్షయ సమస్యలు, తలనొప్పి, మలబద్ధకం, అల్జీమర్స్ రాకుండా చేస్తుంది. భోజనం తరవాత, ఖాళీ కడుపుతో, రాత్రి పడుకొనే ముందు కాఫీ తాగకూడదు. దీనివల్ల ఎసిడిటీ సమస్యలు వస్తాయి.

ఇంటి గార్డెన్ కోసం ఇలా...



ఇంటి చుట్టూ మొక్కలు పెంచుకోవాలనే కోరిక అందరికీ ఉంటుంది. కానీ కొంతమంది మాత్రమే ఆ కలను సాకారం చేసుకుంటారు. నిజానికి ఇంటిని పచ్చని పొదరిల్లుగా మార్చుకోవాలంటే కొద్దిగా ఆసక్తి, కొంచెం ప్రణాళిక ఉంటే సరిపోతుంది. గార్డెనింగ్ ఏర్పాటు విషయంలో నిపుణులు సూచిస్తున్న సలహాలు ఇవి..

- ముందుగా స్థలం ఎంపిక చేసుకోవాలి. ఐదారు గంటల పాటు సూర్యరశ్మి నేరుగా పడే స్థలానికి ప్రాధాన్యం ఇవ్వాలి. ఇండోర్‌లో అయితే గాలి బలంగా వీచే ప్రదేశాలను వీలైనంత వరకు ఎంచుకోకూడదు. స్థలం ఎంపిక చేసుకున్న తరువాత మొక్కల ఎంపిక చేపట్టాలి. పూల మొక్కలు కావాలా? హెర్బ్స్ పెంచుకుంటారా? కూరగాయల మొక్కలకు ప్రాధాన్యం ఇస్తారా? అన్నది ముందుగా నిర్ణయించుకోవాలి. తరువాత పనిముట్లను సమకూర్చుకోవాలి.
- నల్లరేగడి మట్టి మొక్కల పెంపకానికి అనువైనది. ఎర్రనేలలు తేమను నిలుపుకోవు. కాబట్టి ఈ నేల రకాలు అంత అనువైనవి కావు. అయితే ఈ నేలలో సారవంతమైన మట్టిని తెచ్చిపోయడం ద్వారా మొక్కలకు అనువైనదిగా మార్చుకోవచ్చు. వర్మీ కంపోస్ట్, ఎరువులు కలుపుకోవడం ద్వారా నేలలో మొక్కలకు కావలసినంత పోషకాలు లభించేలా చేయవచ్చు.
- మొక్కలు ఎంపిక చేసుకునే ముందు మొక్కలు పెరిగే ఎత్తును దృష్టిలో ఉంచుకోవాలి. వాతావరణ పరిస్థితులనుకూడా దృష్టిలో పెట్టుకోవాలి. పూలమొక్కలు, పొదల్లా పెరిగే మొక్కలు, తీగలతో అల్లుకుపోయే మొక్కల్లో మీ స్థలం, అభిరుచిని బట్టి ఎంచుకోవాలి. పూల మొక్కలు గార్డెన్‌ను ఆకర్షణీయంగా మారుస్తాయి. పూల మొక్కలు పెంచుకోవడానికి కుండీలు ఎంపిక చేసుకోవాలి. టొమాటో, పాలకూర, ముల్లంగి, అల్లం, వెల్లుల్లి, కొత్తిమీర వంటి ఆకుకూరలు, దుంపలను వెడల్పాటి టబ్బుల్లో పెంచుకోవచ్చు. స్థలం ఎక్కువగా ఉంటే బీర, కాకర, చిక్కుడు వంటి తీగలు పారే మొక్కలను పెంచుకోవచ్చు.
- మొక్కలు నాటిన మొదటి వారంలో రోజూ నీరు పట్టాలి. రెండవ వారం నుంచి రెండు రోజులకొకసారి నీరు పడితే సరిపోతుంది. మొక్కలు బాగా పెరిగాక వారానికొకసారి నీరు పట్టొచ్చు. అయితే ఇది అన్ని మొక్కలకు వర్తించదు. కొన్ని రకాల పూల మొక్కలకు ప్రతి రోజూ నీరు పట్టాల్సి ఉంటుంది.
- కుండీలో మొక్కను నాటే ముందు దాని అడుగు భాగాన చిన్న రంధ్రం ఉండేలా చూసుకోవాలి. రంధ్రం లేకపోతే చేయాలి. కుండీలో నీరు నిల్వ ఉండడం వల్ల మొక్క చనిపోయే ప్రమాదముంటుంది. కుండీలో మట్టిని అదమకుండా బోలుగా ఉండేలా చూసుకోవాలి. మొక్కను నాటేటప్పుడు వేర్లు పూర్తిగా మట్టిలో కూరుకునేలా పెట్టాలి.

సుస్వర నిధి

రాగయుక్తంగా పాడితే... గొంతు మగాడిలా ఉందన్నారు. అందుకు ఆమె చిన్నబుచ్చుకోలేదు. ఆ విమర్శను ఒక ప్రశంసగా తీసుకుని... ఆ గొంతునే తన ప్రత్యేకతగా మలుచుకుంది. ఆపై... 'ధూమ్ మచాలే' లాంటి దుమ్ము లేపే బీట్లైనా... 'డ్యాన్స్ పే చాన్స్' అంటూ హుషారెత్తించినా... 'షీలా కీ జవానీ'తో 'ఫిలిమ్‌ఫేర్ అవార్డు' పట్టినా... ఆమెకే చెల్లింది. గమకాల గమ్మత్తుల 'నిధి'... ఎంతటి క్లిష్టమైన బాణీ అయినా అలవోకగా ఆలపించగల గాయని... సునిధి చౌహాన్ జర్నీ ఇది.

పాట ఏదైనా సునిధి చౌహాన్ గొంతులో పడితే... సుస్వరాల సంగమంలా వీనుల విందు చేస్తుంది. నాలుగేళ్లకే వేదికలెక్కి తన గాత్రాన్ని వినిపించిన ఆమె... ఆ తరువాత ఎన్నో మరపురాని గీతాలకు గొంతుగా మారింది. ప్రసిద్ధ గాయని, దివంగత లతామంగేష్కర్ మాటల్లో చెప్పాలంటే... 'సునిధి ఏ పాటనైనా అలవోకగా పాడగలదు. తన గాత్రం, శైలిలో సంగీతాభిమానులను మెప్పించగల హంగులన్నీ ఉన్నాయి. నేటి తర అత్యుత్తమ గాయని సునిధి'. ప్రముఖ సంగీత దర్శకుడు అనూ మాలిక్‌దీ అదే మాట. దాదాపు మూడు దశాబ్దాల ఆమె కెరీర్‌లో జనరంజకమైన మధుర గీతాలు ఎన్నో. ఢిల్లీలో పుట్టి పెరిగిన సునిధి... అసలు పేరు నిధి. అక్కడి 'గ్రీన్‌వే మోడ్రన్ స్కూల్'లో చదివింది. ఆమె తండ్రి దుష్యంత్ కుమార్ చౌహాన్‌ది ఉత్తరప్రదేశ్. రంగస్థల కళాకారుడు. తల్లి గృహిణి. ఆమె ప్రోద్బలం, ప్రోత్సాహంతోనే సునిధి సంగీత సాధన మొదలుపెట్టింది. నాలుగేళ్ల వయసులో స్థానిక పాటల పోటీల్లో పాల్గొంది.

▸▸ చదువు ఆపేసి...

తండ్రి స్నేహితుల సలహాతో కాలక్షేపంగా కాకుండా సంగీతానికి ప్రత్యేకంగా సమయం కేటాయించింది సునిధి. ఎంతగా అంటే... దాని కోసం పాఠశాల విద్య పూర్తవగానే చదువుకు స్వస్తి చెప్పింది. ఒక పక్క లైవ్ షోలు చేస్తూనే... మరోవైపు తన గాత్రానికి మెరుగులు అద్దుకుంది. లతామంగేష్కర్‌కు వీరాభిమాని. ఆమె పాటలే సునిధికి ప్రేరణ. ఖాళీ సమయాల్లో ఇంట్లో ప్రముఖ గాయకుల పాటల కేసెట్లు, సీడీలు పెట్టుకొని వినడం, వాటిని సాధన చేయడం ఆమెకు బాల్యంలో అతి పెద్ద వ్యాపకం. అదే ఇప్పుడు ఆమెను విభిన్న గాయనిగా నిలబెట్టింది. ఓ వేదికపై సునిధి పాట విని ముగ్ధురాలైన నటి తబుస్సుమ్... తన షో 'తబుస్సుమ్ హిట్ పరేడ్'లో అవకాశం కల్పించారు. తనకు మంచి భవిష్యత్తు ఉందని, ముంబయిలో ఉంటే మరిన్ని అవకాశాలు వస్తాయని సునిధి తల్లితండ్రులకు తబుస్సుమ్ సూచించారు. దాంతో ఆమె కుటుంబం ముంబయికి వచ్చి స్థిరపడింది. అప్పుడు సునిధి వయసు పదొకండేళ్లు.



▸▸ తొలి అవకాశం అలా...

సునిధికి తన షోలో అవకాశం ఇవ్వడంతోనే తబుస్సుమ్ ఆగిపోలేదు. సంగీత దర్శకులు కల్యాణ్‌జీ, ఆనంద్‌జీలకు ఆమెను పరిచయం చేశారు. సునిధి గాత్రానికి ఫిదా అయిన కల్యాణ్‌జీ... ఆమెకు మంచి భవిష్యత్తు ఉందంటూ అభినందించారు. 'నిధి' పేరును సునిధిగా మార్చింది ఆయనే. ఆ పేరు తనకు అదృష్టాన్ని తీసుకువచ్చిందని అంటుంది సునిధి. ముంబయి వచ్చిన తొలి రోజుల్లో ఆమె కుటుంబం ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంది. ఎప్పుడైతే కల్యాణ్‌జీ అకాడమీలో సభ్యురాలైందో... అప్పటి నుంచి సునిధి కెరీర్ పుంజుకుంది. కల్యాణ్‌జీ బృందం 'లిటిల్ వండర్స్'లో ప్రధాన గాయనిగా కొన్నేళ్లపాటు అనేక ప్రదర్శనలు ఇచ్చింది. అయితే తన కూతురు ఎక్కడ స్టేజీ షోలతోనే ఆగిపోతుందోననే ఆందోళన ఆమె తండ్రిని వేధించింది. కానీ వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడంపైనే సునిధి దృష్టి పెట్టింది. అదే ఆమెకు కలిసివచ్చింది. 1995 ఫిలిమ్‌ఫేర్ అవార్డ్స్ వేడుకలో 'లిటిల్ వండర్స్' ట్రూపు తరుపున గీతాలు ఆలపించింది. అది అక్కడే ఉన్న సంగీత దర్శకుడు ఆదేశ్ శ్రీవాస్తవకు ఎంతో నచ్చింది. వెంటనే పిలిచి తన చిత్రం 'శాస్త్రా'లో పాడించారు. పదకొండేళ్ల వయసులో 'లడకీ దివానీ దేఖో' అంటూ ఉదిత్ నారాయణ్‌తో కలిసి ఆ చిత్రంలో ఆలపించిన గీతంతో సునిధి పాటల ప్రయాణం ప్రారంభమైంది.

▸▸ దశ తిరిగింది...

అదే సంవత్సరం డీడీ నేషనల్ చానల్ మొట్టమొదటి సింగింగ్ రియాలిటీ షో 'మేరీ ఆవాజ్ సునో' విజేతగా నిలిచి, లతామంగేష్కర్ ట్రోఫీ గెలుచుకుంది సునిధి. దాంతోపాటు తొలి సోలో ఆల్బమ్ 'అయిరా గెయిరా నాతు కైరా' విడుదలైంది. అయితే అది చిల్డ్రన్స్ ఆల్బమ్‌గా ప్రాచుర్యం పొందడంతో సునిధి ఆలోచనలో పడింది. తన ప్రతిభకు మెరుగులు అద్దుకోవాలన్న ఉద్దేశంతో గౌతమ్ ముఖర్జీ వద్ద శాస్త్రీయ సంగీతం అభ్యసించింది. రెండేళ్లపాటు బ్యాగ్రౌండ్ వోకలిస్ట్‌గా పని చేసింది. ఈ క్రమంలోనే గాయకుడు సోనూ నిగమ్... ఆమెను సంగీత దర్శకుడు సందీప్ చౌతాకు పరిచయం చేశాడు. ఆయన అప్పుడు రామ్‌గోపాల్‌వర్మ 'మస్త్' చిత్రానికి బాణీలు సమకూర్చే పనిలో ఉన్నారు. రెండు వారాల్లో సునిధితో టైటిల్ ట్రాక్‌తో పాటు 'రుకి రుకిసీ జిందగీ', 'సునా థా' పాటలు పాడించారు. 'రుకి రుకిసీ జిందగీ' పాటకు ఆమెకు 'ఆర్డీ బర్మన్ ఫిలిమ్‌ఫేర్ అవార్డు' దక్కింది. ఉత్తమ గాయనిగా నామినేట్ అయింది. దాంతో సునిధి దశ తిరిగిపోయింది. ఆ ఏడాది చివరలో ఆనంద్‌మిలింద్ 'జాన్వర్', శ్రీవాస్తవ 'దహేక్', 'బడే దిల్‌వాలే'లో అవకాశాలు వచ్చాయి. మరుసటి ఏడాది, అంటే 2000లో అనూమాలిక్ స్వరకల్పనలో విడుదలైన 'ఫిజా'లో 'మెహబూబ్ మేరే' విమర్శకుల ప్రశంసలు అందుకుంది. ఆ నాటి నుంచి నేటి వరకు ఆమె పాటల ప్రవాహం కొనసాగుతూనే ఉంది.

▸▸ వందల గీతాలు...

రెండు ఫిలిమ్‌ఫేర్ అవార్డులు గెలుచుకున్న సునిధి... ఇప్పటివరకు పద్నాలుగు వందలకు పైగా సినీ గీతాలు ఆలపించింది. వాటిల్లో పదుల సంఖ్యలో సూపర్‌హిట్ తెలుగు పాటలు కూడా ఉన్నాయి. ఒక్క హిందీలోనే కాకుండా తమిళం, కన్నడ, మళయాళం, అస్సామీ, బెంగాలీ, భోజ్‌పురీ తదితర భాషల్లో తన గాత్ర మాధుర్యంతో అలరించింది. శంకర్ దర్శకత్వంలో రామ్‌చరణ్ నటిస్తున్న భారీ బడ్జెట్ చిత్రం 'గేమ్‌చేంజర్'లో 'జరగండి జరగండి' పాటతో తెలుగు ప్రేక్షకులను మరోసారి పలుకరించింది సునిధి.

▸▸ సవాళ్లను అధిగమించి...

పాటల ప్రపంచంలో అప్రతిహతంగా సాగిపోతున్న సునిధి... వ్యక్తిగత జీవితంలో ఎన్నో ఒడుదొడుకులను ఎదుర్కొంది. సవాళ్లను అధిగమించింది. కెరీర్ ఆరంభంలో కొందరు మగాడి గొంతులా ఉందని తనను విమర్శించినా దాన్ని ఆమె ఒక అభినందనగా తీసుకుంది. 'అందుకు నేను బాధపడలేదు. ఈ గొంతు నాకు భగవంతుడు ఇచ్చిన వరంగా భావించాను. దానికి తగిన పాటలు ఇచ్చి సంగీత దర్శకులు నన్ను ప్రోత్సహించారు' అంటూ ఓ సందర్భంలో చెప్పింది ఈ గాయని. అయితే క్లిష్ట సమయంలో తనపై నమ్మకం ఉంచి, తనకు మద్దతుగా నిలిచిన అనూమాలిక్‌ను ఎప్పటికీ మర్చిపోనంటుంది. "అజ్‌నబీ' చిత్రం కోసం నాతో 'మేరీ జిందగీ మే' పాట పాడించాలని అనూమాలిక్ అనుకున్నారు. అప్పటివరకు ఐటెమ్ సాంగ్స్ పాడిన నాతో రొమాంటిక్ సాంగ్ పాడించడానికి చిత్ర దర్శకులు అబ్బాస్-మస్తాన్ ఒప్పుకోలేదు. కానీ అనూమాలిక్ పట్టు విడవలేదు. 'సునిధి మాత్రమే ఈ పాట పాడుతుంది' అని వారికి తెగేసి చెప్పారు. చివరకు ఆయన మాటే గెలిచింది. ఆ పాట సూపర్‌హిట్ అయింది. వాస్తవానికి ఓ పేరున్న గాయకునితో పాడించాలనుకున్న గీతం అది. ఇక అక్కడి నుంచి నాకు వరుసపెట్టి రొమాంటిక్ సాంగ్స్ కూడా వచ్చాయి" అంటూ ఓ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది సునిధి.

పెళ్లి... విడాకులు... పెళ్లి...

పద్దెనిమిదేళ్లకే బాబీ ఖాన్‌ను ప్రేమించి పెళ్లి చేసుకున్న సునిధి... ఏడాది తరువాత అతడి నుంచి విడిపోయింది. అది తన జీవితంలో చేసిన అతిపెద్ద తప్పుగా అభివర్ణించింది. 'అయితే ఆ అనుభవం నాలో ఎంతో పరిణతి తీసుకువచ్చింది. అయితే ఇలాంటి విషయాల్లో సమాజం ఎప్పుడూ మహిళలనే తప్పు పడుతుంది. పెళ్లయ్యాక మా ఇద్దరి దారులు వేరని తెలిసింది. ఒకరికి ఒకరం సరిపోమని అర్థమైంది. దాంతో విడిపోవాలనుకున్నాం. అంతకుమించి మా వైవాహిక బంధంలో ఎలాంటి గొడవలు, గందరగోళాలూ లేవు. మేం విడిపోయాక కొందరు నన్ను కించపరిచేలా మాట్లాడారు. కాలం మారుతోంది. కానీ దాంతో పోటీపడలేక ఆగిపోయినవారే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తారు. వాటికి నేను విలువ ఇవ్వను' అంటూ నాటి రోజులు గుర్తు చేసుకున్న సునిధి... 2012లో సంగీత దర్శకుడు హితేష్ సోనిక్‌తో కలిసి ఏడడుగులు వేసింది. వారికి ఒక కుమారుడు.

నవ్య | చిత్రజ్యోతి

డబ్బింగ్ పనుల్లో...



హీరో వెంకటేశ్, దర్శకుడు అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఓ సినిమాలో నటిస్తున్న సంగతి తెలిసిందే. వీరిద్దరి కలయికలో రూపొందుతున్న ఈ మూడో చిత్రానికి వర్కింగ్ టైటిల్ 'వెంకీ అనిల్ 03'. దిల్‌రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. ఐశ్వర్య రాజేశ్, మీనాక్షీ చౌదరి హీరోయిన్లు. ఈ చిత్ర షూటింగ్ దాదాపు 90% పూర్తైంది. ప్రస్తుతం డబ్బింగ్ పనులను ఆరంభించారు. ఈ మేరకు ఓ వీడియోను కూడా విడుదల చేశారు. ఈ సినిమాను వచ్చే ఏడాది సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఈ ట్రయాంగ్యులర్ క్రైమ్ డ్రామాలో రాజేంద్రప్రసాద్, సాయికుమార్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఎడిటర్: తమ్మిరాజు, డీఓపీ: సమీర్‌రెడ్డి, సంగీతం: భీమ్స్ సిసిరోలియో.

రవిశంకర్ బయోపిక్‌లో...



ఆధ్యాత్మిక వేత్త, ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు శ్రీశ్రీ రవిశంకర్ బయోపిక్ తెరకెక్కనుందని బాలీవుడ్ వర్గాల సమాచారం. ఈ చిత్రంలో రవిశంకర్ పాత్రను విక్రాంత్ మాసే పోషించనున్నారని టాక్. గతేడాది సిద్ధార్థ్ ఆనంద్, మహావీర్ జైన్ ఈ చిత్రాన్ని ప్రకటించారు. హిందీతో పాటు ఇంగ్లీష్, స్పానిష్ భాషల్లో ఈ చిత్రం తెరకెక్కనుందని సమాచారం. కొన్ని రోజుల క్రితం విక్రాంత్‌మాసే రవిశంకర్‌ను కలసి ఆశీస్సులు అందుకున్నారు. ఈ నేపథ్యంలో త్వరలోనే ఈ చిత్రంపై అధికారిక ప్రకటన రావొచ్చని భావిస్తున్నారు.

త్వరలోనే టీజర్



దర్శకుడు శంకర్ దర్శకత్వంలో రామ్‌చరణ్ నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'గేమ్ చేంజర్'. ఈ పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్‌లో కియారా అడ్వాణీ కథానాయిక. దిల్‌రాజు, శిరీష్ నిర్మించిన ఈ చిత్రం సంక్రాంతి కానుకగా..వచ్చే ఏడాది జనవరి 10న విడుదల కానుంది. ఈ చిత్రం విడుదలకు సరిగ్గా 75 రోజుల సమయమే ఉందంటూ చిత్రబృందం విడుదల చేసిన ఓ పోస్టర్ అభిమానుల్లో ఆనందాన్ని నింపింది. త్వరలోనే టీజర్ కూడా విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం తెలిపింది. ఇటీవలే విడుదలైన పోస్టర్స్. రెండు పాటలు సినిమాపై అంచనాలను రెట్టింపు చేశాయి. మరోవైపు హీరోలు బాలకృష్ణ, వెంకటేశ్, అజిత్, సందీప్ కిషన్ నటిస్తున్న చిత్రాలు కూడా సంక్రాంతి బరిలో ఉన్నాయి.

కొత్తగా..



సరిహద్దులు లేని సినిమా

అజిత్ దాల్మియా నిర్మాణంలో ప్రమోద్ కుమార్ తెరకెక్కించిన హిందీ చిత్రం 'ఫౌజా'. కార్తీక్ దమ్ము, ఐశ్వర్యా సింగ్, పవన్ మల్హోత్ర ప్రధాన పాత్రల్లో నటించారు. త్వరలో తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో మూవీని ప్రత్యేకంగా ప్రదర్శించారు. చిత్ర కథానాయకుడు కార్తీక్ దమ్ము, హీరో విజయ్ ధరన్ దాట్ల తదితరులు పాల్గొన్నారు. హీరో కార్తీక్ దమ్ము మాట్లాడుతూ 'సినిమాకి భాషా సరిహద్దులు ఉండవు. మరీ ముఖ్యంగా ఇలాంటి చిత్రానికి భాషతో సంబంధం ఉండదు. త్వరలోనే తెలుగు, తమిళ భాషల్లోకి ఈ చిత్రం రానుంది' అని తెలిపారు. దర్శకుడు ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ..' దేశం అంటే ప్రేమ, భక్తి ఉన్న ప్రతీ ఒక్కరికీ 'ఫౌజా' నచ్చుతుంది' అని అన్నారు.

మహిళలను తక్కువ చేస్తున్నారు



చిత్ర పరిశ్రమలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులపై కీలక వ్యాఖ్యలు చేశారు నటి సుహాసిని. సినిమాల్లో హీరోయిన్లను చూపించే తీరు మారిందని ఇటీవల ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో వ్యాఖ్యానించారు. కమర్షియల్ చిత్రాలకు సంబంధించి 2010 నుంచి ఎన్నో మార్పులు వచ్చాయన్నారు. 'భావ ప్రకటన స్వేచ్ఛ పేరుతో సినిమాల్లో మహిళలను తక్కువ చేసి చూపిస్తున్నారు. హీరోలకు స్ట్రాంగ్ రోల్స్ రాస్తున్నారు. హీరోయిన్లకు మాత్రం ప్రాధాన్యం లేని పాత్రలు ఇస్తున్నారు' అని సుహాసిని అన్నారు.

సినీ నిర్మాత రాధాకృష్ణమూర్తి మృతి



సినీ నిర్మాత జాగర్లమూడి రాధాకృష్ణమూర్తి (85) మృతి చెందారు. వయోభారంతో మూడు రోజుల క్రితం అస్వస్థతకు గురైన ఆయన శనివారం రాత్రి స్వగ్రామమైన బాపట్ల జిల్లా కారంచేడులో తుదిశ్వాస విడిచారు. రాధాకృష్ణమూర్తి పలు చలన చిత్రాలను నిర్మించారు. 'ఒక దీపం, వియ్యాలవారి కయ్యాలు, శ్రీ వినాయక విజయం, కోడళ్లు వస్తున్నారు జాగ్రత్త, కోరుకున్న మొగుడు, ప్రతిబింబాలు' లాంటి పలు చిత్రాలకు ఆయన నిర్మాతగా వ్యవహరించారు. రాధాకృష్ణమూర్తి భార్య శాంతమ్మ మూడేళ్ల క్రితం మరణించారు. ఆయనకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. రాధాకృష్ణమూర్తి మృతి పట్ల పలువురు ప్రముఖులు, రాజకీయ నేతలు సంతాపం వ్యక్తం చేశారు. ఆదివారం ఉదయం ఆయన అంత్యక్రియలు కారంచేడులో నిర్వహించారు.

- కారంచేడు (ఆంధ్రజ్యోతి)

ప్రేక్షకుల మనసుల్లో నిలిచిపోయే సినిమా



'క' చిత్రంతో తెలుగు ప్రేక్షకులను పలకరించడానికి సిద్ధమయ్యారు 'గం గం గణేశా', 'అయ్' చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న నయన్ సారిక, మలయాళ నటి తన్వీ రామ్. కిరణ్ అబ్బవరం కథానాయకుడిగా నటించిన ఈ చిత్రాన్ని దర్శక ద్వయం సుజీత్, సందీప్ తెరకెక్కించారు. చింతా గోపాలకృష్ణారెడ్డి నిర్మించారు. ఈ నెల 31న సినిమా విడుదలవుతున్న సందర్భంగా హీరోయిన్లు నయన సారిక, తన్వీరామ్ మీడియాతో ముచ్చటించారు.

నయన్ సారిక మాట్లాడుతూ "నేను ఇది వరకు చేసిన చిత్రాల్లోకంటే ఇందులో భిన్నమైన పాత్రను పోషించా. సినిమాలో సత్యభామ అనే సంప్రదాయబద్ధమైన యువతిగా నటించా. క్లైమాక్స్‌ను చాలా కాలం గుర్తుపెట్టుకుంటారు. ఇది యూనివర్సల్ పాయింట్‌తో తెరకెక్కిన చిత్రం. అందుకే పాన్‌ఇండియా స్థాయిలో విడుదల చేస్తున్నాం. ప్రేక్షకుల మనసుల్లో నిలిచిపోయే సినిమా ఇది" అని చెప్పారు. తన్వీరామ్ మాట్లాడుతూ "ఇందులో రాధ అనే ఓ స్కూల్ టీచర్ పాత్రలో నటించాను. సినిమాలో నా పాత్ర చాలా కీలకంగా ఉండబోతోంది. సినిమాలో కిరణ్ అబ్బవరం, తన్వీరామ్, నేను పోషించిన పాత్రలకూ ఉన్న సంబంధం ఏంటనేది చాలా ఆసక్తికరంగా ఉంటుంది. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ సినిమాలో బోలెడు ట్విస్టులు ఉంటాయి. ఈ టైటిల్ ఎందుకు పెట్టామనేది థియేటర్లో సినిమా చూసినప్పుడు తెలుస్తుంది" అని అన్నారు.

సినిమాల్లో నటించడమే మానేస్తా

ఇటీవలే పీరియాడికల్ థ్రిల్లర్ 'క' చిత్ర ట్రైలర్‌ను విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమంలో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ "ఇది టైమ్ ట్రావెల్ నేపథ్యమున్న చిత్రం కాదు.. వాసుదేవ్ అనే వ్యక్తి ప్రయాణం. స్క్రీన్ ప్లే చాలా అద్భుతంగా ఉంటుంది. తప్పకుండా మీ అందరికీ సరికొత్త భావోద్వేగాన్ని పంచే చిత్రమిది. మల్టీప్లెక్స్‌ల కోసం రాసిన కథ కాదిది. బీసీ సెంటర్ల కోసమే సిద్ధం చేసిన కథ ఇది. ఇలాంటి కాన్సెప్ట్‌తో మునుపెన్నడూ సినిమా రాలేదు. ఒక వేళ వచ్చిందని నిరూపిస్తే.. సినిమాలు తీయడం మానేస్తాను" అని తెలిపారు.

మన సైన్యాన్ని అవమానిస్తారా?



శివకార్తికేయన్, సాయిపల్లవి జంటగా నటించిన దేశ భక్తి చిత్రం 'అమరన్' ఈ నెల 31న విడుదలకానుంది. మేజర్ ఉన్ని ముకుందన్ జీవిత కథ ఆధారంగా తెరకెక్కుతోన్న చిత్రమిది. ఈ నేపథ్యంలో సాయిపల్లవి పాత వీడియోను వైరల్ చేస్తూ నెటిజన్లు ఆమెను విమర్శిస్తున్నారు. ఆ వీడియోలో సాయిపల్లవి మాట్లాడుతూ 'అసలు హింసకు సరైన నిర్వచనం ఏవిటో అర్థం కావడం లేదు. మనుషుల దృష్టికోణాన్ని బట్టే ఏదైనా ఉంటుంది. ఇండియన్ ఆర్మీ అంటే మనకు ఎంతో గౌరవం. కానీ పాకిస్థాన్ ప్రజలు మన సైనికులను ఉగ్రవాదుల్లా చూస్తారు. వాళ్లకు చేటు చేస్తామని అనుకుంటారు. దృక్పథాలు ఇలా మారిపోతుంటాయి' అంటూ ఆమె మాట్లాడారు. ఈ వీడియో క్లిప్‌ను షేర్ చేస్తూ కొంతమంది 'సాయిపల్లవి భారత సైనికులను తీవ్రవాదులు అనే అర్థం వచ్చేలా మాట్లాడారని ప్రచారం చేస్తున్నారు. సాయిపల్లవి భారత సైన్యం గురించి తప్పుగా మాట్లాడలేదు, ఇరు దేశాల ప్రజల దృక్పథాలను గురించి మాత్రమే ఆమె మాట్లాడారని మరికొందరు సమర్థిస్తున్నారు.





ముగిసిన ఓపెన్ హౌస్

భవానీపురం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి) : పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఓపెన్ హౌస్ కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. విజయవాడ ఎంజీరోడ్డులోని ఏఆర్ గ్రౌండ్స్‌లో ఆక్టోపస్, ట్రాఫిక్, ఎస్‌బీఆర్‌ఎఫ్, ఎన్డీఆర్‌ఎఫ్, సైబర్ క్రైమ్, సీఎస్‌డబ్ల్యూ విభాగాలకు చెందిన అధికారులు ఆయా విభాగాల వారీగా ప్రదర్శన ఏర్పాటు చేశారు. విజయవాడ నలుమూలలు నుంచి వివిధ విద్యాసంస్థల విద్యార్థులు తరలివచ్చి సందర్శించారు. మొత్తం ప్రదర్శనల్లో ఆక్టోపస్ హైలెట్‌గా నిలిచింది.



క్లూస్ డాగ్స్

- కేసుల విచారణలో కీలకపాత్ర
- ఆధారాల సేకరణలో అద్భుత ప్రతిభ
- ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్లోని సిటీ సెక్యూరిటీ వింగ్‌లో 11 జాగిలాలు
- కొద్దినెలల కిందట రిటైరైన రెండు డాగ్స్

కీలకమైన కేసుల విచారణలో సిటీ సెక్యూరిటీ వింగ్(సీఎస్‌డబ్ల్యూ)లోని డాగ్ స్క్వాడ్ అద్భుతమైన ప్రతిభను కనబరుస్తోంది. మాదకద్రవ్యాలు, గంజాయి వంటి మత్తు పదార్థాలను ఇట్టే పసిగట్టేస్తోంది. పోలీసులకు సవాల్‌గా మారిన కేసుల్లో సైతం ఆధారాలను చూపిస్తోంది. కేసుల విచారణను సులభతరం చేస్తోంది. శాంతిభద్రతల పరిరక్షణలో కీలకపాత్ర పోషించే డాగ్ స్క్వాడ్ ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్లో ఉన్న సిటీ సెక్యూరిటీ వింగ్ ఆధీనంలో ఉంది. ఇందులో మొత్తం 11 జాగిలాలు ఉండగా, వాటిలో రెండు పదేళ్లు దాటడంతో రిటైరయ్యాయి. ప్రస్తుతం తొమ్మిది జాగిలాలు స్క్వాడ్‌లో పని చేస్తుండగా, బాంబు డిస్పోజల్‌కు ఏడు, నేరాల్లో నిందితులను ట్రాక్ చేయడానికి ఒకటి ఉండగా, మరొకటి నార్కోటిక్స్‌పై పని చేస్తోంది. వీటిపై ప్రత్యేక కథనం. 10లో

వాగులో పెద్దసంఖ్యలో ఇసుక తోలకాలకు వెళ్లిన ట్రాక్టర్లు



ఇసుక దందా!

గానుగపాడు కట్టలేరు వాగులో అనధికార సీనరేజ్

- తిరువూరు పట్టణంలో అక్రమంగా ఇసుక నిల్వలు
- కృత్రిమ కొరత సృష్టించేందుకు ఇసుక మాఫియాయత్నం

(ఆంధ్రజ్యోతి-తిరువూరు) : గృహనిర్మాణాలు, ఇతర అవసరాల నిమిత్తం వాగుల నుంచి ఉచితంగా ఇసుక తొలుకోవచ్చునని ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని ఇసుక మాఫియా తమకు అనుకూలంగా మార్చుకుంది. ఇసుకను అక్రమంగా నిల్వ చేస్తూ కృత్రిమ కొరతను సృష్టించే ప్రయత్నం చేస్తోంది. వివరాల్లోకి వెళితే.. ఇటీవల కాలంలో ఇసుక లభ్యత లేక భవన నిర్మాణాలు నిలిచిపోయాయి. కార్మికులు ఉపాధి కోల్పోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వీరి సమస్యను గుర్తించిన ప్రభుత్వం సమీపంలోని వాగుల్లో ఉచితంగా ఇసుక తోలుకునే వెసులుబాటు కల్పించింది. ఈ స్కీమ్ ప్రారంభంలో ట్రాక్టర్ కిరాయి, లోడింగ్ కూలీల ఖర్చు కలిపి సుమారు రూ.2000 నుంచి 2500లకు ఇసుక తోలకాలు సాగించారు.

అనధికార సీనరేజ్ వసూలు

తిరువూరు మండలంలోని గానుగపాడు కట్టలేరు వాగులో ఇసుక తోలకాలకు గ్రామ కట్టుబాటు ప్రకారం రూ.300 సీనరేజ్ చెల్లించాలని కొందరు అనధికార వసూళ్లకు పాల్పడ్డారు. ఒకనోక సమయంతో మాజీ మంత్రి జవహర్ సైతం వాగువద్ద ఎవ్వరికి నగదు ఇవ్వవల్సిన అవసరం లేదని, ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం ప్రవేశపెట్టిందని, ఎవరైనా నగదు అడిగితే అధికారులకు ఫిర్యాదు చెయ్యాలని సూచిస్తూ ఒక ప్రకటన జారీ చేశారు. ప్రస్తుతం గానుగపాడు వాగులో గతంలో ఇసుక లోడింగ్‌కు కూలీలకు రూ.700 చెల్లించగా, సీనరేజి అంశంపై వివాదం నెలకొనడంతో గ్రామానికి చెందిన కూలీలతోనే ఇసుక లోడింగ్ చేయించాలని, లోడింగ్ కూలీ రూ.1000 ఇవ్వాలనే డిమాండ్‌ను ఆ గ్రామానికి చెందిన కొందరు తెరపైకి తెచ్చారు. గానుగపాడు నుంచి తిరువూరు పట్టణానికి ఇసుక ట్రాక్టర్ ఖరీదు సుమారు రూ.3,500 నుంచి రూ.4,000 వరకు ఉంటుంది. వాగుల నుంచి ట్రాక్టర్లలో ఇసుకను అక్రమంగా తిరువూరు పట్టణంలోని పలు ప్రాంతాలకు తరలించి నిల్వ చేస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. వాగుల్లో ఇసుక లభ్యత లేనినాడు ఎక్కువ ధరకు అమ్మకాలు సాగించేందుకే అక్రమంగా డంపింగ్ చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి ఇసుక అక్రమ సీనరేజి, అక్రమ నిల్వలను అరికట్టాలని భవన యాజమానులు, నిర్మాణ రంగ కార్మికులు కోరుతున్నారు.

ఇద్దరి ప్రాణం తీసిన ఈత సరదా



హేమంత్‌కుమార్ (ఫైల్)




దుర్గా ప్రసాద్ (ఫైల్)

- సీతానగరం వద్ద కృష్ణానదిలో ఘటన
- శోకసంద్రంలో రెండు కుటుంబాలు

అజిత్‌సింగ్‌నగర్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి) : ఈత సరదా ఇద్దరి నిండు ప్రాణాలు తీసిన ఘటన ఆదివారం జరిగింది. వివరాల్లోకి వెళితే... న్యూ రాజరాజేశ్వరిపేట ప్రాంతానికి చెందిన సి.హేమంత్‌కుమార్(17), గుడివాడ దుర్గాప్రసాద్(23) మరో ముగ్గురు స్నేహితులతో కలిసి సాయంత్రం కృష్ణానదిలో ఈతకు వెళ్లారు. సీతానగరం వైపు రైల్వే అండర్ పాస్ వద్ద ద్విచక్రవాహనాలను పెట్టి నదిలో దిగారు. రైల్వే బ్రిడ్జి దిగువన రెండవ పిల్లరు వద్దకు వెళ్లిన ఐదుగురు స్నేహితులు కొంత సేపు అక్కడ గడిపారు. అనంతరం హేమంత్‌కుమార్, విభిన్న ప్రతిభావంతుడైన దుర్గాప్రసాద్ మళ్లీ ఈతకు నదిలోకి దిగారు. మిగిలిని ముగ్గురు ఒడ్డున కూర్చున్నారు. అయితే వీరు దిగిన ప్రాంతంలో లోతు ఉండటంతో ఒకరి తర్వాత మరొకరు మునిగిపోయారు. అక్కడే ఉన్న మత్స్యకారులు నీటిలో దిగి గల్లంతైన ఇద్దరు యువకుల మృతదేహాలను బయటకు తీశారు. దుర్గాప్రసాద్ ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తుండగా, హేమంత్‌కుమార్ ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. బిడ్డల మృతదేహాలను చూసి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

కృష్ణమ్మ ఒడిలో సీ ప్లేన్



మాల్దీవుల్లో కనిపించే సీ ప్లేన్స్ ఇక విజయవాడలోనూ సందడి చేయనున్నాయి. బెజవాడ నుంచి శ్రీశైలానికి తొలి దశలో సర్వీసులను నడపనున్నాయి. ప్రతిష్టాత్మకమైన ఈ ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం డిసెంబరు 9న ప్రారంభించనుంది. ప్రజల ఆదరణకు అనుగుణంగా భవిష్యత్తులో మరిన్ని రూట్లకు ఈ సర్వీసులను విస్తరించనుంది.

తొలి దశలో బెజవాడ-శ్రీశైలానికి సర్వీసు

- ప్రకాశం బ్యారేజీ ప్రాంతంలో వాటర్ డ్రోమ్ ఏర్పాటు
- డిసెంబరు 9న ప్రారంభంకానున్న ప్రాజెక్టు
- విజయవాడ నుంచి శ్రీశైలం వరకు తొలి దశలో సర్వీసులు
- క్రమేణా మిగిలిన రూట్లకు కూడా విస్తరణ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : నీటిలో తేలియాడుతూ ఆకాశవీధిలో విహరించే సీ ప్లేన్ సర్వీసులు విజయవాడ వాసులకు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. కృష్ణానదిలో చక్కర్లు కొట్టనున్నాయి. ప్రతిష్టాత్మకమైన సీ ప్లేన్ ప్రాజెక్టుకు డిసెంబరు 9న సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టనున్నారు. విజయవాడ నుంచి శ్రీశైలం వరకు తొలి దశలో సీ ప్లేన్ సర్వీసును ప్రారంభించనున్నారు. డిమాండ్‌ను బట్టి ఈ సర్వీసులను మరిన్ని పెంచుతారు. ఇతర ప్రాంతాలకు కూడా క్రమేణా సీ ప్లేన్ సర్వీసులను విస్తరించేందుకు చర్యలు చేపట్టనున్నారు.

దుర్గాఘాట్‌లో వాటర్ ఏరోడ్రమ్

ఈ ప్రాజెక్టులో భాగంగా ప్రకాశం బ్యారేజీ దగ్గర వాటర్ ఏరోడ్రమ్ ఏర్పాటు చేయనున్నారు. సీ ప్లేన్ వాటర్ వే కూడా ఏర్పాటు చేస్తారు. వాటర్ ఏరో డ్రమ్ ఏర్పాటుకు ఇప్పటికే సివిల్ ఏవియేషన్ అధికారులు స్థల పరిశీలన చేశారు. శ్రీదుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానం దిగువున దుర్గాఘాట్ సమీపంలో వాటర్‌డ్రోమ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోనున్నారు. సీ ప్లేన్ రాకపోకలకు వాటర్‌డ్రోమ్ ఎంతో కీలకంగా మారనుంది. విమానాశ్రయాలలో ఏరోడ్రమ్ ఎంత కీలకంగా ఉంటుందో.. వాటర్ డ్రోమ్ కూడా అంతే కీలకంగా పనిచేస్తుంది. వాటర్ డ్రోమ్ ద్వారానే సీ ప్లేన్‌ను నిర్వహించటం సాధ్యమవుతుంది.

బెజవాడ-శ్రీశైలం మధ్య ఆధ్యాత్మిక బంధం

సీ ప్లేన్ ప్రాజెక్టుతో విజయవాడ - శ్రీశైలం మధ్యన ఆధ్యాత్మిక బంధం ఏర్పడనుంది. శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానాన్ని దర్శించుకున్న భక్తులు శ్రీశైలంలోని శ్రీభ్రమరాంబ సమేత మల్లికార్జునలను కూడా దర్శించుకునే భాగ్యం సీ ప్లేన్ ద్వారా కలగనుంది. ఈ రెండు ప్రాంతాల మధ్యన టెంపుల్ టూరిజం మరింత అభివృద్ధి చెందనుంది.

పర్యాటక రంగానికి మరింత ఊతం

సీ ప్లేన్ ప్రాజెక్టు వల్ల పర్యాటక రంగానికి మరింత ఊతం ఇచ్చినట్టు అవుతుంది. కృష్ణానది, గోదావరి, పెన్నా తదితర నదుల తీరాల వెంబడి ఆహ్లాదకరమైన ప్రకృతి సంపద ఉంది. అలాగే ఎంతో చరిత్ర కలిగిన దేవాలయాలు ఉన్నాయి. సీ ప్లేన్ ప్రాజెక్టుల వల్ల పర్యాటకంగా, ఆధ్యాత్మికంగా ఈ ప్రాంతాలు అభివృద్ధి చెందటానికి అవకాశం ఉంటుంది.

జెట్టీ మీద సీ ప్లేన్ ల్యాండ్

సీ ప్లేన్ ల్యాండింగ్ కోసం ఒక వాటర్ వే ఏర్పాటు చేస్తారు. వాటర్‌వే మాత్రమే కాకుండా.. కృష్ణానదిలో ఎక్కడైనా సీ ప్లేన్ ల్యాండ్ అవగలదు. ప్రయాణికులు ఎక్కటానికి వీలుగా వాటర్‌వే ఏర్పాటు చేస్తున్నారు. వాటర్ వే కోసం దుర్భేధ్యమైన జెట్టీలను ఏర్పాటు చేస్తారు. ఈ జెట్టీ మీద సీ ప్లేన్ ల్యాండ్ అవుతుంది. ప్రయాణికులు బోటులో ఈ జెట్టీ దగ్గరకు వచ్చి సీ ప్లేన్ ఎక్కాల్సి ఉంటుంది. విజయవాడ నుంచి బయలుదేరిన సీ ప్లేన్ నేరుగా శ్రీశైలంలో పాతళగంగ దగ్గర కృష్ణానది మీద ల్యాండ్ అవుతుంది. అతి తక్కువ ఖర్చుతో ఒకే రోజు రాష్ట్రంలోని రెండు ప్రముఖ పుణ్యక్షేత్రాలను దర్శించుకోవచ్చు. సీ ప్లేన్ సర్వీసులను ఏ సంస్థ ద్వారా నడుపుతారన్నదానిపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. మన దగ్గర స్పైస్ జెట్ సంస్థ సీ ప్లేన్‌లను నడుపుతోంది. ఈ సంస్థ ద్వారా విమాన సర్వీసును నడిపే అవకాశాలు కనిపిస్తున్నాయి.

మరిన్ని ప్రాంతాలకు సీ ప్లేన్ సర్వీసులు

తొలి దశలో విజయవాడ నుంచి శ్రీశైలానికి సీ ప్లేన్ సర్వీసును ప్రారంభిస్తున్నారు. ఈ సర్వీసుకు వచ్చిన ఆదరణను దృష్టిలో పెట్టుకుని విజయవాడ- హుస్సేన్‌సాగర్, విజయవాడ - విశాఖపట్నం రూట్లపై కూడా సీ ప్లేన్ సర్వీసులను నడిపేందుకు దృష్టి సారిస్తారు. ముందు విజయవాడ - శ్రీశైలం మధ్యన సర్వీసుకు వచ్చే డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకుని ఆ మేరకు మిగిలిన రూట్లపై దృష్టి సారిస్తారు.

విజయవాడ టు విశాఖ విమానయానం

- రెండు నగరాల మధ్య షటిల్ సర్వీసులు ప్రారంభం
- వీటిలో ఇండిగో- 2, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ - 1
- చార్జీలు తగ్గించాలంటున్న ప్రయాణికులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ,విశాఖపట్నం మధ్య షటిల్ విమాన సర్వీసులు ఆదివారం నుంచి అందుబాటులోకి వచ్చాయి. ఇండిగో ఎయిర్‌లైన్స్‌కు చెందిన రెండు విమానాలు, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్‌కు చెందిన ఒక విమాన సర్వీసు నడుస్తోంది. ఇప్పటి వరకు విజయవాడ, విశాఖ మధ్య ఎయిర్ కనెక్టివిటీ పెద్దగా లేదు. దీంతో ఈ రెండు ప్రాంతాల మధ్య రాకపోకలన్నీ కూడా ఎక్కువుగా రైళ్ల ద్వారానే నడుస్తున్నాయి. తాజా షటిల్ సర్వీసుల ద్వారా ఈ రెండు ప్రాంతాల మధ్య విమానయానం అందుబాటులోకి వచ్చింది. టికెట్ ధరలు రూ.4,700, రూ.5,751 వరకు ఉండటంతో కాస్త అధికంగా ఉన్నాయన్న విమర్శలు వస్తున్నాయి. విజయవాడ నుంచి ముంబాయికి కూడా ఇంచుమించు ఇంతే ధరతో ప్రయాణించగలుగుతున్నపుడు .. విజయవాడ- విశాఖల మధ్య అంత స్థాయిలో ధరలు ఉండటం పట్ల ప్రయాణికులు పెదవి విరుస్తున్నారు. విమానయాన సంస్థల మధ్య పోటీ ఉన్నపుడు చార్జీలు తగ్గాలి కానీ, పెరగటం పట్ల అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఉద్యోగిపై డీఆర్‌ఈవోకు

కాంట్రాక్టర్ ఫిర్యాదు

- ఉద్యోగి విద్యార్హత పత్రాలు పరిశీలించి చర్యలు తీసుకోవాలని వినతి
- లేనిపక్షంలో హైకోర్టుకు వెళతానని హెచ్చరిక

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఆర్‌డబ్ల్యూఎస్‌లో పనిచేస్తున్న ఉద్యోగిపై అవినీతి ఆరోపణలు చేస్తూ కాంట్రాక్టర్ ఒకరు డీఆర్ ఈవోకు ఫిర్యాదు చేయటం చర్చనీయాంశమైంది. ఆర్‌డబ్ల్యూఎస్ డీఆర్‌ఈవో మచిలీపట్నం ఆఫీసులో ట్రేసర్‌గా పనిచేస్తున్న సీహెచ్ శ్రీధర్‌పై కాంట్రాక్టర్ గారపాటి సూర్యకిరణ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ప్రధానంగా గన్నవరం సబ్ డివిజన్ పరిధిలో ఎస్ఎన్ పాలెం, ఓ అండ్ ఎం స్కీమ్‌లకు సంబంధించి టెండర్లు పిలిచారని, ఈ టెండర్లలో 25 శాతం మేర తక్కువుగా కోట్ చేసిన కాంట్రాక్టర్‌తో నిబంధనల ప్రకారం అగ్రిమెంట్ చేయించాల్సి ఉండగా.. ఆ పని చేయలేదని ఆరోపించారు. కాంట్రాక్టరుకు ఏ విధమైన నోటీసులు ఇవ్వకుండా పాత కాంట్రాక్టర్‌తోనే ఓఅండ్ఎం స్కీమ్‌ను నడిపిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ చర్య వల్ల ప్రభుత్వానికి నష్టం వచ్చిందని తెలిపారు. ఈ వ్యవహారంలో ట్రేసర్ పాత్ర ఉందని ఆరోపణలు చేశారు. సదరు ఉద్యోగి విద్యార్హత పత్రాలను కూడా పరిశీలించాల్సిందిగా అధికారులను కోరారు. దీనిపై విచారణ జరపకపోతే తాను హైకోర్టును ఆశ్రయించాల్సి వస్తుందని హెచ్చరించారు.

బాబోయ్.. బైపాస్ రోడ్డు!

8లో





ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ

10లో

బాబోయ్.. బైపాస్ రోడ్డు!



పట్టణంలో సేకరించిన చెత్త తగులపెట్టగా వచ్చే పొగతో వాహన చోదకుల ఇబ్బందులు

(మైలవరం-ఆంధ్రజ్యోతి)

- దుర్గంధం వెదజల్లుతున్న మైలవరం రహదారి
- ఖాళీ స్థలాల్లో ఎక్కడ చూసినా చెత్తే
- వ్యాధుల భయంతో ప్రజల ఆందోళన

మైలవరం బైపాస్ రోడ్డు డంపింగ్ యార్డ్‌లా మారిపోయింది. పలు ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలకు ఆనుకుని ఉన్న బైపాస్ రోడ్డులో ఇష్టానుసారం చెత్తా చెదారాన్ని వేయడంతో కొత్త సమస్యలు తలెత్తుతున్నాయి. పారిశుధ్య సమస్యతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. చెత్త కుళ్లిపోయి తీవ్ర దుర్గంధం వెదజల్లుతుండటంతో ఆ రోడ్డున వెళ్లాలంటే విద్యార్థులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమీపంలోనే లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు, ఏసీపీ, తహసీల్దార్, అగ్నిమాపక, ఫారెస్టు కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులకు రోజూ దుర్గంధం బెడద తప్పడం లేదు. చెత్త వల్ల పాఠశాలల విద్యార్థులకు, ప్రభుత్వ కార్యాలయ సిబ్బందికి, స్థానిక నివాసితులకు అంటు వ్యాధుల భయం పట్టుకుంది. దోమలు, ఈగలు విపరీతంగా పెరిగిపోయాయని పలువురు భయాందోళన చెందుతున్నారు. దోమ కాటు వల్ల విష జ్వరాలు ప్రబలుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమీప ప్రాంతాల నుంచి సేకరించిన చెత్తను బైపాస్ రోడ్డులో వేసి దాన్ని తగలబెట్టడం వల్ల వచ్చే పొగ కారణంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని వాహన చోదకులు వాపోతున్నారు.

డంపింగ్ యార్డ్ ఉండాల్సిందే

గతంలో పట్టణంలో సేకరించిన చెత్తను చిన్న దళితవాడ సమీపంలో వేసేవారు. అటు తర్వాత పూర గుట్ట స్థలంలో చెత్తను డంప్ చేశారు. పూరగుట్టలో జగనన్న కాలనీ నిర్మాణం జరగడంతో ప్రస్తుతం పూరగుట్టకు వెళ్లే మార్గంలో ఓ వాగు పక్కనే చెత్తను వేస్తున్నారు. అది కాస్త దూరం సాకుతో బైపాస్ రోడ్డులో చెత్తను డంప్ చేస్తున్నారు. దీంతో సమస్య తలెత్తుతోంది.



ప్రభుత్వ పాఠశాల సమీపంలో వేసిన చెత్తాచెదారం

కనీసం రెండు ఎకరాల స్థలం కావాలి

పట్టణంలో సుమారు ఏడువేల నివాసాలున్నాయి. రైతు బజారు, కూరగాయల మార్కెట్, ప్రభుత్వాసుపత్రి, కళాశాలల హాస్టల్స్ నుంచి రోజుకు సుమారు 150 నుంచి 200 టన్నుల చెత్తను పంచాయతీ సిబ్బంది సేకరిస్తున్నారు. దాన్ని వేసేందుకు కనీసం రెండు ఎకరాల స్థలం డంపింగ్ యార్డ్ కింద ఉండాల్సిందే. ప్రస్తుతం ఎక్కడా డంపింగ్ యార్డ్ లేకపోవడంతో పట్టణంలో ఎక్కడ ఖాళీ స్థలం కనిపిస్తే అక్కడ చెత్తను డంప్ చేస్తున్నారు. రెవెన్యూ, పంచాయతీశాఖాధికారులు స్పందించి చెత్త డంపింగ్‌కు స్థలాన్ని సేకరించాల్సి ఉంది.

చెత్త వేయకుండా చూడాలి



- కుంభ గోవింద్, మైలవరం

చెత్త చెదారం నుంచి వచ్చే దుర్గధం పలు అంటు వ్యాధులు ప్రబలే అవకాశాలున్నాయి. చెత్తను తగులబెట్టే సమయంలో వచ్చే పొగ, మంట వల్ల ఇబ్బందులు పడుతున్నాం. నిత్యం రద్దీగా ఉండే ఈరోడ్డులో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందని భయం వేస్తుంది. అధికారులు స్పందించి చెత్తను అక్కడ వేయకుండా చూడాలి.

పిల్లలకు, సిబ్బందికి ఇబ్బందులు



- బాలు, ఎమ్మీఇవో

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులకు చెత్త వల్ల ఇబ్బందులు తప్పడం లేదు. పాఠశాలకు ఆనుకొనే చెత్త చెదారం వేయడంతో దుర్వాసన పాఠశాలలోకి వస్తున్నది. చెత్త వల్ల పందుల సంచారం అధికంగా ఉంటోంది. పిల్లలు, ఉపాధ్యాయుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని చెత్తను బైపాస్ రోడ్డులో వేయకుండా చర్యలు తీసుకోవాలి.

స్థలం సరిపోవడం లేదు

- మహమ్మద్ రఫీ, పంచాయతీ కార్యదర్శి

పూరగుట్ట సమీపంలో తాత్కాలికంగా ఉన్న స్థలం పట్టణంలో సేకరించిన చెత్త వేసేందుకు సరిపోవడం లేదు. దాంతో బైపాస్ రోడ్డులో కొన్నాళ్లు వేశారు. ఇప్పుడు ఆపేశారు. ఎవరైనా బైపాస్ రోడ్డులో చెత్త వేస్తే చర్యలు తీసుకుంటాం. పూర్తిస్థాయిలో చెత్తను డంప్ చేసేందుకు ఇంకాస్త స్థలం అవసరం ఉంది. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి స్థలాన్ని కేటాయించేలా కోరతాం. చెత్త సమస్యకు పరిష్కారం లభించేలా చూస్తాం.

ఇంటర్వ్యూ..

రూ. 12 కోట్లతో..

కృష్ణా జిల్లాలో రహదారులకు మరమ్మతులు

- ఏప్రిల్ నాటికి రూ. 105 కోట్లతో 234 పనులకు ప్రతిపాదనలు
- ఆర్అండ్‌బీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.లోకేశ్వరరావు



జిల్లాలో రూ.12 కోట్లతో 53 రోడ్లకు మరమ్మతులు చేసే ప్రక్రియను యుద్ధప్రాతిపదికపై చేపడుతున్నట్టు ఆర్అండ్‌బీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.లోకేశ్వరరావు చెప్పారు. నాలుగేళ్లుగా జిల్లాలో మరమ్మతులు లేకపోవడంతో రోడ్లన్నీ గుంతలమయమయ్యాయి. కొన్నిచోట్ల ద్విచక్ర వాహనాలు వెళ్లలేని పరిస్థితి ఉంది. వర్షం వస్తే రహదారులు కాలువల్లా మారుతున్నాయి. గతుకులమయంగా ఉన్న రోడ్లపై ప్రయాణాలు చేస్తున్న సందర్భాల్లో కొందరు ప్రమాదాలకు గురవుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రోడ్ల మరమ్మతులపై దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆర్అండ్‌బీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.లోకేశ్వరరావును 'ఆంధ్రజ్యోతి' పలకరించింది. దీనిపై ఆయన మాటల్లోనే..

? జిల్లాలో మరమ్మతులు లేక రోడ్లు దయనీయంగా ఉన్నాయి కదా?

● జిల్లాలో రోడ్లు గోతులమయంగా ఉన్న మాట వాస్తవమే. పలు ప్రాంతాల నుంచి ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు రోడ్లకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు. రోడ్ల మరమ్మతులు చేసేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చింది.

? మరమ్మతులపై దృష్టి సారిస్తున్నారా.. నిధులు వచ్చాయా?

● రోడ్లు మరమ్మతులపై దృష్టి సారిస్తున్నాం. తక్షణ పనులకు రూ.12.40 కోట్లు మంజూరయ్యాయి.

? ఎన్ని పనులకు ఎంత నిధులు మంజూరయ్యాయి?

● స్టేట్ హైవే కింద 13 పనులకు రూ. 2.9 కోట్లు, 32 మేజర్ డిస్ట్రిక్ట్ రోడ్లకు రూ.9.5 కోట్లు మంజూరయ్యాయి.

? నాలుగేళ్లుగా చాలా మంది కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించడం లేదు కదా? పనులకు కాంట్రాక్టర్లు ముందుకు వచ్చారా?

● టెండర్లు పిలిచాం. కాంట్రాక్టర్లు ముందుకు వచ్చారు. పనులు అప్పగిస్తాం. డిసెంబర్‌లోగా ఎట్టి పరిస్థితుల్లో పనులు పూర్తి చేస్తాం. మచిలీపట్నం సబ్ డివిజన్‌తో పాటు అవనిగడ్డ, గుడివాడ, ఉయ్యూరు సబ్ డివిజన్లలో పూర్తిగా పాడైన రోడ్లకు ముందుగా మరమ్మతులు చేపడతాం.

? మిగిలిన పనుల సంగతేమిటి?

● ఓఆర్ గ్రాంటు కింద మరో రూ.105 కోట్లకు ఎస్టిమేట్లు తయారు చేశాం. స్టేట్ హైవేల్లో 49 పనులకు రూ.91 కోట్లు అవసరం. అలాగే 175 మేజర్ డ్రిస్టిక్ రోడ్లకు రూ. 14 కోట్లు అవసరం ఉంది. ఈ నిధులతో రోడ్లను పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయవచ్చు. వీటిల్లో రూ. 71 కోట్లతో మేజర్ మరమ్మతులు చేపట్టవలసి ఉంది. 2025 ఏప్రిల్ నాటికి జిల్లాలో రోడ్లు బాగుపడే అవకాశాలు ఉన్నాయి. అయితే కొత్త రోడ్లకు స్పెషల్ గ్రాంటు వస్తే గానీ వేయలేం.

(ఆంధ్రజ్యోతి, మచిలీపట్నం టౌన్)

కీసర రీచ్‌లో ఇసుక దుమారం!

- చర్యలు చేపట్టినా ఆగని దందా
- అర్ధరాత్రి అక్రమ తరలింపునకు యత్నం

కంచికచర్ల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రత్యేక టీములు డ్రోన్ల ద్వారా పర్యవేక్షిస్తున్నప్పటికీ నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో ఇసుక దందాకు మాత్రం ఇంకా పూర్తిస్థాయిలో బ్రేక్ పడలేదు. శనివారం రాత్రి కీసర స్టాక్ పాయింట్‌లో టిప్పర్లకు ఇసుక లోడ్‌చేసి, విజయవాడ తరలించినట్టుగా స్థానికులు ఆరోపిస్తున్నారు. నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో ఇసుక దందాపై శనివారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనం ప్రకంపనలు సృష్టించింది. రీచ్‌ల్లో ఇసుక అక్రమ తవ్వకాలు, లారీలు, టిప్పర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు యథేచ్ఛగా సాగుతున్న అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు నడుంబిగించారు. మూడు ప్రత్యేక బృందాలు వెంటనే రంగంలోకి దిగాయి. ఎక్కడికక్కడ రీచ్‌లు, స్టాక్ పాయింట్లను డ్రోన్లతో తనిఖీ చేశారు. ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినప్పటికీ ఇసుక దోపిడీ పూర్తిగా ఆగలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. శనివారం అర్ధరాత్రి పెండ్యాల రీచ్‌కు విజయవాడ నుంచి ఒక నేతకు చెందిన నాలుగు లారీల్లో కొంతమేర డంప్ చేసిన ఇసుకను లోడ్ చేశారు. విషయం తెలుసుకున్న స్థానికులు లారీలను అడ్డగించారు. ఇసుక అక్రమ రవాణాకు వీల్లేదంటూ పట్టుబట్టారు. ఇరుపక్షాల మధ్య తీవ్ర వాగ్వివాదం జరుగుతుండగా, పోలీసులు రావడంతో ఇసుక అన్‌లోడింగ్ చేసి లారీలు వెళ్లిపోయాయి. అయితే కీసర స్టాక్ పాయింట్ నుంచి ఇసుక లోడ్ చేసుకుని కొన్ని టిప్పర్లు విజయవాడ వెళ్లాయని స్థానికులు చెబుతున్నారు. ఇసుక దోపిడీ వ్యవహారం స్థానికంగా పెద్ద దుమారమే రేపుతోంది.



పెండ్యాల రీచ్

ఇసుక దందాకు పాల్పడితే కఠిన చర్యలు :

ఎమ్మెల్యే సౌమ్య



వ్యక్తిగత అవసరాల పేరుతో ఇసుక అక్రమ వ్యాపారం చేసేవారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. స్థానిక అవసరాలకు ఉచితంగా ఇసుక తీసుకువెళ్లేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని, స్థానిక అధికారులకు సమాచారం ఇచ్చిన తర్వాతనే ఇసుక కావాల్సిన వారు రీచ్‌ల్లో తవ్వకాలు జరపాలన్నారు. ఇసుక అక్రమ రవాణా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

క్రీడాకారులు దేశ ప్రతిష్టను పెంచాలి

- బాక్సింగ్ పోటీల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే గద్దె

విజయవాడ స్పోర్ట్సు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించి దేశ ప్రతిష్టను ఇనుమడింపచేయాలని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ఆకాంక్షించారు. ఉమ్మడి కృష్ణా ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో కృష్ణలంక ప్రభుత్వ కళాశాలలో రాష్ట్రస్థాయి 68వ స్కూల్‌గేమ్స్ అండర్-19 బాక్సింగ్ బాలబాలికల చాంపియన్‌షిప్ పోటీలను ఆయన ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, చంద్రబాబు రాష్ట్రంలో క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, ఆయన నాయకత్వంలో క్రీడాకారులు మరింత ఎదగాలని గద్దె కోరారు. విజయవాడ డీవీఈవో సీఎస్ఎస్ఎన్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా 12 జిల్లాల నుంచి 240మంది బాక్సింగ్ క్రీడాకారులు తలపడుతున్నారన్నారు. పోటీల నిర్వాహక కార్యదర్శి వి.రవికాంత మాట్లాడుతూ, మూడు రోజుల పాటు పోటీలకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఇ.కోటేశ్వరరావు, పోటీల పరిశీలకులుగా ఏపీ రాజు, డి.రంగారావులు హాజరయ్యారు.

సీకే నాయుడు క్రికెట్..

ఆంధ్రా తొలి ఇన్నింగ్స్ 108/6

విజయవాడ స్పోర్ట్సు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మూలపాడు వేదికగా దేవినేని వెంకటరమణ క్రికెట్ గ్రౌండ్స్‌లో ఆంధ్రా, విదర్భ జట్ల మధ్య బీసీసీఐ పర్యవేక్షణలో కల్నల్ సీకే నాయుడు ట్రోఫీ మ్యాచ్ ఆదివారం ప్రారంభమైంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న విదర్భ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 56.5 ఓవర్లలో 212 పరుగులకు ఆలౌటయ్యింది. ఎండీ ఫయాజ్ 52, ఆశిత్ సింగ్ 84 అర్ధసెంచరీలతో జట్టును ఆదుకున్నారు. ఆంధ్రా బౌలర్లు శ్రీకర్ 3, సాకేత్ రామ్ 3, జి.సుమిత్ రెండేసి వికెట్లను తీశారు. అనంతరం ఇన్నింగ్స్ ఆరంభించిన ఆంధ్రా ఆట ముగిసే సమయానికి 108/6తో ఉంది. రేవంత్‌రెడ్డి 22, జీఎస్‌పీ తేజ 39 పరుగులతో ఆడుతున్నారు. గణేష్‌కు 4, జగ్‌జాట్‌కు 2 వికెట్లు లభించాయి.



విజేతలకు ట్రోఫీల ప్రదానోత్సవంలో రోటరీ గవర్నర్ వెంకటేశ్వరరావు, ఐకాన్ స్కూల్ చైర్మన్ పార్థసారథి

ఓపెన్ ర్యాపిడ్ విజేత కౌత్సవ్ కుండు

విజయవాడ స్పోర్ట్సు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఐకాన్ పబ్లిక్ స్కూల్ వేదికగా ఆరురోజులుగా సాగుతున్న బీఎన్‌కేయూ తొలిఇంటర్నేషనల్ ఫిడే రేటింగ్ చెస్ టోర్నీ ఆదివారం ఘనంగా ముగిసింది. ర్యాపిడ్ చెస్ ఓపెన్‌లో ఇంటర్నేషనల్ మాస్టర్ కౌత్సవ్ కుండు(పశ్చిమబెంగాల్) విజేతగా అవతరించగా, రెండో స్థానంలో ఇంటర్నేషనల్ మాస్టర్ కుశాగ్రమోహన్(తెలంగాణ), తృతీయ స్థానంలో గ్రాండ్ మాస్టర్ వెంకటేష్ ఆర్ఆర్(తమిళనాడు)లు నిలిచారు. ర్యాపిడ్, క్లాసికల్, బ్లిట్జ్ విజేతలకు. రూ.15లక్షలు, ట్రోఫీలను అందజేశారు. బహుమతుల ప్రదానోత్సవంలో ముఖ్యఅతిథిగా రోటరీ క్లబ్ డిస్ట్రిక్టు గవర్నర్ ఎం.వెంకటేశ్వరరావు, ఐకాన్ పబ్లిక్ చైర్మన్ వై.పార్థసారథి రావు, డైరెక్టర్ కె.రాజేంద్ర, టోర్నీ కన్వీనర్ షేక్ ఖాసిం, టోర్నమెంట్ డైరెక్టర్ విత్తనాల కుమార్, ఏపీ చెస్ అసోసియేషన్ సీఈవో జ్వాలాముఖీ, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎన్ఎం ఫణికుమార్, ఇంటర్నేషనల్ ఆర్బిటర్ అమ్మినేని ఉదయ్‌కుమార్ నాయుడు, నరోఎలు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధికి రూ.5 లక్షల విరాళం



మచిలీపట్నం టౌన్ : వరద బాధితుల సహాయార్థం మచిలీపట్నం ఇమిటేషన్ జ్యూయలరీ అసోసియేషన్ ప్రతినిధులు రూ. 5 లక్షలను సీఎం చంద్రబాబునాయుడుకు అందజేశారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు చలమలశెట్టి నరసింహారావు, అధ్యక్షుడు పి.వి.సుబ్బారావు, ఎండీ వరప్రసాదరావు, కోశాధికారి ఎస్.వి.సుబ్బారావు, జాయింట్ సెక్రటరీ రహ్మతుల్లా బేగ్, ఉమామహేశ్వరరావు, రాజా, బాబాప్రసాద్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బొప్పరాజు వెంకటేశ్వర్లు

పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలి

- బొప్పరాజు వెంకటేశ్వర్లు

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగులకు రావాల్సిన పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలని ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్, రెవెన్యూ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం అమరావతి నాల్గవ తరగతి ఉద్యోగుల రాష్ట్ర సంఘ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగుల న్యాయమైన కోర్కెలు నెరవేర్చాలన్నారు. బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. సమావేశంలో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు అర్గయ్య, మచిలీపట్నం రెవెన్యూ ఉద్యోగుల సంఘ కార్యదర్శి శ్యాం గౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోట చెన్నప్ప, ఉపాధ్యక్షుడు ఎస్.సుబ్రహ్మణ్యం, కోశాధికారి శ్రీనివాసులు, ప్రచార కార్యదర్శి కృష్ణ, ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు, కృష్ణాజిల్లా అధ్యక్షుడు కేవీ ప్రసాద్ తదితరులు మాట్లాడారు.



గోపాలన్, చైతన్యలను సత్కరిస్తున్న ఇంపీకప్స్ డైరెక్టర్ వేముల భానుప్రకాష్

ఆయుర్వేదంలో

నూతన ఆవిష్కరణలు శుభపరిణామం

ఆటోనగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ ఆరోగ్య వ్యవస్థలో ఆయుర్వేదం సామర్థ్యం పెంచే ప్రణాళికలతో భారత ప్రభుత్వం నూతన ఆవిష్కరణలు ప్రోత్సహించడం శుభపరిణామమని ఇంపీకప్స్ డైరెక్టర్ వేముల భానుప్రకాష్ అన్నారు. ఆదివారం ది ఇండియన్ మెడికల్ ప్రాక్టీషనర్స్ కో-ఆపరేటివ్ ఫార్మసీ అండ్ స్టోర్స్ ఇంపీకప్స్ పంచకర్మ ఆసుపత్రిలో జాతీయ ఆయుర్వేద దినోత్సవం పురస్కరించుకుని 'ఆయుర్వేద సద్వైద్య సంభాష పరిషద్' కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కె.ఎస్.ఆర్ గోపాలన్, డాక్టర్ చైతన్యలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆయుర్వేద పరిశ్రమల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో స్నిగ్ధ ఆయుర్వేద హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కె.ఎస్ ఆర్ గోపాలన్, డాక్టర్ పమ్మి సూర్యకుమార్, డాక్టర్ ఆదర్శ్, డాక్టర్ ప్రియాంక, డాక్టర్ జాబిల్లి పాల్గొన్నారు.

ఘనంగా ఉప్పలపాటి జన్మదిన వేడుక



ఉప్పలపాటి ఉదయ భాస్కరరాజుకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న సంస్థ డైరెక్టర్లు

అజిత్‌సింగ్‌నగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ రైజ్ ఎన్ రైజ్ చైర్మన్ ఉప్పలపాటి ఉదయ భాస్కరరాజు జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఆంధ్రప్రభ కాలనీలోని సంస్థ కార్యాలయంలో డైరక్టర్లు, నగర ప్రముఖులు, వ్యాపారవేత్తలు, రైతులు, మార్కెటింగ్ సిబ్బంది సమక్షంలో ఉదయ భాస్కరరాజు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎనిమిదేళ్లుగా పేద, మధ్య తరగతి ప్రజలకు అతి తక్కువ ధరకే అప్రూవ్డ్ లేఅవుట్లలో ఇళ్ల స్థలాలు అందిస్తున్నామని తెలిపారు. నూతనంగా ప్రారంభించిన కొత్తూరు తాడేపల్లి గ్రామ పరిధిలోని 'క్యాపిటల్ స్పేస్ ఫేజ్-2' నగరానికి 12 కిలోమీటర్లు, వెస్ట్ బైపాస్‌కు 4 కిలోమీటర్లు, జెడ్ సిటీకి 2 కిలోమీటర్ల దూరంలో ఉందని తెలియజేశారు. రాజధాని అమరావతికి అతి తక్కువ దూరంలో నివాస యోగ్యమైన స్థలాలను అందజేస్తున్న నమ్మకమైన సంస్థ రైజ్ ఎన్ రైజ్ అని భాస్కరరాజు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ డైరక్టర్లు ఎంవీ నాగరాజు, ఎన్.సన్యాసిరావు, ఎ.పెద్దిరాజు, వీసీ, కుమార్, టి.రాజు, ఎంవీవీ కృష్ణారావు చైర్మన్‌కు పుష్పగుచ్ఛాన్ని అందజేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.

విజయసాయిరెడ్డిపై గన్నవరం స్టేషన్‌లో ఫిర్యాదు



సీఐ శివప్రసాద్‌కు ఫిర్యాదు చేస్తున్న తెలుగు యువత నేతలు

గన్నవరం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ అధినేత సీఎం చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వైసీపీ నేత విజయసాయిరెడ్డిపైన చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని తెలుగు యువత నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక స్టేషన్‌లో సీఐ శివప్రసాద్‌కు ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా తెలుగుయువత నియోజకవర్గ అధ్యక్షుడు పరుచూరి నరేష్ మాట్లాడుతూ, విజయసాయిరెడ్డి చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు సరికాదన్నారు. ఇలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయకుండా చర్యలు తీసుకుని శాంతి భద్రతలను కాపాడాలన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మృతి, వైఎస్ షర్మిళ, వైఎస్ జగన్ వివాదం వెనుక చంద్రబాబు హస్తం ఉందన్న విషప్రచారం మానుకోవాలని, లేకుంటే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. గత వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు విచారణ చేయలేదని ప్రశ్నించారు. ఫిర్యాదు చేసిన వారిలో తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి కొసరాజు సాయి, తాటిపాముల నాగయ్య, మేడేపల్లి రమ, వంగా అయ్యప్ప రెడ్డి, అలుగోజి నాగబాబు, చల్లగుల్ల సందీప్, పూర్ణ, బొబ్బ సాయి, ఎల్లా రఘు, తంగిరాల శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

మోపిదేవిలో నాగుల చవితికి పటిష్ట ఏర్పాట్లు

మోపిదేవి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నవంబరు 5వ తేదీన నాగుల చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలోపటిష్టమైన ఏర్పాట్లు చేయనున్నట్లు ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు విలేకరులకు తెలిపారు. నాగుల చవితి రోజున స్వామివారి దర్శనానికి, పుట్టలో పాలు పోసేందుకు 50 వేల మందికిపైగా భక్తు లు విచ్చేస్తారని అంచనా వేసినట్లు తెలిపారు. తెల్లవారుజామున రెండున్నర గంటలకు నాగపుట్ట వద్ద ప్రత్యేక పూజలు 3 గంటల నుంచి భక్తులకు స్వామివారి దర్శనం కల్పించనున్నట్లు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేకమైన క్యూ లైన్లు ఏర్పాటు చేసి ఉచితంగా పులిహోర, చిన్న పిల్లలకు పాలు అందించనున్నట్లు తెలిపారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి వెండి నాగపడగ




మోపిదేవి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మోపిదేవి వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి పెడనకు చెందిన పేరిశెట్టి నిరంజనరావు - అనంతలక్ష్మి దంపతులు 2 కేజీల 110 గ్రాముల వెండి నాగ పడగను సమర్పించారు. ఆలయ ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావుకు ఆదివారం నాగపడగను అందజేశారు. దాతలు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయగా, ఆలయ మర్యాదలతో వారిని సత్కరించారు.

మైనర్ బాలికతో

పెళ్లికి యత్నం!

- పోలీసుల రాకతో పరారీ
- నిందితుడి కోసం గాలింపు

గుణదల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రసాదంపాడులోని కపుతావారి తోటలోగల శివాలయంలో ఓ మైనర్ బాలిక వివాహాన్ని ముందస్తు సమాచారంతో పోలీసులు అడ్డుకున్నారు. రామవరప్పాడు రాజులబజార్‌లోని ఓ అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్ కుమార్తె (17)ను మూడేళ్లుగా ప్రసాదంపాడుకు చెందిన రాఘవ(23) ప్రేమపేరుతో వేధిస్తున్నాడు. కొద్ది రోజుల క్రితం ఆమె ఇంటికి వెళ్లి బాలిక పెళ్లి చేసుకుంటానని ఆమె తల్లిదండ్రులను ఒప్పించాడు. సదరు యువకుడు గంజాయి బ్యాచ్‌లో తిరుగుతాడన్న విషయం బాలిక తల్లిదండ్రులకు తెలియదు. 26వ తేదీ శనివారం రాత్రి ప్రసాదంపాడు గ్రామ శివారులోగల కపుతావారి తోటలోగల శివాలయంలో తన పెళ్లి అని రాఘవ స్నేహితులకు 10 రోజుల ముందే తెలియజేశాడు. పెళ్లికి అన్ని ఏర్పాట్లు చేసుకున్నాడు. బాలికకు 18 సంవత్సరాలు నిండలేదని రాఘవను పలువురు ప్రశ్నించడంతో ఎవరికీ చెప్పకుండా రెండ్రోజుల ముందు బాలికను తీసుకుని పరారయ్యాడు. విషయం తెలుసుకున్న పటమట సీఐ పవన్ కిషోర్, సెక్టార్ ఎస్ఐ హరికృష్ణలు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికే బాలికతో రాఘవ ఉడాయించాడని తెలిసి బాలిక తల్లిదండ్రులకు రాఘవ నేరచరిత్ర చెప్పి వారు ఊళ్లోకి వస్తే తెలియజేయాలన్నారు. మైనర్‌కు వివాహం చేస్తే ఎవరైనా శిక్షార్హులేనని హెచ్చరించారు.



స్కూల్ ఎడ్యుకేషన్ సర్వీసెస్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

నూతన కార్యవర్గం

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లా స్కూల్ ఎడ్యుకేషన్ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎండీ ఇదయతుల్లా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం ఇక్కడ జరిగిన ఎన్నికల్లో ఇదయతుల్లా అధ్యక్షుడుగా, ఎం.ఫణికుమార్ కార్యదర్శిగా, ఎండీ అబ్దుల్ గఫూర్ కోశాధికారిగా, ఎండి బాబర్ ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. వీరితో పాటు ఆర్గనైజింగ్ సెక్రటరీగా టి. సుధాకర్, మహిళా కార్యదర్శిగా ఎం.కల్పన ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా జి.బాలకృష్ణ, అసిస్టెంట్ ఎన్నికల అధికారిగా వి.శివలీల, ఎన్నికల పరిశీలకురాలిగా బి.పద్మకుమారి వ్యవహరించారు.

విజయవాడ తూర్పు

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 545

మున్సిపల్ కార్మికులకు దుప్పట్ల పంపిణీ

భారతీనగర్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): నాలుగో డివిజన్ శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీ రెండో రోడ్డులోని జైభారత్ చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో కార్యవర్గ సభ్యుల సమావేశం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ విచ్చేశారు. ట్రస్ట్ సెక్రటరీ దేవి పవన్ కుమార్ జన్మదినం సందర్భంగా దుప్పట్లు, చీరలను నగర పాలక సంస్థ కార్మికులకు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ చేతుల మీదుగా అందజేశారు. ట్రస్ట్ నిర్వాహకులు గార్లపాటి జగదీష్, రైల్వే శ్రీనివాస్, శ్రీవాణి, సలాది రంగారావు, జ్యోతి, ప్రకాష్, పీఆర్వో పోతిన శ్రీనివాస్ పాల్గొన్నారు.



శ్రీనివాసచౌదరికి డిజిటల్ సభ్యత్వ కార్డును అందజేస్తున్న రాయి రంగమ్మ, ముని పోలిపల్లి

కార్యకర్తలకు అండగా టీడీపీ

రాణిగారితోట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): 'కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకునే పార్టీ టీడీపీ. పార్టీ కార్యకర్తలకు అండగా ఉండడమే కాకుండా వారి సంక్షేమం కోసం పలు కార్యక్రమాలు అమలు చేస్తోంది.' అని ఆ పార్టీ 17వ డివిజన్ అధ్యక్షురాలు రాయి రంగమ్మ అన్నారు. డివిజన్‌లో ఆదివారం సభ్యత్వ నమోదు, ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల నమోదు కార్యక్రమాలు నిర్వహించారు. పార్టీ నాయకుడు కొప్పుల శ్రీనివాస్ చౌదరికి డిజిటల్ సభ్యత్వ కార్డును రాయి రంగమ్మ, ముని పోలిపల్లి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆదిబాబు, ముని అజయ్, ముని కృష్ణ, వేల్పుల గురవయ్య, కందిరి రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఆటోనగర్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 8 గంటల నుంచి 10.30 గంటల వరకు కరణం గారి బజార్, పంటకాలువ రోడ్డు, ఓల్డ్ పోస్టు ఆఫీసు, జ్యోతి విద్యాలయం స్ట్రీట్, యాదవుల బజార్, దానయ్య బజార్, చెన్ను పిచ్చయ్య వీధి, కిలారు వారి వీధి, మరీదు పుల్లారావు వీధి, అచ్చమ్మ, భాగయ్య వీధిలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ఏడుకొండలు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఆకతాయిలకు అడ్డాగా..

వెటర్నరీ కాలనీ వీఎంసీ పార్కు సమీపంలోని యూత్ హాస్టల్

- శిథిలావస్థకు చేరిన భవనం.. చీకటిపడితే అందులోకి చేరుతున్న ఆకతాయిలు
- మద్యం తాగడం, అటుగా వెళ్తున్న మహిళలతో అసభ్యకర ప్రవర్తన
- ఆకతాయిలను కట్టడి చేయాలని కోరుతున్న స్థానికులు

(ఆంధ్రజ్యోతి-భారతీనగర్)

వెటర్నరీ కాలనీ వీఎంసీ పార్కు సమీపంలో యూత్ హాస్టల్ ఉంది. ముప్పై ఏళ్ల క్రితం యువతను ప్రోత్సహించాలనే లక్ష్యంతో కేంద్ర మానవ వనరులు, క్రీడా మంత్రిత్వ శాఖ భవనాన్ని నిర్మించింది. జిల్లాలోని యువతకు క్రీడా రంగంలో ప్రాధాన్యం కల్పించడంతో పాటు యువజన కార్యక్రమాలు దీని కేంద్రంగా నిర్వహించేవారు. ఈ భవనంలో జిల్లా యువజన సంక్షేమాధికారి ఆధ్వర్యంలో ఉద్యోగులు, సిబ్బంది పనిచేసేవారు. జాతీయస్థాయిలో నిర్వహించే పోటీలకు దేశవ్యాప్తంగా వచ్చిన క్రీడాకారులకు వసతి కల్పించేవారు. భవనం నిర్మించి ఏళ్లు గడిచిపోవడంతో శ్లాబు పెచ్చులూడి ప్రమాదకరంగా మారడంతో ఐదేళ్ల క్రితం దీనిని ఖాళీ చేశారు. ప్రస్తుతం యూత్ హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరుకుంది. యూత్ హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరడంతో అందులో ఎవరూ ఉండడం లేదు. దీంతో భవనాన్ని ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. దీనిని ఆసరాగా తీసుకుని, కొందరు ఆకతాయిలు మద్యం తాగుతున్నారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారు. అటుగా వస్తున్న మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని, ప్రశ్నిస్తే ఎదురు తిరుగుతున్నారని కాలనీ పెద్దలు చెబుతున్నారు. ఆకతాయిలను కట్టడిచేయాలని అధికారులను స్థానికులు కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరిన యూత్ హాస్టల్ భవనం, హాస్టల్ ప్రాంగణంలో పెరిగిన పిచ్చిమొక్కలు



పింక్ బెలూన్స్‌తో అవగాహన కల్పిస్తున్న రూట్స్ సభ్యులు

మొదటి దశ రొమ్ము కేన్సర్ నయం చేయొచ్చు

పటమట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): రొమ్ము కేన్సర్‌ను మొదటి దశలో గుర్తిస్తే నయం చేయొచ్చని రూట్స్ హెల్త్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ పోలవరపు విజయబాస్కర్ తెలిపారు. పింక్ రిబ్బన్‌ర్యాలీలు, వాక్‌ల ద్వారా రొమ్ము కేన్సర్‌పై అవగాహన కల్పిస్తున్నామని ఆయన తెలిపారు. రొమ్ము కేన్సర్ అవగాహన మాసం సందర్భంగా రూట్స్ హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ సర్కిల్‌లో పింక్ రిబ్బన్ క్యాంపెయిన్‌ను సభ్యులు ఆదివారం నిర్వహించారు. యుక్తవయస్సు నుంచి రొమ్ము స్వీయపరీక్ష చేసుకోవాలని రూట్స్ మహిళా కన్వీనర్ కె.మాధవి సూచించారు.



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, అమ్మ ఫౌండర్ గారపాటి విజయకుమార్ తదితరులు

అమ్మ సేవలు స్ఫూర్తిదాయకం

- వజ్రోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

మొగల్రాజపురం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): సమాజానికి ఆంధ్రా మోటార్ మర్చంట్స్ అసోసియేషన్(అమ్మ) చేస్తున్న సేవలు స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. అమ్మ అసోసియేషన్ వజ్రోత్సవ వేడుకలను సున్నపు బట్టీల సెంటర్‌లోని అమ్మ హాలులో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బొండా ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు. పేదలకు వైద్యశిబిరాలు, మందుల పంపిణీ, వరద బాధితులకు ఆహార సరఫరా, ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రభుత్వాలకు విరాళాలు ఇవ్వడం లాంటి ఎన్నో కార్యక్రమాలను 'అమ్మ' చేస్తోందని ఎమ్మెల్యే బొండా ఉమా అన్నారు. 1964లో చుక్కపల్లి కుశలవ, తదితర పెద్దలు సంఘం ఏర్పాటు చేశారని, నాటి నుంచి ఇప్పటి వరకు 60 ఏళ్లలో ఎన్నో ఆటుపోట్లను సంఘం చూసిందని, సమాజానికి, సంఘ సభ్యులకు అండదండగా ఉందని ఫౌండర్లలో ఒకరైన గారపాటి విజయకుమార్ పేర్కొన్నారు. అమ్మ శత వసంతాలు పూర్తి చేసుకోవాలని ఆయన ఆకాంక్షించారు. అధ్యక్షుడు వడ్లమూడి వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సుంకర చంద్రశేఖర్, కోశాధికారి అన్నే శ్రీనివాసరావు టీడీపీ రాష్ట్ర నాయకుడు బొప్పన భవకుమార్, ఎన్ఆర్ఐ ఆస్పత్రి డీన్ డాక్టర్ శ్రీలక్ష్మి, డాక్టర్ చౌదరి, డాక్టర్ సీతాంపు తదితరులు మాట్లాడారు. అనంతరం 60 ఏళ్లు నిండిన సీనియర్ సభ్యులను సత్కరించారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ చేతుల మీదుగా సావనీర్‌ను ఆవిష్కరించారు. సంఘం పూర్వ అధ్యక్షుడు ఎంవీ ప్రసాద్, బొబ్బా నారాయణరావు, యార్లగడ్డ సుబ్బారావు, మిరియాల వెంకటేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఆస్టియోపోరోసిస్‌పై అవగాహన



డాక్టర్ హరిప్రసాద్‌ను సత్కరిస్తున్న సమభావన మిత్రమండలి సభ్యులు

పటమట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): గుల్లబారిన ఎముకల వ్యాధి(ఆస్టియోపోరోసిస్)పై అందరూ అవగాహన కలిగి ఉండాలని ఎముకల, కీళ్ల వ్యాధి నిపుణుడు డాక్టర్ హరిప్రసాద్ సూచించారు. సమభావన మిత్ర మండలి 102వ సమా వేశం సంస్థ అధ్యక్షుడు కోనేరు నరేంద్ర అధ్యక్షతన ఆదివారం బెంజిసర్కిల్ సమీపంలోని వాసవ్య జూబ్లీ హాల్లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ హరిప్రసాద్ మాట్లాడారు. వైరల్ ఫీవర్ వచ్చాక ఆ వ్యక్తిలో సాధారణ రోగ నిరోధకశక్తి తగ్గిపోతుందని, జ్వరం తగ్గిన రెండు, మూడు నెలలు పాటు కీళ్ల నొప్పులు, కాళ్లు చేతులు బిగుసుకు పోవడం, కాళ్ల తిమ్మిర్లు ఉంటాయని తెలిపారు. 45-50 సంవత్సరాలు దాటిన వారిలో ఆస్టియోపోరోసిస్ వస్తుందన్నారు. వీరికి చిన్న దెబ్బలకు కూడా ఎముకలు విరిగిపోతాయని తెలిపారు. మహిళల్లో నెలసరి ఆగిపోయిన వారిలో వ్యాయామం చేయని వారిలో ఈ వ్యాధి ఎక్కువగా ఉంటుందన్నారు. కాల్షియం, విటమిన్-డి తగ్గిపోవడం వలన ఆల్కహాల్, స్మోకింగ్ మానసిక ఒత్తిడి వలన ఊబకాయం వల్ల వ్యాధి మరింత పెరుగుతుందన్నారు. డాక్టర్ హరిప్రసాద్‌ను మిత్రమండలి సభ్యులు సత్కరిం చారు.

శివనామస్మరణం..సర్వ పాపహరణం



సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో ఆధ్యాత్మికవేత్త కావూరి సత్యవతిని సన్మానిస్తున్న సీనియర్ సిటిజన్లు

పటమట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): సర్వసృష్టికి మూలం పరమశివుడని, శివనామస్మరణం సర్వపాపహరణమని ఆధ్యాత్మికవేత్త, రిటైర్డు ప్రధానోపాధ్యాయురాలు కావూరి సత్యవతి పేర్కొన్నారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో అసోసియేషన్ అధ్యక్షుడు సూర్యదేవర పాపారావు అధ్యక్షతన ఆదివారం సాహితీ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కావూరి సత్యవతి విచ్చేశారు. సీనియర్ సిటిజన్ సభ్యులు ఆమెను ఘనంగా సత్కరించారు.



తెలంగాణ గవర్నర్ విష్ణుదేవ్ నుంచి మెమెంటో అందుకుంటున్న తరుణ్ కాకాని

తరుణ్ కాకానికి సత్కారం


- వన్యప్రాణుల సంరక్షణ కోసం పాటు పడినందుకు వైల్డ్ లైఫ్ ఫండ్ ఇండియా నుంచి దక్కిన గౌరవం

భవానీపురం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రకృతి, వన్యప్రాణుల సంరక్షణకు వివిధ కార్యక్రమాలను చేపట్టినందుకు అమరావతి బోటింగ్ క్లబ్ సీఈవో డాక్టర్ తరుణ్ కాకానిని తెలంగాణ గవర్నర్ విష్ణుదేవ్‌వర్మ మెమెంటో అందజేసి ఆదివారం సత్కరించారు. హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో వరల్డ్ వైల్డ్ లైఫ్ ఫండ్ ఇండియా కార్యాలయం నిర్వహించిన కార్యక్రమంలో ఆయనను సత్కరించారు. నగరానికి చెందిన తరుణ్ కాకాని డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూకు అవగాహన సెషన్లు నిర్వహించడం, భవానీద్వీపం బయో డైవర్సిటీ మ్యాపింగ్, సాఫ్ట్ బ్యాక్ ఓటర్స్ , రెడ్ ఇయర్డ్ స్పైడర్ టర్టిల్ వంటి అరుదైన రెడ్ లిస్టెడ్ జంతు జాతులను సంరక్షించడంలో స్థానిక అటవీ అధికారులతో సమన్వయం చేయడానికి సహకరించినందుకు ఈ గౌరవం ఆయనకు దక్కింది.

పొంచి ఉన్న ప్రమాదం

(ఆంధ్రజ్యోతి-ప్రభుత్వాసుపత్రి)

గుణదల మేరిమాత చర్చి సమీపంలో ఓ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పిచ్చిమొక్కలు దట్టంగా మొలిచాయి. చర్చికి వచ్చే వారి ద్విచక్రవాహనాలు ఈట్రాన్స్‌ఫార్మర్ పక్కనే నిలుపుదల చేస్తారు. చర్చి నుంచి క్రీస్తురాజుపురం వెళ్లే రహదారిలో ఉన్న ఈట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణం పిచ్చిమొక్కలను శుభ్రం చేయించాలని కోరుతున్నారు.



ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పిచ్చి మొక్కలు, విద్యుత్ తీగలకు అల్లుకున్న మొక్కల తీగలు

క్లూస్ డాగ్స్







డాగ్ స్క్వాడ్‌లో ఆధారాలు పట్టిచ్చే 11 జాగిలాలు

● కొద్దినెలల క్రితం రిటైరైనవి రెండు ● డ్రగ్స్ ట్రాక్‌లో జింబో

గంజాయి ఏ మూలన ఉన్న ఇట్టే గుర్తు పట్టేస్తాయి. పేలుడు పదార్థాలను పెకిలించి బయటకు లాగేస్తాయి. నేరం చేసి పారిపోయి ఎక్కడ దాక్కున్నా వారి జాడను పోలీసులకు ఇచ్చేస్తాయి. సిటీ సెక్యూరిటీ వింగ్ (సీఎస్‌డబ్ల్యూ)లో ఉన్న డాగ్ స్క్వాడ్ ప్రతిభకు గుర్తింపులివి. ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్లోని సిటీ సెక్యూరిటీ రింగ్ ఆధీనంలో డాగ్ స్క్వాడ్ ఉంది. ఇందులో మొత్తం 11 జాగిలాలున్నాయి. వాటిలో రెండు జాగిలాలు పదేళ్లు దాటడంతో రిటైరయ్యాయి. ప్రస్తుతం 9 జాగిలాలు స్క్వాడ్‌లో పనిచేస్తున్నాయి. బాంబు డిస్పోజల్‌కు ఏడు, నేరాల్లో నిందితులను ట్రాక్ చేయడానికి ఒకటి ఉండగా మరొకటి నార్కోటిక్స్‌పై పని చేస్తోంది. తాజాగా బెంగళూరు నుంచి రెండింటిని కొనుగోలు చేశారు. వాటికి ప్రస్తుతం మంగళగిరిలోని సీటీసీ (కెనైన్ ట్రైనింగ్ సెంటర్లో) శిక్షణ ఇస్తున్నారు. డాగ్ స్క్వాడ్‌లో మొత్తం మూడు జాతుల జాగిలాలున్నాయి. గోల్డెన్ రిటీవర్ రెండు, బెల్జియం మెలనైజ్ ఒకటి, లేబర్ డార్ రిటీవర్స్ 8 ఉన్నాయి. ఇందులో లేబర్ డార్ రిటీవర్స్ జాతికి చెందిన 2 జాగిలాలు రిటైర్ అయ్యాయి. - ఆంధ్రజ్యోతి, విజయవాడ

తొమ్మిదేళ్లు దాటాక చెకప్‌లు

డాగ్ స్క్వాడ్‌లో పనిచేసే జాగిలాల రిటైర్మెంట్ కాలం తొమ్మిదేళ్లు. ఇన్నేళ్ల పాటు పనిచేసిన తర్వాత వాటిని పశువైద్యులకు చూపిస్తారు. వైద్యుల పరీక్షల తర్వాత వాటి సేవలను ఇంకా వినియోగించుకోవచ్చని ధ్రువీకరిస్తే పనిచేయిస్తారు. మరో రెండు, మూడేళ్ల పాటు వాటిని విధులకు ఉపయోగిస్తారు. అప్పుడు కఠినమైన విధులు కాకుండా చిన్న చిన్న పనులకు ఉపయోగిస్తారు. వయస్సు రీత్యా ఎలాంటి పనులు చేయలేవని నిర్ధారిస్తే స్క్వాడ్ నుంచి రిటైర్మెంట్ ఇస్తారు. వాటిని కెనైన్‌లో ఉంచి చనిపోయే వరకు ఫీడింగ్ ఇస్తారు. ఇప్పుడున్న జాగిలాల్లో జింబో, రోమియోకు రిటైర్మెంట్ వయస్సు వచ్చింది. వాటి స్థానంలోకి దింపడానికి ఇటీవల కొనుగోలు చేసిన రెండింటికి సీటీసీలో శిక్షణ ఇస్తున్నారు. డాగ్ స్క్వాడ్‌లోకి వచ్చే జాగిలాలను 4 నెలల వయస్సున్నప్పుడు కొనుగోలు చేస్తారు. వాటికి 8నెలలపాటు సీటీసీలో శిక్షణ ఇస్తారు. మొదటి 2 నెలలు ప్రేమ, ఆప్యాయతపై శిక్షణ ఇస్తారు. తర్వాత 2 నెలలు వినయ విధేయతలపై శిక్షణ ఇస్తారు. మిగిలిన 4నెలలు మాత్రం ఏ విభాగానికి వాటిని ఉపయోగించాలని భావిస్తారో వాటికి సంబంధించిన అంశాలపై శిక్షణ ఉంటుంది.

పలుగు చూసి రోమియో పరుగులు

నంది గామలో 4 నెలల క్రితం ఒక ఇంట్లో చోరీ జరిగింది. ఘటనా స్థలంలో పోలీసులకు తాళాలు పగలగొట్టడానికి ఉపయోగించిన పలుగు తప్ప ఇతర ఆధారాలేమీ లభించలేదు. ఘటనా స్థలానికి చేరుకున్న ట్రాకర్ అక్కడున్న పలుగు వాసన చూసి పరిగెత్తుకుంటూ కొంత దూరాన ఉన్న ఒక ఇంట్లోకి వెళ్లింది. ఈ కేసులో ఉన్న చిక్కుముడిని ఆ జాగిలం విప్పింది. డాగ్ స్క్వాడ్‌లో ఉన్న ట్రాక్టర్ డాగ్ చేసిన పని ఇది. నేరాలు జరిగినప్పుడు నిందితుల కదలికలను పసిగట్టడానికి ఉపయోగించే ట్రాకర్ పేరు రోమియో. ఇప్పటివరకు 30-40 కేసుల్లో ఆధారాలను పోలీసులకు ఇచ్చింది. తొమ్మిదేళ్లుగా రోమియో ట్రాకర్ విధులను నిర్వహిస్తోంది. మరో ఏడాదిలో రిటైర్ కాబోతోంది.

భద్రతకు బిట్టు

బిట్టు.. ఇది వ్యక్తి పేరు కాదు. వీఐపీల భద్రతలో ఉన్న ఓ జాగిలం పేరు. బిట్టుతోపాటు లక్కీ, రాంబో, షీబా, లూయా, టోలీ, లియో డాగ్‌స్క్వాడ్‌లో ఉన్నాయి. వాటిని రాజ్‌భవన్, గన్నవరంలోని విమానాశ్రయంలో తనిఖీలకు ఉపయోగిస్తున్నారు. ఇవి కాకుండా వీఐపీల పర్యటనల్లో ఈ జాగిలాలను వినియోగిస్తున్నారు. అంతేగాకుండా బాంబు బెదిరింపు కాల్స్, ఇతర బెదిరింపు కాల్స్ వచ్చినప్పుడు విధ్వంసకర పదార్థాలను ఈ జాగిలాలు ఇట్టే గుర్తుపట్టేస్తాయి.



నార్కోటిక్ జింబో

మాదకద్రవ్యాలు, గంజాయి వంటి మత్తు పదార్థాలను పసిగట్టడానికి ప్రత్యేకంగా ఒక జాగిలానికి శిక్షణ ఇచ్చారు. దీనికి జింబో అని నామకరణం. తొమ్మిదేళ్లుగా ఈ జింబో నార్కోటిక్ పదార్థాలను గుర్తించడంపై పనిచేస్తోంది. కొద్దిరోజుల క్రితం కొత్తపేటలోని కేఎల్ రావు పార్కు వద్ద గంజాయి బ్యాచ్ తిరుగుతుందని సమాచారం రావడంతో పోలీసులు నిఘా పెట్టారు. ఇక్కడికి జింబోను తీసుకెళ్లిన పోలీసులు పార్కు వద్ద వదిలారు. ఇది కొంత దూరం పరిగెత్తుకుంటూ వెళ్లి ఒక యువకుడ్ని చుట్టుముట్టింది. అతడిని పోలీసులు తనిఖీ చేయగా జేబులో 50 గ్రాములు గంజాయి ప్యాకెట్ బయటపడింది. జింబోను అజిత్ సింగ్ నగర్, నున్న, కొత్తపేట పోలీస్ స్టేషన్ల పరిధిలో ఎక్కువగా తిప్పుతున్నారు.



నేడు కలెక్టరేట్‌లో వినతుల స్వీకరణ

వన్‌టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): విజయవాడలోని ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ ఉన్న పింగళివెంకయ్య సమావేశ మందిరంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతులను స్వీకరిస్తున్నట్టు ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ నిధి మీనా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్, డివిజన్, మునిసిపల్, మండల కేంద్రాల్లో అధికారులు అందుబాటులో ఉండి ఫిర్యాదులను స్వీకరిస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

13వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

భారతీనగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఐటీఐ, డీఎల్‌టీసీ స్టాఫ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం సున్నంబట్టీల సెంటర్‌లోని అమ్మకల్యాణ మండపంలో నిర్వహించే 13వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ఐటీఐ, డీఎల్‌టీసీ స్టాఫ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పుట్టగుంట రమేష్ బాబు, ప్రధాన కార్యదర్శి కె. రత్నరాజు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ మహాసభలు సోమవారం ప్రారంభమై రెండు రోజులపాటు (28, 29న) నిర్వహించబతాయన్నారు. ఈసభల్లో గత ఏడాదిలో సాధించిన విజయాలను సమీక్షించుకొని, భవిష్యత్తు కార్యాచరణ రూపొందించబడతాయన్నారు. అనంతరం నూతన రాష్ట్ర సంఘం నేతలను ఎన్నుకుంటామన్నారు. ముఖ్యఅతిథులుగా స్థానిక ఎమ్మెల్యే, ఏపీఎస్‌జీజీవో రాష్ట్ర, జిల్లా నేతలు, డిపార్ట్మెంట్ ఉన్నతాధికారులు పాల్గొంటున్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఐటీఐ, డీఎల్‌టీసీ సంఘం నేతలు, సభ్యులు పాల్గొని సభలను జయప్రదం చేయాలని కోరారు.

డీటీపీ కోర్సులు ప్రారంభం

భారతీనగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రమేష్ హాస్పిటల్ సెంటర్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డెస్క్‌టాప్ పబ్లిషింగ్ (డీటీపీ), సిగ్నేజ్ సొల్యూషన్, ఎలక్ట్రికల్ టెక్నీషియన్ కోర్సులకు సోమవారం నుంచి ఈ కోర్సులు ప్రారంభమౌతాయని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సులపై ఆసక్తి గల అభ్యర్థులు వివరాలకు 9347779032, 8008742842 సంప్రదించాలన్నారు.



ఐరన్ యార్డులో ప్లాన్ విరుద్ధంగా సెట్‌బ్యాక్‌లు లేకుండా స్థలం మొత్తం గోడౌన్ నిర్మాణం

పెచ్చుమీరుతున్న అక్రమ కట్టడాలు

● ఐరన్‌యార్డులో ఇంటి ప్లాన్ తీసుకుని గోడౌన్ నిర్మాణం
● కార్పొరేషన్ ఆదాయానికి లక్షల్లో గండి

భవానీపురం-ఆంధ్రజ్యోతి: 43వ డివిజన్ ఐరన్‌యార్డులో అక్రమ కట్టడాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. కోట్లలో వ్యాపారాలు చేసే యజమానులు ప్లాన్‌లకు విరుద్ధంగా గోడౌన్ల నిర్మాణాలు చేపడుతున్నారు. వీటికి ఫైర్ అధికారులు ఎన్‌వోసీలు ఎలా ఇస్తున్నారన్నది వారికే తెలియాలి. ఐరన్‌యార్డులో ఇటీవల 55వ షాపు నెంబర్ పక్కనే ఇద్దరు అసెస్‌మెంట్లు కలిపి ఇంటి ప్లాన్ తీసుకుని ముందు సెట్‌బ్యాక్‌లు ఫైర్ వాహనాలు వెళ్లే అవకాశం లేకుండా భారీ గోడౌన్ నిర్మాణం సాగుతోంది. ఐరన్‌యార్డులో ఇళ్లకు ప్లాన్‌లు తీసుకుని వాటిని కమర్షియల్ గోడౌన్లుగా నిర్మిస్తూ యథేచ్ఛగా సాగిపోతున్న వీటి వంక కన్నెత్తి చూసే అధికారే కానరావడం లేదు. ఈ వ్యవహారంలో లక్షల్లో చేతులు మారుతుండగా, కార్పొరేషన్ ఆదాయానికి బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు, పలుకుబడి కలిగిన కొందరు వ్యక్తులు ఆమ్యామ్యాలు పంచుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. గోడౌన్ నిర్మాణాలకు తీసుకుని కింద షాపులు, పైన ఇళ్ల నిర్మాణాలు జరిగిపోయాయి. వీఎంసీ కమిషనర్ ఇటుచూస్తే అసలు వాస్తవాలు బయటపడతాయి.





ముగిసిన ఓపెన్ హౌస్

నగరంలో ఏఆర్ గ్రౌండ్స్‌లో రెండు రోజులుగా పోలీసులు నిర్వహిస్తున్న ఓపెన్ హౌస్ ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆక్టోపస్, ట్రాఫిక్, ఎస్‌బీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్, సైబర్ క్రైమ్, సీఎస్‌డబ్ల్యు విభాగాల అధికారులు తమ ఆయుధాలను విద్యార్థులకు చూపించి వాటి పనితీరును వివరించారు.



జాతీయ స్విమ్మింగ్‌లో పతకాలను సాధించిన పారా స్విమ్మర్లను అభినందిస్తున్న శాప్ వీసీ, ఎండీ గిరిశా

35 పతకాలు సాధించిన పారా స్విమ్మర్లు

విజయవాడ స్పోర్ట్సు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): గోవా వేదికగా ఇటీవల జరిగిన 24వ జాతీయ పారా స్విమ్మింగ్‌లో రాష్ట్రం తరపున పాల్గొన్న 15 మంది పారా స్విమ్మర్లు 35 పతకాలను సాధించడం అభినందనీయమని శాప్ వీసీ, ఎండీ పీఎస్ గిరిశా అన్నారు. నగరంలోని శాప్ ఎండీ కార్యాలయంలో క్రీడాకారులకు జరిగిన అభినందన సభలో క్రీడాకారులను ఎండీ అభినందించి సత్కరించారు. రాబోయే జాతీయ, అంతర్జాతీయ పోటీల్లోను మరిన్ని పతకాలను రాష్ట్రానికి సాధించి పెట్టాలని ఆయన ఆకాంక్షించారు. రాష్ట్ర పారా అసోసియేషన్ కార్యదర్శి వీ రామస్వామి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ వరప్రసాద్.

ఏపీ ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్, మీడియా యజమానుల ఫోరం ప్రారంభం

వన్‌టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్, మీడియా యజమానుల ఫోరం ఆవిర్భావమైంది. ప్రజాపాలన, స్నేహ టీవీ, అంబేడ్కర్ టీవీ చైర్మన్, రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి, శివభాగ్యారావు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, మాజీ ఎంపీ, వి.వరప్రసాద్ ముఖ్య అతిథులుగా తొలి సమావేశం జరిగింది. మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం హాల్‌లో ఆదివారం ఫోరం విస్తృతస్థాయి సమావేశం జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్టులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రస్తుతం పత్రికా రంగంలో నెలకొన్న అనేక సమస్యలను, వాటి పరిష్కారం కోసం ఏం చేయాలన్నదానిపై చర్చించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్టులకు ఫోరం ఏం చేయాలనే దానిపై సుదీర్ఘ హామీల పత్రాన్ని విడుదల చేశారు. అనంతరం హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు.

ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ



వన్‌టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ దర్శనానికి ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకునేందుకు కుటుంబాలతో సహా తరలి వచ్చారు. కొందరు అమ్మవారికి తలనీలాలు ఇచ్చి, కృష్ణానదిలో పవిత్ర స్నానాలు చేసి అమ్మవారి దర్శనానికి కొండపైకి చేరుకుని కనకదుర్గమ్మ కరుణ కోరుతూ ఆర్తితో దర్శించుకున్నారు. కొంతమంది భక్తులు పొంగళ్లు సమర్పించారు. వివిధ ఆర్జిత సేవల్లో భక్తులు పాల్గొన్నారు. అమ్మవారి దర్శనం శీఘ్రంగా జరిగేందుకు ఈవో రామారావు, సిబ్బంది ముందస్తు ప్రణాళిక ప్రకారం క్యూలైన్లలో భక్తులను నియంత్రించారు. క్యూలైన్లలో పరిస్థితిని, భక్తుల రాకపోకలను ఈవో, అధికారులు సందర్శించి తగు సూచనలతో రద్దీని క్రమబద్ధీకరించారు. క్యూలైన్లలో అనుసరించాల్సిన విధివిధానాలపై సిబ్బందికి ఈవో సూచనలు చేశారు. అనధికార దర్శనాల కట్టడిపై సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.

దుర్గమ్మకు ఫ్యాన్సీ నెక్లెస్ కానుక

విజయవాడ మొగల్రాజపురానికి చెందిన మురిగిపూడి వెంకటేశ్వరరావు తమ కుటుంబ సభ్యులు అమ్మవారి అలంకరణ నిమిత్తం 22.5 గ్రాముల బంగారు ఫాన్సీ నెక్లెస్‌ను కానుకగా అందజేశారు. ఆదివారం ఆలయానికి విచ్చేసిన వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులు ఈవో రామారావును కలిసి దేవస్థానానికి కానుకను అందచేశారు. అమ్మవారి దర్శనానంతరం వారికి ఆశీర్వచనం, శేషవస్త్రం, ప్రసాదం, చిత్రపటం అందజేశారు.

దుర్గమ్మ సన్నిధిలో ఆర్థికశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ

కొండపై కొలువైన దుర్గమ్మను ఆదివారం రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పీయూష్ కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. వారికి అధికారులు ఆలయ మర్యాదలు అందజేశారు. అమ్మవారి దర్శనానంతరం అధికారులు, అర్చకులు వారికి ప్రసాదం, శేషవస్త్రం, అమ్మవారి చిత్రపటం అందజేయగా వేదపండితులు ఆశీస్సులందజేశారు.



పీయూష్ కుమార్‌కు చిత్రపటం అందజేస్తున్న అర్చకులు



హోటల్‌లో తనిఖీలు చేస్తున్న బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్, కృష్ణలంక పోలీసులు

ప్రముఖ హోటల్‌కు బెదిరింపు

● తనిఖీలు చేసిన బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్, కృష్ణలంక పోలీసులు

వన్‌టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): బందరు రోడ్డులోని ఓ ప్రముఖ హోటల్‌కు గుర్తు తెలియని వ్యక్తులు మెయిల్‌లో బెదిరించారు. సమాచారం తెలుసుకున్న బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్, కృష్ణలంక పోలీసులు హుటాహుటిన హోటల్‌కు చేరుకుని నిర్వాహకులను వివరాలు అడిగి తెలుసుకుని తనిఖీలు చేశారు. మెయిల్ అవాస్తమని తెలియటంతో అధికారులు, హోటల్ నిర్వాహకులు ఊపిరి పీల్చుకున్నారు. జయవాడలోని బందరురోడ్డులో ఉన్న ప్రముఖ హోటల్ వివంతకు తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు మెయిల్ పంపించారు. ఇటీవల తమిళనాడులో ఓ వర్గానికి చెందిన తీవ్రవాది సిద్ధిఖ్‌ను అక్కడి పోలీసులు అరెస్టు చేశారు. ఆ వర్గానికి చెందిన తీవ్రవాదులు దాడులకు పాల్పడే అవకాశం ఉంది కాబట్టి హోటల్ రూమ్‌లను వెంటనే ఖాళీ చేయాలని మెయిల్‌లో పేర్కొన్నారు. హోటల్ ఉద్యోగులు ఈ విషయాన్ని నిర్వాహకులకు తెలియపరిచి కృష్ణలంక పోలీసులకు ఫిర్యాదు చేశారు. సౌత్ ఏసీపీ యు.బంగార్రాజు, కృష్ణలంక సీఐ నాగరాజు, బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్ హుటాహుటిన హోటల్‌కు చేరుకుని సిబ్బందిని వివరాలను అడిగి తెలుసుకుని తనిఖీలు నిర్వహించారు. గుర్తు తెలియని వ్యక్తులు పంపిన మెయిల్ నిజం కాకపోవటంతో పోలీసు అధికారులు, హోటల్ నిర్వాహకులు ఊపిరి పీల్చుకున్నారు.

ఎలాంటి ఫోన్ కాల్, మెయిల్ అయినా స్పందిస్తాం: సౌత్ ఏసీపీ

గుర్తు తెలియని వ్యక్తులు చేసే ఎలాంటి ఫోన్ కాల్‌కు అయినా, పంపించే మెయిల్‌కు అయినా వెంటనే స్పందిస్తామని సౌత్ ఏసీపీ యు. బంగార్రాజు తెలిపారు. వివంత హోటల్‌కు గుర్తు తెలియని వ్యక్తులు పంపించిన మెయిల్‌పై ఆయన స్పందించారు. ఇటీవల కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ప్రముఖ హోటళ్లకు, వ్యక్తులకు మెయిల్స్, బెదిరింపు కాల్స్ పంపుతున్నారని, ఇటీవల తిరుపతిలోనూ పోలీసు కేసు నమోదయిందన్నారు. తామెలాంటి ఫోన్ కాల్, మెయిల్‌కు అయినా వెంటనే స్పందించి తగిన భద్రతా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎవరికైనా రాంగ్ కాల్స్, మెయిల్స్ వస్తే పోలీసు అధికారులకు వెంటనే సమాచారం అందించాలని సూచించారు.





రానున్న దీపావళిని వైభవంగా జరుపుకొనేందుకు జిల్లాలోని ప్రజలు ఉత్సాహంగా ఎదురు చూస్తున్నారు. దీపావళి అంటే మోతమోగించే టపాసులు ఉండాల్సిందే. విజయవాడ నగర శివారు పెనమలూరు మండలం, కానూరు గ్రామంలో దీపావళి టపాసుల అమ్మకపు స్టాళ్లను ఏర్పాటు చేశారు.

శత్రువులతో చేతులు కలిపి అన్నపై కుట్రలా..?

» జగన్ బెయిల్ రద్దు కోసమే ఇదంతా చేస్తున్నారు

» షర్మిలపై విజయసాయిరెడ్డి ఆరోపణ



హైదరాబాద్ సిటీ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): శత్రువులతో చేతులు కలిపి అన్న జగన్‌పై కుట్రలు పన్నడం ఎవరి కోసమని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను వైసీపీ ఎంపీ విజయసాయి రెడ్డి ప్రశ్నించారు. తండ్రి మరణానికి కారణమైన చంద్రబాబు, కాంగ్రెస్‌తో చేతులు కలపడం అత్యంత బాధాకరమన్నారు. జగన్ బెయిల్‌ను రద్దు చేయించేందుకు ఇదంతా చేస్తున్నారని ఆరోపించారు. అన్నను వేటాడి, వెంటపడి విషపు కాటు వేసే చెల్లెమ్మను ఎక్కడా చూడలేదన్నారు. ఆదివారమిక్కడ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. షర్మిలది ఆస్తి తగాదా కాదని, అధికారం కోసం తగాదా అని అన్నారు. శత్రువులకు మేలు చేసేందుకు సొంత అన్నకు అన్యాయం చేసే వాళ్లను తానెక్కడా చూడలేదన్నారు. వైఎస్ చనిపోవడానికి కారకులెవరో గుండెపై చేయి వేసుకుని చెప్పాలని షర్మిలను డిమాండ్ చేశారు. తల్లిని, చెల్లిని కోర్టుకు ఈడ్చారని అంటున్నారని.. దీనికి వంద శాతం కారణం షర్మిల కాదా అని ప్రశ్నించారు. షేర్ సర్టిఫికెట్లు లేకుండా, అన్న సంతకాలు లేకుండా, గిఫ్ట్ డీడ్ లేకుండా, దొంగ సంతకాలతో ఎలా షేర్లు బదిలీ చేసుకున్నారని అడిగారు. 'మీరు ఎవరి కోసం కన్నీళ్లు పెట్టుకున్నారు..? ఆ కన్నీళ్లకు విలువ లేదు.. వైఎస్ ఆత్మ క్షోభిస్తుంది' అని వ్యాఖ్యానించారు. సీఎం చంద్రబాబు ఎజెండా ప్రకారం జగన్‌ను జైలుకు పంపించేందుకు షర్మిల, ఆయన ఒక్కటయ్యారని ప్రజలు భావిస్తున్నారని చెప్పారు. జగన్, షర్మిల మధ్య జరిగిన అన్ని విషయాలూ తనకు తెలుసని, ఇప్పటికైనా చంద్రబాబుతో కలిపిన చేతులు విడదీయాలని సూచించారు. ఈ ఎపిసోడ్‌కు ముగింపు పలకాలన్నారు.

బాబు వదిలిన విషపు బాణమే షర్మిల: భూమన

తిరుపతి, అక్టోబరు 27: చంద్రబాబు వదిలిన విషపు బాణమే షర్మిల అని టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి ఆరోపించారు. ఆమెలాంటి చెల్లెలు జగన్‌కు ఉండడం బాధాకరమని తెలిపారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డిని ప్రజల గుండెల నుంచి తుడిచేయాలని చూసే టీడీపీతో ఆమె కుమ్మక్కు కావడం దారుణమన్నారు. జగన్‌ను సర్వనాశనం చేయాలనే ఇలా చేస్తున్నారని చెప్పారు. 'రాజశేఖర్‌రెడ్డి అనుచరులు ఏ ఒక్కరూ షర్మిల వెనుక నడవలేదు. అంతా జగన్ వెనుకే నడిచారు. ఇవన్నీ గ్రహించిన షర్మిల తెలంగాణకు వెళ్లారు. చివరకు కాంగ్రెస్‌లోనూ ఆమెకు మద్దతులేదు. అన్ని విధాలా ఒంటరి అయ్యారు' అని వ్యాఖ్యానించారు. కాగా.. జగన్‌పై షర్మిల వ్యాఖ్యలు కూటమి కుట్రగానే కనిపిస్తోందని వైసీపీ ఎమ్మెల్సీ మధుసూదన్ తిరుమలలో అన్నారు. ఆమెను ప్రోత్సహిస్తూ జగన్‌ను నష్టపరిచేందుకు కూటమి ప్రయత్నిస్తోందని తెలిపారు.

జంతర్‌మంతర్

జగన్మాయ!

(మొదటి పేజీ తరువాయి)

సొంత మీడియా, ఊరికో ప్యాలస్, వేల కోట్ల వ్యాపార సామ్రాజ్యం నిర్మించుకున్నారు. ఇంతలా అవినీతికి పాల్పడవచ్చని అప్పటి వరకూ మన దేశంలో రాజకీయ వారసులకు బహుశా తెలిసి ఉండకపోవచ్చు. ఆస్తుల కోసం అన్నాచెల్లెళ్లు జగన్, షర్మిల గొడవ పడి రోడ్డుకెక్కడం... జగన్ ఏకంగా తల్లి విజయలక్ష్మిపైనే నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ)లో పిటిషన్ వేయడంతో జగన్ అక్రమాస్తుల విషయం జాతీయ స్థాయిలో చర్చనీయాంశమైంది. నాడు తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఏ స్థాయిలో అవినీతికి పాల్పడ్డారన్నది జనం మరోసారి గుర్తు చేసుకుంటున్నారు. 30 ఏళ్ల రాజకీయాల్లో ఉన్న రాజశేఖర రెడ్డి కుటుంబ ఆస్తులు ఆనాడు రూ.2 కోట్లు దాటలేదు. 2004 నాటికి జగన్ సంపద అంతంతే. కానీ, రాజశేఖర రెడ్డి సీఎం అయ్యాక అనూహ్యంగా జగన్ సంపద పెరిగింది. ఏ వ్యాపారం చేసి ఇంత సంపాదించారో ఎవరికీ అంతుపట్టదు. తండ్రి ముఖ్యమంత్రి పదవిని అడ్డుపెట్టుకుని ఐదేళ్లలోనే ఊహించని స్థాయిలో అక్రమార్జనకు పాల్పడ్డారు. నాడు జగన్ క్విడ్ ప్రోకో, అక్రమాలకు పాల్పడిన తీరును సీబీఐ కోర్టుకు సమర్పించిన చార్జిషీట్లలో క్షుణ్ణంగా ప్రస్తావించింది.



2009 ఎన్నికల అఫిడవిట్ ప్రకారం జగన్ ఆస్తులు రూ.77.4 కోట్లు. 2011 ఉప ఎన్నికల్లో తన పేరు మీద రూ.365 కోట్లు, భార్య భారతి పేరు మీద రూ.47.25 కోట్లు ఉన్నట్టు పేర్కొన్నారు. 2014లో జగన్ మొత్తం చరాస్తులు రూ.313 కోట్లు, భారతి ఆస్తుల విలువ రూ.57 కోట్లు. జగన్ స్థిరాస్తులు రూ.30 కోట్లు కాగా భారతి ఆస్తుల విలువ రూ.14 కోట్లు. 2011 అఫిడవిట్‌లో జగన్ పేరిట కేజీకి పైన బంగారం, భారతి పేరిట 9 కేజీలకు పైగా బంగారం, వజ్రాభరణాలు ఉన్నట్లు పేర్కొన్నారు. 2014లో జగన్ ఆస్తులు రూ.344 కోట్లుగా, భార్య ఆస్తులు రూ.72 కోట్లుగా చూపారు.

అఫిడవిట్లలోని ఆస్తుల వివరాలు

భారతి పేరిట రూ.5.86 కిలోల బంగారం (అప్పుడు మార్కెట్ విలువ రూ.3.57 కోట్లు), ఇద్దరు కుమార్తెలు హర్షినికి 4.19 కిలోల బంగారం, వర్షాకు 3.46 కిలోల బంగారం ఉన్నట్టు వెల్లడించారు. ఇక 2019లో జగన్ పేరిట రూ.375 కోట్లు, భారతి పేరిట రూ.124 కోట్ల ఆస్తులు ఉన్నట్టు పేర్కొన్నారు. ఇద్దరు కుమార్తెల ఆస్తుల విలువ రూ.6.5 కోట్లు, రూ.4.6 కోట్లుగా ఉన్నట్టు వెల్లడించారు.

గత 20 ఏళ్లలో జగన్ ఆస్తులు ఇబ్బడిముబ్బడిగా పెరిగాయి. 2004లో సమర్పించిన ఐటీ రిటర్నులో ఆయన నికర ఆస్తుల విలువ రూ.1.74 కోట్లుగా చూపించారు. 2004లో రాజశేఖర రెడ్డి సమర్పించిన ఎన్నికల అఫిడవిట్ ప్రకారం జగన్ ఆస్తి రూ.9.18 లక్షలు మాత్రమే. అయితే 2009 ఎన్నికల అఫిడవిట్‌లో జగన్ తన ఆస్తిని రూ.77.39 కోట్లుగా చూపించారు. దీన్నిబట్టి తండ్రి అధికారంలో ఉన్నప్పుడు జగన్ భారీగా ఆస్తులు కూడబెట్టినట్టు తెలుస్తోంది.

20 ఏళ్లలో ఎన్ని రెట్లో...

తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకుని బడా వ్యక్తులకు రాష్ట్రవనరులను దోచిపెట్టి, వారి నుంచి ప్రతిఫలంగా తన కంపెనీల్లోకి పెట్టుబడులు పెట్టించారు. అక్రమ ప్రతిఫలాలతో చేసిన వ్యాపారాలతో ఆస్తుల విలువ 2011 నాటికి రూ.445 కోట్లకు చేరింది. 2014 ఎన్నికల అఫిడవిట్‌లో ఆస్తుల విలువ (416 కోట్లు) స్వల్పంగా తగ్గినట్టుగా చూపించారు. అయితే 2019 అఫిడవిట్‌లో ఆస్తులు రూ.510 కోట్లకు పెరిగినట్టు చూపించారు. ఆ ఏడాది సీఎంగా అధికారం చేపట్టిన తర్వాత ఆస్తుల విలువ రూ.757 కోట్లకు పెరిగింది. జగన్ కుటుంబం మరిన్ని కొత్త కంపెనీల్లో పెట్టుబడులు పెట్టింది. 2008-09లో జగన్ రూ.2.92 కోట్ల ఆదాయ పన్ను చెల్లించారు. 2010-11 ఆర్థిక సంవత్సరం మొదటి 6 నెలల్లో కనీసం రూ.22 కోట్ల పన్ను చెల్లించాల్సి ఉంటుందని అంచనా వేసి రూ.6.6 కోట్ల అడ్వాన్స్ చెల్లించారు.

జగన్ సీఎం అయ్యాక...

2024 ఎన్నికల అఫిడవిట్ ప్రకారం జగన్ పేరిటే రూ.529.87 కోట్ల విలువైన స్థిర,చరాస్తులున్నాయి. జగన్ కుటుంబం మొత్తం ఆస్తుల విలువ రూ.757.65 కోట్లు. వీటిలో అత్యధికం వివిధ కంపెనీల్లో వాటాలు, పెట్టుబడుల రూపంలో ఉన్నాయి. 2019లో జగన్ ఆస్తులు రూ.375.20 కోట్లు కాగా, గత ఐదేళ్లలో ఆయన ఆస్తుల విలువ రూ.154.67 కోట్లు అంటే.. 41.22 శాతం పెరిగింది. 2019లో జగన్ కుటుంబం మొత్తం ఆస్తుల విలువ రూ.510.38 కోట్లు ఉండగా, ఐదేళ్లలో రూ.247.27 కోట్లు అంటే 48.45 శాతం పెరిగింది. 2024 అఫిడవిట్‌లో జగన్, ఆయన కుటుంబీకులకు వివిధ కంపెనీల్లో పెట్టుబడులు ఉన్నట్టు పేర్కొన్నారు. జగన్‌కు 7 కంపెనీల్లో, భారతికి 22 కంపెనీల్లో, వాళ్ల కుమార్తెలు హర్షిణి రెడ్డికి 7 కంపెనీల్లో, వర్షారెడ్డికి 9 కంపెనీల్లో పెట్టుబడులున్నట్టు చూపారు. వీరందరికీ కలిపి కంపెనీల్లో రూ.344.37 కోట్ల విలువైన పెట్టుబడులున్నాయి. జగన్ పేరిట 7 కంపెనీల్లో 263.64 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లు ఉన్నాయి. రిలయన్స్, జియో ఫైనాన్స్‌లో భారతికి పెట్టుబడులున్నట్టు చూపారు. ఆమె పేరిట రూ.69.42 కోట్ల పెట్టుబడులు, 11 కంపెనీల్లో రూ.53.84 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లు ఉన్నాయి. సండూర్ పవర్, సరస్వతీ పవర్, కీలాన్ టెక్నాలజీస్, క్లాసిక్ రియాలిటీ, సిలికాన్ ఇన్‌ఫ్రా, సిలికాన్ బిల్డర్స్, హరీష్ ఇన్‌ఫ్రా, ఆకాశ్ ఎస్టేట్స్, భారతీ సిమెంట్స్, రేవన్ ఇన్‌ఫ్రా, యుటోపియా ఇన్‌ఫ్రా కంపెనీల్లో షేర్లు ఉన్నాయి. మకరియోస్ ఎల్‌ఎల్‌పీ, భగవతి సన్నిధి ఎస్టేట్స్ ఎల్‌ఎల్‌పీల్లో రూ.13.94 కోట్ల విలువైన పెట్టుబడులతో పరిమిత భాగస్వామ్యం ఉంది. రిలయన్స్ ఇండస్ట్రీస్, జియో ఫైనాన్షియల్స్, ఎన్‌ఎండీసీ, ఏషియన్ పెయింట్స్, కోల్గేట్ పామోలివ్, ఓఎన్‌జీసీ, సెయిల్, అల్ట్రాటెక్ సిమెంట్ లిమిటెడ్‌లో రూ.1.52 కోట్ల పెట్టుబడులున్నాయి. రూ.75.01 లక్షల విలువైన సావరిన్ గోల్డ్ బాండ్లు ఉన్నట్టు అఫిడవిట్‌లో చూపారు.



బంగారం, వజ్రాభరణాలు

2019లో భారతి పేరిట రూ.3.57 కోట్ల విలువైన 5,862.818 గ్రాముల బంగారం, వజ్రాభరణాలు ఉండేవి. 2019 నుంచి 2024 మధ్యకాలంలో అరకిలో పైనే బంగారు, వజ్రాభరణాలు పెరిగాయి. భారతి పేరిట రూ.5.29 కోట్ల విలువ చేసే 6,427.79 గ్రాముల బంగారం, వజ్రాభరణాలు, హర్షిణి పేరిట రూ.4.43 కోట్ల విలువైన 4,187.19 గ్రాములు, వర్షా పేరిట రూ.4.46 కోట్ల విలువైన 3,457.33 గ్రాముల బంగారం, వజ్రాభరణాలున్నాయి. జగన్‌కు ఆభరణాలేమీ లేవు.

కుమార్తెల పేరిట పెట్టుబడులు

జగన్ కుమార్తెలు వైఎస్ హర్షిణి రెడ్డి, వైఎస్ వర్షా రెడ్డి పేరిట రెండు కంపెనీల్లో పెట్టుబడులున్నాయి. హర్షిణిరెడ్డికి రూ.10.16 కోట్లు, వర్షారెడ్డికి రూ.9.95 కోట్ల పెట్టుబడులున్నాయి. మకరియోస్ ఎల్‌ఎల్‌పీ, భగవత్ సన్నిధి ఎస్టేట్స్ ఎల్‌ఎల్‌పీల్లో హర్షిణి, వర్షాలకు చెరో రూ.7.48 కోట్ల విలువైన పరిమిత భాగస్వామ్య పెట్టుబడులున్నాయి. హర్షిణికి కీలాన్ టెక్నాలజీస్‌లో రూ.2.38 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లు ఉన్నాయి. ఎస్‌బీఐ, సనోఫి ఇండియా, ఏషియన్ పెయింట్స్, గ్లాక్సో స్మిత్‌క్లైన్ ఫార్మాలో రూ.26.17 లక్షల విలువైన ఈక్విటీ షేర్లున్నాయి. వర్షాకు కీలాన్ టెక్నాలజీస్‌లో రూ.2.38 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లు, జెన్సర్ టెక్, సనోఫీ ఇండియా, ఏషియన్ పెయింట్స్, గ్లాక్సోస్మిత్‌క్లైన్ ఫార్మా, రిలయన్స్ ఇండస్ట్రీస్, జియో ఫైనాన్షియల్స్‌లో రూ.19.61 లక్షల విలువైన ఈక్విటీ షేర్లు ఉన్నాయి. హర్షిణికి రూ.1.31 కోట్లు, వర్షాకు రూ.1.54 కోట్ల విలువైన విదేశీ ఆస్తులున్నాయి.

కంపెనీల లోగుట్టు

(రేపటి సంచికలో..)

జగన్ విషనాగు

(మొదటి పేజీ తరువాయి)

వేయలేదా? ఇది మీ చేతకానితనానికి నిదర్శనం కాదా' అని ధ్వజమెత్తారు. రాజశేఖర్‌రెడ్డి మరణానికి కాంగ్రెస్ ముమ్మాటికీ కారణం కాదన్నారు. కాంగ్రెస్‌ను ఆయన రెండు సార్లు అధికారంలోకి తీసుకొచ్చారని.. బంగారు బాతును ఎవరూ చంపుకోరని.. సొంత కళ్లను ఎవరూ పొడుచుకోరని స్పష్టం చేశారు. వైఎస్ మరణం తర్వాత చార్జిషీటులో ఆయన పేరు చేర్పించింది జగన్ కాదా అని ప్రశ్నించారు. 'కేసుల నుంచి బయటపడేందుకు పొన్నవోలు సుధాకర్‌రెడ్డి (సీనియర్ న్యాయవాది)తో కలిసి ఈ కుట్ర చేయలేదా? కుట్ర చేయకపోతే జగన్ సీఎం అయిన వెంటనే అదనపు అడ్వకేట్ జనరల్ పదవి ఆయనకు ఎందుకిచ్చారు' అని దుయ్యబట్టారు. జగన్‌కు ఇంకా చంద్రబాబు పిచ్చి వీడినట్లు లేదని అన్నారు. 'ఇప్పటికీ అద్దంలో చూసుకున్నా.. బాబే కనిపిస్తున్నట్లుంది' అని ఎద్దేవాచేశారు. బాబు కళ్లలో ఆనందం చూడడానికో.. ఆయన బ్రాండింగ్‌ను ఫాలో అవ్వడానికో.. ఆయన్ను ఇంప్రెస్ చేయడానికో పనిచేయాల్సిన అవసరం వైఎస్ బిడ్డకు ఎప్పటికీ రాదన్నారు.

నాన్న పిలిచినట్లే పెళ్లికి నేనూ పిలిచా..

చంద్రబాబుతో తనకు వ్యక్తిగత సంబంధాలూ లేవని షర్మిల స్పష్టం చేశారు. రాజశేఖర్‌రెడ్డి తన బిడ్డ (షర్మిల) పెళ్లికి ఆయన్ను పిలిచారని, అదే విధంగా తానూ తన కుమారుడి వివాహానికి పిలిచానని తెలిపారు. 'ప్రతిపక్ష నేతను పెళ్లికి ఆహ్వానిస్తే నా చీర గురించి కూడా విపరీత అర్థాలు తీసే మీలాంటి వాళ్లకు సభ్యత, సంస్కారం ఉందని ఎలా అనుకోవాలి' అని వ్యాఖ్యానించారు. విజయసాయిరెడ్డి చదివింది జగన్ స్క్రిప్టు కాదని ప్రమాణం చేయగలరా అని ప్రశ్నించారు. 'ఆస్తుల్లో నలుగురు చిన్న బిడ్డలకు(మనుమడు, మనుమరాళ్లకు) సమాన వాటా ఉంటుందన్న రాజశేఖర్‌రెడ్డి ఆదేశం అబద్ధమని మీ బిడ్డలపై ప్రమాణం చేస్తారా? మీరు కూడా జగన్ మోచేతి నీళ్లు తాగిన వాళ్లే! రాజకీయంగా, ఆర్థికంగా ఆయన వల్ల బలపడినవాళ్లే. ఇలా కాకపోతే ఎలా మాట్లాడుతారులే' అని ఆక్షేపించారు.

జగన్‌కు డబ్బు, అధికార పిచ్చి

» వాటి కోసం ఎంతకైనా దిగజారతాడు: తులసిరెడ్డి

వేంపల్లె, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): జగన్‌కు డబ్బు పిచ్చి, అధికార పిచ్చి ఉన్నాయని, వాటి కోసం ఎంతకైనా దిగజారతాడని ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి విమర్శించారు. కడప జిల్లా వేంపల్లెలో ఆదివారం మాట్లాడుతూ వైఎస్ మరణం వెనుక రిలయన్స్ అధినేత ముఖేశ్ అంబానీ కుట్ర ఉందని అప్పట్లో వైఎస్ అభిమానులను జగన్ రెచ్చగొట్టడంతో వారు రిలయన్స్ ఆస్తులపై దాడులు చేసి విధ్వంసం సృష్టించారన్నారు. అధికారంలోకి వచ్చాక అదే అంబానీకి జగన్ ఘనస్వాగతం పలికి విందు భోజనం పెట్టాడని, ఆయన సిఫారసు చేసిన పారిశ్రామికవేత్త పరిమళ్ నత్వానీకి రాజ్యసభ సీటు ఇచ్చాడని గుర్తుచేశారు. ఆస్తి కోసం కన్నతల్లినే కోర్టుకీడ్చాడన్నారు. చంద్రబాబు రాసిచ్చిన స్క్రిప్ట్ షర్మిల చదువుతోందని వైసీపీ నేత లు వ్యాఖ్యానించడం హాస్యాస్పదమన్నారు. ఆ మాటకొస్తే బీజేపీ రాసిచ్చిన స్క్రిప్టులు చదివే అలవాటు వైసీపీకి ఉందని విమర్శించారు. బీజేపీ చేతిలో టీడీపీ, వైసీపీ, జనసేన కీలుబొమ్మలన్నారు. ఏపీలో బీ అంటే బాబు, జే అంటే జగన్, పీ అంటే పవన్ అని అందరికి తెలుసని చెప్పారు. వైసీపీ నేతలు పసలేని మాటలు మాట్లాడొద్దని సూచించారు.

తల్లీచెల్లిని కోర్టుకీడ్చి రాక్షసానందం

» జగన్ కుటుంబంలో మహిళల ఆవేదనను రాష్ట్రమంతా చూస్తోంది

» చంద్రబాబు తండ్రి ఆస్తులతోపాటు తన కష్టార్జితాన్నీ చెల్లెళ్లకు పంచారు

» వైసీపీ నేతలది పిచ్చివాగుడు: పట్టాభి ఫైర్



అమరావతి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): చంద్రబాబు చేతిలో వైఎస్ షర్మిల కీలుబొమ్మ అని వైసీపీ నేతలు మాట్లాడటంపై టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్న అన్యాయం చేశాడని జగన్ సోదరిలాగా.. చంద్రబాబు సోదరీమణులు ఏనాడూ విలపించలేదన్నారు. కన్నతల్లిని, తోడబుట్టిన చెల్లిని బజారుకీడ్చి, కోర్టు బోను ఎక్కించి, వారిని మానసిక క్షోభకు జగన్ గురి చేస్తున్నాడని విమర్శించారు. జగన్ కుటుంబంలో మహిళల ఆవేదనను రాష్ట్రం మొత్తం చూస్తోందన్నారు. ఆదివారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ తాడేపల్లి ప్యాలెస్‌లో ఊడిగం చేసే వైసీపీ నేతలు సజ్జల రామకృష్ణారెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, విజయసాయిరెడ్డి, కరుణాకర్‌రెడ్డి పిచ్చివాగుడు వాగుతున్నారని మండిపడ్డారు. 2019లో జగన్, షర్మిల మధ్య ఒక ఒప్పందం జరిగిందని, దానికి కట్టుబడకుండా, తనపై, తన తల్లిపై కేసు పెట్టారని షర్మిల మీడియా ముందు చెప్పారు. అన్నాచెల్లెలు ఒప్పందం చేసుకున్నట్టు చంద్రబాబుకు ఏమైనా చెప్పారా? చంద్రబాబును మధ్యవర్తిగా పెట్టి ఒప్పందం చేసుకున్నారా? మీ ఒప్పందాలకూ, చంద్రబాబుకూ సంబంధం ఏంటీ? తల్లీచెల్లిపై కోర్టులో పిటిషన్ వేయమని జగన్‌కు చంద్రబాబు చెప్పారా? మరి చంద్రబాబుపై పడి ఎందుకు ఏడుస్తున్నారు? జనం ఏమైనా గొర్రెలు అనుకుంటున్నారా? ఆస్తి వ్యవహారాలను రచ్చకీడ్చి, తల్లినీ, చెల్లినీ కోర్టుకు లాగింది జగన్ కాదా? కొద్దిగైనా బుద్ధిజ్ఞానం లేకుండా విజయసాయిరెడ్డి, కరుణాకర్‌రెడ్డి మాట్లాడటం ఏంటీ? తల్లినీ, చెల్లినీ కోర్టుకు ఈడ్చి రాక్షసానందం పొందుతున్న జగన్‌ని అడగండి. ఎవరైనా తల్లినీ, చెల్లినీ కోర్టుకు ఈడ్చుతారా? అని. లేదా తాడేపల్లి ప్యాలెస్‌లో స్క్రిప్టులు రాసే జీతగాడిని అడగండి. అంతే, కానీ మతిలేకుండా మాట్లాడతారా? తిరుపతి దొడ్డాపురం వీధిలో చిన్న ఇంట్లో అద్దెకుండే కరుణాకర్‌రెడ్డి దేవుడి సొమ్ములు కొట్టేసి, టీడీఆర్ బాండ్ల స్కామ్ చేసి, వేల కోట్లు కూడబెట్టింది నిజం కాదా? వైవీ సుబ్బారెడ్డి కుటుంబం ఒమిడికలొద్ది లేటరైట్ పేరుతో బాక్సైట్ దోపిడీ చేసింది నిజం కాదా? విజయసాయిరెడ్డి సూట్‌కేసు కంపెనీలు పెట్టించి, విశాఖలో భూములు కబ్జా చేయించి, గిరిజన మహిళ కుటుంబంలో చిచ్చు పెట్టింది నిజం కాదా? తండ్రి అధికారం, తన అధికారం అడ్డుపెట్టుకుని, ప్రజాసంపదను దోచుకుని 2003లో రూ.9లక్షల ఆదాయ పన్ను కట్టిన జగన్ ఇంతలోనే లక్షల కోట్లు ఎలా సంపాదించారు? జగన్ చెమటోడ్చి, తన మేధస్సుతో సంపాదించిన సొమ్మును షర్మిల ఎలా అడుగుతుందని బ్లూ మీడియాలో రాస్తున్నారు. ఏ కష్టం చేసి జగన్ లక్షల కోట్లు సంపాదించారు? జగన్ ప్రకటించిన ఆస్తులే రూ.800 కోట్లు. వైఎస్సార్ సీఎం కాకముందు జగన్ ఏ వ్యాపారం చేశాడు? జగన్‌కు 29 ఏళ్లు వచ్చేదాకా పనీపాటా లేకుండా తిరిగేవాడు. చదువు కోసం అమెరికా పంపిస్తే.. పారిపోయి వచ్చాడు. తండ్రి సీఎం అయ్యాక పెట్టుబడుదారులను బ్లాక్ మెయిల్ చేసి, క్విడ్‌ప్రోకో ద్వారా కోట్లు దోచుకున్నాడు. సీఎం అయ్యాక అధికారాన్ని అడ్డం పెట్టుకుని, వ్యాపార సామ్రాజ్యాన్ని నిలబెట్టుకుంటూ ప్రజాధనాన్ని దోచుకున్నాడు. చంద్రబాబు అధికారాన్ని అడ్డంపెట్టుకుని ఏనాడూ వ్యాపారం చేయలేదు. హెరిటేజ్ సంస్థను అధికారంలో లేనప్పుడు పెట్టారు. భువనేశ్వరి, బ్రాహ్మణి తమ మేధస్సుతో వ్యాపారాన్ని నిలబెట్టుకున్నారు. తన తండ్రి ఇచ్చిన ఆస్తులనే కాదు, తన కష్టార్జితాన్ని కూడా చంద్రబాబు తన చెల్లెళ్లకు ఇచ్చారు' అని పట్టాభిరామ్ అన్నారు.

జగన్‌కు సలహాదారును!

» అందుకే సజ్జల, పీఎస్ఆర్ ఆదేశాలతో నాకు గన్‌మెన్‌ను ఇచ్చారు: బోరుగడ్డ

» పాత కారు అమ్మితే వచ్చిన డబ్బులతో సెకండ్ హ్యాండ్ ఓల్గార్స్ కారు కొన్నా

» బాబుప్రకాశ్ ఎవరో నాకు తెలియదు

» పోలీసుల విచారణలో అనిల్ వెల్లడి



గుంటూరు అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): అప్పటి ముఖ్యమంత్రి జగన్‌కు తాను సలహాదారుగా ఉన్నానని రౌడీ షీటర్ బోరుగడ్డ అనిల్‌కుమార్ వెల్లడించాడు. అందువల్లే నాటి ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, అప్పటి నిఘా చీఫ్ పీఎస్ఆర్ ఆంజనేయులు ఆదేశాలతో తనకు గన్‌మెన్ సౌకర్యం కల్పించారని చెప్పాడు. గుంటూరులో ఏఈఎల్‌సీ చర్చి కోశాధికారి కర్లపూడి బాబు ప్రకాశ్‌ను బెదిరించి రూ.50 లక్షలు డిమాండ్ చేశారన్న కేసులో నిందితుడిగా ఉన్న బోరుగడ్డను అరండల్‌పేట పోలీసులు ఆదివారం విచారించారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. ఏ హోదాలో నీకు ప్రభుత్వం గన్‌మెన్ సౌకర్యం కల్పించిందని పోలీసులు ప్రశ్నించగా.. అనిల్ పై విధంగా జవాబిచ్చాడు. రూ.80 లక్షల ఖరీదైన ఓల్గార్స్ కారు ఎలా వచ్చింది.. చాలా మంది చర్చి పాస్టర్లను బెదిరించి డబ్బులు వసూలు చేసినట్లు వచ్చిన ఆరోపణల గురించి అడుగగా.. తన పాత కారు అమ్మగా వచ్చిన రూ.28 లక్షలతో పాటు తన ఐదుగురు సిస్టర్స్ ఇచ్చిన డబ్బులతో రూ.45 లక్షలతో సెకండ్ హ్యాండ్ ఓల్గార్స్ కారు కొన్నానని అనిల్ చెప్పాడు. ఆ కారును తన తల్లికి గిఫ్టుగా ఇచ్చామన్నాడు. తాను ఎవరినీ బెదిరించలేదని.. తనపై ఫిర్యాదు చేసిన బాబుప్రకాశ్ ఎవరో కూడా తనకు తెలియదని చెప్పాడు. ముందుగా 50 లక్షలు డిమాండ్ చేసి ఆ తర్వాత బాబుప్రకాశ్ కార్యాలయానికి వెళ్లి కత్తితో బెదిరించి తెచ్చుకున్న రూ.లక్షను ఏం చేశావని పోలీసులు ప్రశ్నించారు. ఆయనెవరో తెలియనప్పుడు రూ.లక్ష ఎలా ఇస్తాడని అనిల్ వ్యాఖ్యానించాడు. ఎవరో తెలియనప్పుడు నీపై ఫిర్యాదు చేయాల్సిన అవసరం ఏమిటి.. అందులోనూ వైసీపీ ప్రభుత్వ హయాంలోనే ఫిర్యాదు చేశాడు కదా అని ప్రశ్నించగా.. వైసీపీలో దళిత వర్గం నుంచి తాను ఎదగడం చూసి ఓర్చుకోలేక తప్పుడు ఫిర్యాదు చేసి ఉంటాడని అనిల్ చెప్పాడు.

వైద్య పరీక్షల కోసం జీజీహెచ్‌కు

గ్యాస్ ట్రబుల్ తో ఇబ్బంది పడుతున్న బోరుగడ్డను అరండల్‌పేట పోలీసులు ఆదివారం రాత్రి వైద్య పరీక్షల నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. అతడిని పరీక్షించిన వైద్యులు.. ఇతరత్రా అనారోగ్య సమస్యలు ఏమి లేవని, గ్యాస్ట్రిక్ ట్రబుల్ మాత్రమే ఉందని గుర్తించి అందుకు అవసరమైన టాబ్లెట్స్ ఇచ్చారు. దీంతో అతడిని తిరిగి అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మూడ్రోజుల కస్టడీలో భాగంగా సోమవారం కూడా అతడిని విచారించనున్నారు.



సరస్వతి పవర్ భూముల్లో కొనసాగిన సర్వే

పల్నాడు జిల్లాలోని తంగెడ, చెన్నాయపాలెం గ్రామాల మధ్య అటవీ భూముల్లో సర్వే చేస్తున్న అటవీశాఖ అధికారులు

దాచేపల్లి/మాచవరం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాలతో జగన్‌కు చెందిన సరస్వతి పవర్ కంపెనీ భూముల్లో అటవీశాఖ అధికారులు చేపట్టిన సర్వే రెండో రోజూ కొనసాగింది. పల్నాడు జిల్లా దాచేపల్లి, మాచవరం మండలాల పరిధిలోని చెన్నాయపాలెం, వేమవరం, రేగులగడ్డ, తంగెడ గ్రామాల్లోని అటవీ భూముల్లో సరిహద్దు రాళ్ల ఆధారంగా అటవీ శాఖాధికారులు సర్వే చేశారు. దాచేపల్లి డీఆర్వో విజయలక్ష్మి మాట్లాడుతూ... ఇప్పటి వరకు 12కి.మీ. మేర సర్వే చేశామని, మరో రెండు రోజులపాటు 9కి.మీ. పరిధిలో సర్వే చేస్తామని తెలిపారు. హద్దురాళ్ల ప్రకారం సరస్వతి పవర్ కంపెనీ, అటవీ భూముల మధ్య దూరం ఉందన్నారు. త్వరగా సర్వే పూర్తిచేసి జిల్లా ఉన్నతాధికారులకు తుదినివేదిక అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో వేమవరం ఫారెస్టు బీట్ అధికారి బిల్లల వెంకటేశ్వర్లు, దాచేపల్లి కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'సరస్వతి'కి 'భూ'కంపం!

» కంపెనీ కోసం వైఎస్ కుటుంబం తీసుకున్న భూములు తిరిగి ఇచ్చేయాలని రైతుల పట్టు

» మా భూములు ఇచ్చేస్తే సాగు చేసుకుంటాం

» కాకుంటే పరిశ్రమ నిర్మించి ఉపాధి కల్పించాలి

» మీడియాతో సరస్వతి భూ బాధితుల ఆవేదన



చెన్నాయపాలెంలో మీడియాతో మాట్లాడుతున్న 'సరస్వతి' భూ బాధితులు

మాచవరం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): సరస్వతి పవర్ అండ్ ఇండస్ట్రీస్ కోసం వైఎస్ కుటుంబం రైతులు, ఇతర వ్యక్తుల నుంచి తీసుకున్న భూముల వ్యవహారం వివాదంగా మారింది. 15 ఏళ్ల కిందట తమ నుంచి కొనుగోలు చేసిన భూముల్లో సిమెంటు పరిశ్రమను ఏర్పాటు చేస్తామని చెప్పారని, అదేవిధంగా తమకు ఉపాధి కూడా కల్పిస్తామని హామీ ఇచ్చారని 'సరస్వతి' కోసం భూములు ఇచ్చిన పల్నాడు జిల్లా మాచవరం మండలం చెన్నాయపాలెం గ్రామానికి చెందిన చెబుతున్నారు. కానీ, ఇప్పటి వరకు పరిశ్రమ ఏర్పాటు చేయకపోగా, తమకు ఉపాధి కూడా కల్పించలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తమ భూములు తమకు ఇచ్చేయాలని వారు పట్టుబడుతున్నారు. లేకపోతే.. ప్రస్తుత ధర ప్రకారం ఎకరానికి రూ.18 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పరిశ్రమను ఏర్పాటు చేయాలన్న ఉద్దేశం ఉంటే తక్షణమే పరిశ్రమ ఏర్పాటు చేసి తమకు ఉపాధి కల్పించాలని కోరుతున్నారు. ఈ మేరకు ఆదివారం భూములు ఇచ్చిన రైతులు, స్థానికులు మీడియాతో మాట్లాడారు. "మీ గ్రామాన్ని అన్ని విధాలా ఆదుకుంటాం. గ్రామంలో మౌలిక వసతులు కల్పిస్తాం. అర్హతలు ఉన్న వారికి పరిశ్రమలో ఉద్యోగావకాశాలు కల్పిస్తాం. భూములు ఇచ్చిన రైతుల కుటుంబాలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తాం. అని అనేక హామీలు ఇచ్చారు. 15 ఏళ్ల కిందట అతి తక్కువ ధరలకే మా నుంచి భూములు కొనుగోలు చేశారు. కానీ, ఇప్పటికీ పరిశ్రమ ఏర్పాటు చేయలేదు" అని వారు తెలిపారు. ఈ నేపథ్యంలో తమ భూములు తిరిగి తమకు అప్పగించాలని కోరారు. భూములు కొని సుమారు 15 ఏళ్లు అవుతున్నా ఇప్పటికీ ఎలాంటి నిర్మాణాలు చేయలేదన్నారు. కానీ, అప్పట్లో రెండు మూడేళ్లలోనే నిర్మాణం చేపడతామని నమ్మబలికారని తెలిపారు. పరిశ్రమను నిర్మిస్తే తమ పిల్లలకు ఉద్యోగావకాశాలు వస్తాయని, తమకు ఉపాధి దొరుకుతుందని, గ్రామం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందని ఆశపడి తక్కువ ధరలకే భూములు ఇచ్చినట్టు చెప్పారు. పరిశ్రమ నిర్మాణం గురించి అడిగితే చూస్తాం, చేస్తాం అని చెప్పటమే కానీ.. నిర్మించింది లేదన్నారు. పరిశ్రమను నిర్మించే వరకు ఎవరి భూములు వారు సాగు చేసుకుంటామని, నిర్మాణం మొదలు పెట్టగానే ఇచ్చేస్తామని తాము చెప్పినా యాజమాన్యం పరిగణనలోకి తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

పొలాల విధ్వంసం

పరిశ్రమను నిర్మించకపోవడంతో కొంత మంది రైతులు ఉపాధి అవకాశాలు దొరక్క 'సరస్వతి'కి ఇచ్చిన భూముల్లో పంటలు సాగు చేశారు. ఇది గమనించిన వైసీపీ నాయకుడు, అప్పటి మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన తమ్ముడు వెంకట రామిరెడ్డి ఆధ్వర్యంలో కడప గూండాలు సుమారు ఐదు వందల మంది ట్రాక్టర్లతో వచ్చి పచ్చని పంట పొలాలను దున్నేసి విధ్వంసం సృష్టించినట్టు రైతులు తెలిపారు. అడ్డు వచ్చిన మహిళా రైతులను విచక్షణా రహితంగా కొట్టి గాయ పరిచారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది తెలుసుకున్న టీడీపీ నేత, గురజాల ప్రస్తుత ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌ను, జిల్లా అధికారులను పిలిపించి నష్టపోయిన రైతులను గుర్తించారు. ఒక్కొక్క ఎకరానికి రూ.16 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. అయితే, రెండు మూడు రోజులుగా వైసీపీ అధినేత జగన్, ఆయన చెల్లెలు వైఎస్ షర్మిల మధ్య సరస్వతి భూముల వ్యవహారంలో విభేదాలు బట్టబయలు కావటంతో ఇక పరిశ్రమ నిర్మాణం చేపట్టరని తేలిపోయినట్టు బాధితులు తెలిపారు. ఈ నేపథ్యంలో తమకు ఆ భూములను తిరిగి ఇస్తే సాగు చేసుకుంటామని చెబుతున్నారు. లేని పక్షంలో ఉద్యమించాల్సి వస్తుందని హెచ్చరించారు.

సాగు చేసుకుంటాం.. అవకాశం ఇవ్వండి



సరస్వతి పరిశ్రమ నిర్మాణం చేపట్టే వరకు మా భూములు సాగు చేసుకొనే అవకాశం కల్పించాలి. భూములు కొనుగోలు చేసి ఏళ్లు గడుస్తున్నా నిర్మాణం చేపట్టలేదు. భూములన్నీ బీడుగా మారాయి. సరస్వతి యాజమాన్యం ఇప్పటికైనా స్పందించి గ్రామస్తులకు అనుకూలమైన నిర్ణయం తీసుకోవాలి.

- బొగ్గవరపు అంజయ్య, మాజీ సర్పంచ్

ఆస్తుల కోసమే భూములు కొన్నారు



పరిశ్రమ నిర్మించి మమ్మల్ని ఉద్ధరిస్తామని నమ్మబలికిన యాజమాన్యం.. ఆస్తులు కూడ బెట్టుకునేందుకే భూములు కొనుగోలు చేశారని అర్థమవుతోంది. గతంలో పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి వ్యతిరేకంగా మాట్లాడినందుకు గత వైసీపీ ప్రభుత్వంలో నన్ను అర్ధరాత్రి కొట్టుకుంటూ తీసుకువెళ్లారు. పరిశ్రమ నిర్మించ కుంటే జిల్లా స్థాయిలో ఉద్యమాలు చేయాల్సిన పరిస్థితులు వస్తాయి.


- యలమంద నాయక్, మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్

సాగర్ నుంచి కొనసాగుతున్న నీటి విడుదల



మాచర్ల రూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ రెండు గేట్ల ద్వారా దిగువకు నీటి విడుదల కొనసాగుతోంది. శ్రీశైలం నుంచి సాగర్‌కు 64,472 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. దీంతో నాగార్జునసాగర్ రెండు క్రస్ట్‌గేట్లను 5 అడుగులు మేర ఎత్తి 16,138 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. నాగార్జునసాగర్ నీటి మట్టం ప్రస్తుతం 589.70 అడుగులు ఉంది. కుడి కాలువ ద్వారా 9,967 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 6,173 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,394, 2 క్రస్ట్‌గేట్ల ద్వారా 16,138 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

గోదావరిపై తేలుతూ తిందాం!



రాజమహేంద్రవరం వద్ద గోదావరిలో ఏర్పాటు చేసిన ఫ్లోటింగ్ రెస్టారెంట్

- రాజమహేంద్రవరంలో 'ఫ్లోటింగ్ రెస్టారెంట్'
- 170 మంది కూర్చునేలా ఏర్పాట్లు
- ప్రారంభించిన పర్యాటక శాఖ మంత్రి దుర్గేశ్

రాజమహేంద్రవరం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): గోదావరిపై ఓవైపు బోటు విహారం.. మరోవైపు అక్కడే ఇష్టమైన ఆహారం తింటూ ఆస్వాదిస్తుంటే ఎలా ఉంటుందో ఒక్కసారి ఊహించుకోండి! ఈ అనుభూతిని 'ఫ్లోటింగ్ రెస్టారెంట్' ద్వారా పొందొచ్చు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం గోదావరిలో రోడ్ కమ్ రైల్వే బ్రిడ్జి, రైల్వే ఆర్చి బ్రిడ్జి మధ్యలోని బ్రిడ్జిలంక వద్ద ఈ ఫ్లోటింగ్ రెస్టారెంట్ ఏర్పాటు చేశారు. దీన్ని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి వాసు, బత్తుల బలరామకృష్ణ ఆదివారం ప్రారంభించారు. స్థానిక పద్మావతి ఘాట్ సమీపంలోని టూరిజం కంట్రోల్ రూమ్ నుంచి బోటులో పయనించి.. గోదావరి మధ్యలోని ఇసుక తిప్పలను ఆనుకుని నీటిలో తేలియాడుతున్న ఈ రెస్టారెంట్ వద్దకు చేరుకోవాలి. ప్రతిరోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం 7 గంటల వరకూ ఇది ఉంటుంది. ఇక్కడ వెజ్, నాన్‌వెజ్ రకాలు అందుబాటులో ఉంటాయి. రెస్టారెంట్‌లో 170 మంది వరకు కూర్చునేలా సిట్టింగ్ సామర్థ్యం ఉంది. సిల్వర్ స్వాన్, ఆహ్వానం కిచెన్ ఫ్రాంచైజీస్ ఆధ్వర్యంలో ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ విధానంలో ఈ రెస్టారెంట్‌ను నిర్వహిస్తున్నారు. దీని కోసం టూరిజం శాఖకు ఏడాదికి రూ.6.5 లక్షల ఆదాయం ఇవ్వనున్నారు.

టూరిజాన్ని అభివృద్ధి చేస్తాం: మంత్రి దుర్గేశ్

రాష్ట్రంలో టూరిజాన్ని అభివృద్ధి చేయాలనే సీఎం సంకల్పంలో భాగంగా ఈ ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి దుర్గేశ్ పేర్కొన్నారు. త్వరలో హేవలాక్ బ్రిడ్జి సమీపంలో కూడా మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. గోదావరి పుష్కరాల నాటికి నదీ తీరాన్ని అందంగా తీర్చిదిద్దుతామన్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.కోటి చెక్కును సీఎం చంద్రబాబుకు అందజేస్తున్న సంజయ్ గోయంకా, ఆశిష్ గోయంకా

300 కోట్ల పెట్టుబడితో '3ఎఫ్' విస్తరణ

- సీఎం చంద్రబాబు వెల్లడి
- వరద బాధితులకు ఆయిల్‌పామ్ కంపెనీ రూ.కోటి విరాళం

అమరావతి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): వరద బాధితుల సహాయార్థం 3ఎఫ్ ఆయిల్‌పామ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.కోటి విరాళంగా ఇచ్చింది. ఆదివారం సీఎం చంద్రబాబును కలిసిన కంపెనీ ఎండీ సంజయ్ గోయంకా, డైరెక్టర్ ఆశిష్ గోయెంకా విరాళం చెక్కు అందజేశారు. వరద బాధితులను ఆదుకొనేందుకు ఉదారంగా రూ.కోటి విరాళం అందించిన ప్రముఖ ఆయిల్‌పామ్ ప్రాసెసింగ్ కంపెనీ 3ఎఫ్‌కు సీఎం చంద్రబాబు ధన్యవాదాలు చెప్పారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు చేశారు. రూ.300 కోట్ల పెట్టుబడితో తూర్పు గోదావరి జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ ఫెసిలిటీతో ఆంధ్రప్రదేశ్‌లో తమ వ్యాపారాన్ని విస్తరించాలని ఈ కంపెనీ యోచిస్తోందని సీఎం పేర్కొన్నారు.

తెలంగాణ నుంచి వచ్చిన ఐఏఎస్‌లకు పోస్టింగులు

- ఆరోగ్య శాఖ కమిషనర్‌గా వాకాటి కరుణ
- ఏపీటీడీసీ ఎండీగా ఆమ్రపాలి..
- వాణీప్రసాద్ కార్మిక శాఖకు.. జీఏడీకి వాణీమోహన్

అమరావతి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ నుంచి ఏపీకి వచ్చిన కొందరు ఐఏఎస్ అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం పోస్టింగులు ఇచ్చింది. ఇందులో వాకాటి కరుణను ఆరోగ్యశాఖ కమిషనర్‌గా, నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) డైరెక్టర్‌గా నియమించారు. ఆమ్రపాలి కాటా రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) వీసీ-ఎండీగా, ఎ.వాణీప్రసాద్ కార్మిక శాఖ, బీమా వైద్య సేవల విభాగం ముఖ్య కార్యదర్శిగా నియమితులయ్యారు. ఆర్కియాలజీ కమిషనర్‌గా ఉన్న వాణీమోహన్‌ను జీఏడీ (జీపీఎం, ఏఆర్) ముఖ్య కార్యదర్శిగా బదిలీ చేశారు. పరిశ్రమలు, వాణిజ్య శాఖ పరిధిలో ఉండే చక్కెర విభాగం బాధ్యతల నుంచి కూడా ఆమెను తప్పించి.. ఆ బాధ్యతలను ఆ శాఖ కార్యదర్శి యువరాజ్‌కు అప్పగించారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీచేశారు.

పంచాయతీరాజ్‌లో..

కాంట్రాక్ట్ ఉద్యోగులకు పండగే!

- 670 మంది వేతన జీవులకు ఊరట
- బకాయిల విడుదల, ఉద్యోగ భద్రతకు ఓకే
- జగన్ హయాంలో నిలిచిపోయిన జీతాలు
- కూటమి సర్కారు వచ్చాక వారికి ఉపశమనం
- ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చొరవతో వేతన బకాయిలు రూ.24 కోట్లు విడుదల

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలోని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు కూటమి ప్రభుత్వం భారీ ఊరట కల్పించింది. జగన్ హయాంలో జీతాలు, ఉద్యోగ భద్రత లేకుండా త్రిశంకుస్వర్గంలో కొట్టుమిట్టాడారు. అంతేకాదు, ఒకానొక దశలో వీరిని తొలగించేందుకు కూడా ప్రయత్నించారు. అయితే, రాష్ట్రంలో కూటమి సర్కారు వచ్చిన తర్వాత ఈ ఉద్యోగుల ఆవేదనను ఆలకించిన ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్.. వీరికి ఉపశమనం కల్పించారు. కాంట్రాక్టు ఉద్యోగులకు నిలిపివేసిన వేతనాలు ఇవ్వాలని నిర్ణయించారు. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి, కమిషనర్ కృష్ణతేజను ఆదేశించడంతో ఉద్యోగులకు పెండింగ్ జీతాలు ఇచ్చే ప్రక్రియ వేగవంతమైంది. అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా పీఆర్ ఇంజనీరింగ్ కార్యాలయాల్లో పనిచేసే సిబ్బందితో పాటు ఈఎన్‌సీ కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించే దిశగా కూడా చర్యలు తీసుకుంటున్నారు. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న పీఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ తదితర సౌకర్యాలను పునరుద్ధరించనున్నారు. తాత్కాలిక ఉద్యోగులుగా ఉన్న వారందరినీ గ్రామీణాభివృద్ధిశాఖ పరిధిలోకి తెచ్చారు. సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ సర్వీస్ సంస్థ పరిధిలో ఉద్యోగులుగా నియమించనున్నారు. ఈ సంస్థ పరిధిలో హెచ్‌ఆర్ పాలసీని అమలు చేయనున్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా తీసుకుని, ఇక నుంచి ప్రతి నెలా జీతం ఇచ్చేలా ఏర్పాట్లు చేశారు. బకాయిల కోసం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ రూ.24 కోట్లు విడుదల చేసింది. దీంతో ఈ విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా పవన్‌కల్యాణ్, కమిషనర్ కృష్ణతేజకు కాంట్రాక్టు ఉద్యోగ సంఘం నేతలు దివాకర్‌బాబు, సురేశ్ కృతజ్ఞతలు తెలిపారు.

ఒత్తిడి నుంచి ఉపశమనం

రాష్ట్రవ్యాప్తంగా ఈఎన్‌సీ ఆధ్వర్యంలో కాంట్రాక్టు విధానంలో టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, అటెండర్లు, స్వీపర్లు సుమారు 670 మంది పనిచేస్తున్నారు. ఉపాధి హామీ పథకంలో మెటీరియల్ పనులు విస్తృతంగా చేపడుతున్న నేపథ్యంలో గతంలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం వారిని కాంట్రాక్టు విధానంలో నియమించింది. గ్రామాల్లో మెటీరియల్ నిధులతో చేపట్టే సిమెంట్‌రోడ్లను పర్యవేక్షించేందుకు వారిని నియమించారు. ఏటా 10 వేల కిలోమీటర్ల మేరకు సిమెంటు రోడ్లు వేస్తుండటంతో అప్పట్లో ఇంజనీర్లకు పనుల ఒత్తిడి పెరిగింది. అందుకే ఎక్కడికక్కడ మండలస్థాయిలోను, ఈఎన్‌సీ కార్యాలయంలోనూ సుమారు 56 మంది సిబ్బందిని నియమించారు. అప్పట్లో ఈఎన్‌సీ కార్యాలయానికి వారి జీతాల కోసం 3 శాతం నిర్వహణా వ్యయం ఇచ్చేవారు. అయితే, వైసీపీ సర్కార్ వచ్చిన తర్వాత పరిస్థితులు మారిపోయాయి. ఉపాధి మెటీరియల్ నిధులను వాడుకోవడంలో అప్పటి సర్కార్ పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. దీంతో పనులే జరగనప్పుడు నిర్వహణ వ్యయం ఎందుకివ్వాలంటూ అప్పటి కమిషనర్ నిలిపేశారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా సిబ్బందికి వేతనాలు అందలేదు. ఉద్యోగులు నిరసన వ్యక్తం చేయడంతో కొంత కాలం పంచాయతీరాజ్ ఇంజనీరింగ్‌శాఖ నిర్వహణ వ్యయం నుంచి జిల్లాల్లో జీతాలు అందించారు. కొన్ని చోట్ల నిర్వహణ వ్యయం చాలినంత లేకపోవడంతో ఇవ్వలేదు. దీంతో ప్రతి నెలా వారికి జీతాలందని పరిస్థితి ఏర్పడింది. గతేడాదిగా మొత్తంగా వారికి జీతాలు అందలేదు. ఈ నేపథ్యంలో జీతాల కోసం ఉద్యోగుల నుంచి ఒత్తిడి పెరిగింది. ఈ పరిణామంతో ఉన్నతాధికారులు ఉద్యోగులను తొలగించాలని సూచించారు. అయితే, ఉన్నపళంగా వారిని తొలగిస్తే నిరసనలు పెరిగిపోతాయని, పైగా ఎన్నికల సమయం కావడంతో వారి జోలికెళ్లవద్దని అప్పట్లో వైసీపీ పెద్దలు చెప్పడంతో అధికారులు మౌనంగా ఉన్నారు. ఎన్నికల్లో వైసీపీ ఓడిపోవడం, కూటమి సర్కార్ రావడం, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆధ్వర్యంలోకి పంచాయతీరాజ్ శాఖ రావడంతో ఉద్యోగులకు ఉపశమనం లభించింది.

జాలి లేని జగన్

జగన్ హయాంలో పంచాయతీరాజ్ కాంట్రాక్టు ఉద్యోగులు తమ జీతాల కోసం అనేక దఫాలు నిరసనలు తెలిపారు. ఇంజనీరింగ్ ఉద్యోగుల అసోషియేషన్ నేతలతో కలిసి గత ఐదేళ్లు పోరాటం చేశారు. ఎన్ని ఉద్యమాలు చేసినా జగన్ ప్రభుత్వం కనికరం చూపకపోవడంతో కోర్టుకెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. కోర్టుల్లో కేసులను కూడా ఏదో ఒక రకంగా అడ్డుకుంటూ కాంట్రాక్టు ఉద్యోగుల పొట్టగొట్టారని పలువురు ఆరోపించారు. ఈ నేపథ్యంలో సిబ్బంది ఉపముఖ్యమంత్రి వద్దకు వెళ్లి తమ గోడును వెళ్లబోసుకున్నారు. ఏడాది పాటు జీతాలు ఇవ్వకపోవడం, అసలు ఉద్యోగాలు ఉన్నాయో? తీసేశారో? అనే సందిగ్ధంలో ఉన్న సిబ్బందికి ఉపముఖ్యమంత్రి స్పష్టమైన హామీ ఇచ్చారు. ఆయన ఆదేశాలతో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు స్పందించారు. ఈ పనులు వేగవంతమై స్పష్టమైన ఆదేశాలు కూడా వెలువడ్డాయి. వచ్చే నెలలో జీతాల బకాయిలు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మిగతా ఉపాధి హామీ పథకం సిబ్బందితో సమానంగా ఉద్యోగ భద్రత కల్పించనున్నారు.

బాంబుల బూచోళ్లు!

- తాజాగా ప్రసిద్ధ గోవిందరాజస్వామి, ఇస్కాన్ ఆలయాల్లో బాంబులని మెసేజ్
- బెంగళూరు పోలీసుల అదుపులో బాధ్యుడు!

తిరుపతి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): నిత్యం వేలాది మంది వచ్చే తిరుపతిని లక్ష్యంగా చేసుకుని బాంబుల బూచోళ్లు చెలరేగుతున్నారు. తిరుపతి విమానాశ్రయంతో పాటు ప్రధాన హోటళ్లకు వారం రోజుల నుంచి తరచూ బాంబు బెదిరింపులు అందుతున్నాయి. తాజాగా ఆదివారం గోవిందరాజస్వామి ఆలయం సహా ఇస్కాన్ టెంపుల్‌కు కూడా బాంబులు పెట్టినట్టు సమాచారం రావడంతో అధికారులు ఉరుకులు పరుగులు పెట్టారు. మరోవైపు ఈ బెదిరింపుల వెనుక ఉన్న బాధ్యులు ఎవరు? వారి ఉద్దేశమేమిటి? అన్న అంశాలపై కూడా దృష్టి సారించారు. తిరుపతి విమానాశ్రయానికి ఈ నెలలోనే మూడుసార్లు బెదిరింపులు వచ్చాయి. తొలుత ఈ నెల 4న స్టార్ ఎయిర్‌లైన్స్ విమానాన్ని పేల్చేస్తామంటూ మెయిల్ అందింది. 22న అదేసంస్థకు మరోసారి బెదిరింపు సందేశం వచ్చింది. 24న స్టార్ ఎయిర్‌లైన్స్, ఇండిగో విమానాలను పేల్చేస్తామంటూ ఎక్స్‌లో బెదిరించారు. దీనిపై ఏర్పేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బెదిరింపు మెయిల్స్ కోల్‌కతాకు చెందిన మిత్ర అనే వ్యక్తి నుంచి వచ్చాయని ప్రాథమికంగా గుర్తించారు. ఆయనను అదుపులోకి తీసుకుని బెంగళూరు తరలించినట్టు సమాచారం. తిరుపతి విమానాశ్రయానికి కూడా అదే వ్యక్తి నుంచి బెదిరింపులు అందినట్టు విచారణలో తేలితే ఏర్పేడు పోలీసులకు విత్రను అప్పగించే అవకాశముందని తెలిసింది.

బాంబు బెదిరింపులతో కలకలం

ఈ నెల24న తిరుపతిలోని రాజ్ పార్క్, రీనెస్ట్, పాయ్ వైస్రాయ్, రిగాలియా తదితర ప్రముఖ హోటళ్ల మేనేజర్లకు బాంబు బెదిరింపుతో కూడిన మెయిల్స్ అందాయి. హుటాహుటిన రంగంలోకి దిగిన పోలీసులు బాంబు డిస్పోజల్, డాగ్ స్క్వాడ్‌లతో తనిఖీలు చేపట్టారు. శనివారం రీనెస్ట్, రాజ్‌పార్కు, పాయ్‌వైస్రాయ్, రిగాలియా, గోవింద హైట్స్ హోటళ్లకు బాంబు బెదిరింపు మెయిళ్లు వచ్చాయి. ఆయా హోటళ్లలోని విదేశీయులు గదులు ఖాళీ చేసి వెళ్లిపోయారు. ఆదివారం రాజ్ పార్కు, రీనెస్ట్, పార్చ్యూన్ కెన్సెస్ హోటళ్లతో పాటు వరాహస్వామి ఆలయం, తీర్థకట్ట వీధిలకు బెదిరింపులు అందాయి. సాయంత్రం ఇస్కాన్ టెంపుల్‌కూ బెదిరింపులు వచ్చాయి.

పబ్లిక్ వైఫైల నుంచేనా?

బాంబు బెదిరింపుల వెనుక బాధ్యులెవరు? ఎక్కడి నుంచి చేస్తున్నారు? ఏ ఉద్దేశంతో చేస్తున్నారు? అనే అంశాలపై తిరుపతి పోలీసులు దృష్టి సారించారు. ప్రాథమిక దర్యాప్తులో ఈ బెదిరింపులన్నీ ప్రాక్సీ యాప్స్ నుంచి వచ్చినట్టు గుర్తించారు. రైల్వే స్టేషన్లు, బస్‌స్టాండ్లలో ఉండే పబ్లిక్ వైఫైల నుంచి పంపించి ఉంటారని భావిస్తున్నారు. ఈ ప్రాక్సీ యాప్‌లను వాడడం వల్ల స్థానికంగానే మెసేజ్‌లు, మెయిళ్లు పంపించినా ఎక్కడో సుదూర దేశాల నుంచి పంపినట్టు చిత్రీకరించే అవకాశముందని పోలీసువర్గాలు చెబుతున్నాయి.

భోగాపురంలో ఏవియేషన్ యూనివర్సిటీ

- విశాఖ నుంచి అంతర్జాతీయ విమాన కనెక్టివిటీ
- కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు
- విశాఖ-విజయవాడ మధ్య 2 కొత్త సర్వీసులు

గోపాలపట్నం (విశాఖ సిటీ), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు చొరవతో త్వరలో భోగాపురంలో ఏవియేషన్ యూనివర్సిటీ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామని కేంద్ర పౌర విమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు చెప్పారు. విశాఖ-విజయవాడ మధ్య ఇండిగో, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ నూతన విమాన సర్వీసులను ఆయన విశాఖ విమానాశ్రయంలో ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విశాఖ నుంచి జాతీయ, అంతర్జాతీయ విమానాల కనెక్టివిటీ కోసం కృషి చేస్తున్నామన్నారు. ఇటీవలే విజయవాడ-ముంబై మధ్య రెండు, విజయవాడ-బెంగళూరు, తిరుపతి-ఢిల్లీ మధ్య ఒక్కో సర్వీసులను ప్రారంభించామని తెలిపారు. డిసెంబరులో తిరుపతి-ముంబై, రాజమహేంద్రవరం-ఢిల్లీ మధ్య కొత్త సర్వీసులు ప్రారంభిస్తామన్నారు. విశాఖ విమానాశ్రయం నుంచి త్వరలో కార్గో సర్వీసులు ప్రారంభించేందుకు ప్రణాళికలను రూపొందించామని చెప్పారు. సీఎం దిశానిర్దేశం మేరకు భోగాపురం ఎయిర్‌పోర్టును నిర్ణీత గడువు కంటే ఆరు నెలల ముందే.. అంటే 2026 జూన్‌లోనే ప్రారంభించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. అయ్యప్పస్వామి భక్తులు ఇరుముడితో విమాన ప్రయాణాలు సాగించేందుకు భద్రతా కారణాల దృష్ట్యా ఇప్పటివరకు అనుమతులు లేవని, అయితే 2025 జనవరి నుంచి అనుమతించేందుకు నిబంధనలు సడలించామని చెప్పారు. విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని మాట్లాడుతూ.. ఆర్థిక రాజధాని విశాఖ నుంచి అమరావతికి అనుసంధానం చేస్తూ విమాన సర్వీసులు పెంచడం హర్షణీయమన్నారు. కాగా.. ఇండిగో, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ ప్రయాణికులకు రామ్మోహన్‌నాయుడు, చిన్ని బోర్డింగ్ పాస్‌లు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీ గొల్ల బాబూరావు, విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు (గణబాబు), విమానాశ్రయం డైరెక్టర్ రాజారెడ్డి, ఎయిర్ ట్రావెల్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఓ.నరేశ్‌కుమార్, కుమార్‌రాజా, డీఎస్ వర్మ పాల్గొన్నారు.



ప్రయాణికులకు బోర్డింగ్ పాస్ అందజేస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, విమానాశ్రయం డైరెక్టర్ రాజారెడ్డి, విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు. చిత్రంలో ఎంపీ (రాజ్యసభ) గొల్ల బాబురావు, విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని

డిసెంబరు 9 నుంచి సీ ప్లేన్ సేవలు

- ప్రకాశం బ్యారేజీ నుంచి శ్రీశైలం వరకు సర్వీసులు

గోపాలపట్నం (విశాఖ సిటీ), విజయవాడ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో డిసెంబరు 9న తొలిసారిగా సీప్లేన్ సర్వీసులను ప్రారంభించనున్నట్టు పౌర విమానయాన మంత్రి రామ్మోహన్‌నాయుడు వెల్లడించారు. ఇందులో భాగంగా ప్రకాశం బ్యారేజీ నుంచి శ్రీశైలం వరకు ట్రయల్ రన్ నిర్వహిస్తామని విశాఖలో ఆదివారం చెప్పారు. సీఎం చంద్రబాబు చేతులమీదుగా ఈ సర్వీసులు ప్రారంభించే అవకాశం ఉంది. ఈ ప్రాజెక్టు కోసం రామ్మోహన్ ఎంతో కృషి చేశారు. సీప్లేన్ సర్వీసులు అందుబాటులోకి వస్తే అతి తక్కువ ఖర్చులో ఒకేరోజు రాష్ట్రంలోని విజయవాడ దుర్గమ్మ, శ్రీశైలం భ్రమరాంబికా మల్లికార్జునస్వామి ఆలయాలు దర్శించుకోవచ్చు.

పెట్టుబడులతో రండి

(మొదటి పేజీ తరువాయి)

సీఎం చంద్రబాబు ఇటీవల ఆరు పాలసీలను ప్రకటించారని తెలిపారు. అమెరికా పర్యటనలో ఉన్న ఆయన శాన్‌ఫ్రాన్సిస్కోలో భారత కాన్సులేట్ జనరల్ శ్రీకర్‌రెడ్డి ఆధ్వర్యాన పారిశ్రామికవేత్తలతో ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ ప్రవాసాంధ్రుల నుంచి పెద్దఎత్తున పెట్టుబడుల కోసం సీఎం చంద్రబాబు ఎదురుచూస్తున్నారని చెప్పారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు కియా ఒక ఉదాహరణ అని, ఏపీలో ప్రస్తుతం పెట్టుబడులు పెట్టేందుకు అనువైన వాతావరణం నెలకొని ఉందన్నారు. 'కర్నూలు జిల్లాను డ్రోన్ వ్యాలీగా తీర్చిదిద్దాలని సీఎం సంకల్పించారు. ఉమ్మడి చిత్తూరు, కడప జిల్లాలను ఎలక్ట్రానిక్స్ హబ్‌లుగా తయారుచేయడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నాం. దేశవ్యాప్తంగా 25శాతం సెల్‌ఫోన్లు, 50శాతం ఏసీలు ఏపీలోనే తయారవుతున్నాయి' అని తెలిపారు. కృష్ణా, గుంటూరు కేపిటల్ రీజియన్‌లో 5బిలియన్ డాలర్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టబోతున్నామని వెల్లడించారు. డిసెంబరు నుంచి అమరావతి పనులు ప్రారంభం కాబోతున్నాయన్నారు. గోదావరి జిల్లాల్లో ఆక్వా ఎక్స్‌పోర్ట్స్, పెట్రో కెమికల్స్, గ్రీన్ హైడ్రోజన్ పరిశ్రమలు, ఉత్తరాంధ్రలో కెమికల్, ఫార్మా రంగాలపై దృష్టి సారించామని చెప్పారు. విశాఖలో సివిల్ ఏవియేషన్ యూనివర్సిటీ డేటా సెంటర్ రానుందని, టీసీఎస్ కూడా త్వరలో కార్యకలాపాలను ప్రారంభించనుందని వివరించారు. 'ఎలక్ట్రానిక్స్ రంగంలో 300 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వస్తాయని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అందులో ఏపీ కీలకపాత్ర పోషించనుంది. అమెరికాలోని వివిధ రంగాల పారిశ్రామికవేత్తలు ఏపీకి వచ్చి రాష్ట్ర సమగ్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలి' అని విజ్ఞప్తి చేశారు.



శాన్‌ఫ్రాన్సిస్కోలోని డేటా సేవల సంస్థ ఈక్వెనెక్స్ ప్రతినిధులతో మంత్రి లోకేశ్

ఈక్వెనెక్స్ డేటా సెంటర్ సందర్శన

శాన్‌ఫ్రాన్సిస్కోలోని ప్రపంచ ప్రఖ్యాత డేటా సేవల సంస్థ ఈక్వెనెక్స్ డేటా సెంటర్ కేంద్ర కార్యాలయాన్ని లోకేశ్ సందర్శించారు. తమ సంస్థ అందిస్తున్న డేటా సేవలు, కార్యకలాపాలను సంస్థ గ్లోబల్ ఎండీ కౌశిక్ జోషి, సీనియర్ స్ట్రాటజిక్ సేల్స్ ఇంజనీర్ రాబర్ట్ ఎలెన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఏపీలో డేటా సెంటర్ ఏర్పాటు చేయాలని మంత్రి ఆహ్వానించారు. సమావేశంలో ఇండియాస్పోరా ఫౌండర్ ఎం.ఆర్. రంగస్వామి, ఫాల్కన్ ఎక్స్ కోఫౌండర్ రాజు ఇందుకూరి, గూగుల్ వైస్ ప్రెసిడెంట్ రావు సూరపనేని, ఏ5 కార్పొరేషన్ సీఈవో వినయ్ కృతివెంటి, అప్లైడ్ మెటీరియల్స్ సీటీవో ఓం నలమాసు, డేటా సెంటర్ సీఈవో కల్యాణ్ ముప్పనేని, గ్లోబల్ ఇండస్ట్రీ అనలిస్ట్ సీఈవో రాంరెడ్డి, సిలికానాంధ్ర ప్రెసిడెంట్ ఆనంద్ కూచిభొట్ల తదితర 20 కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు.

అభిమానుల తాకిడి

పెట్టుబడుల సాధన కోసం అమెరికా వెళ్లిన మంత్రి లోకేశ్‌కు అక్కడ కూడా అభిమానుల తాకిడి తప్పలేదు. శాన్‌ఫ్రాన్సిస్కోలో ఒకవైపు పారిశ్రామికవేత్తలతో వరుస భేటీలతో క్షణం తీరిక లేకుండా బిజీగా ఉంటూనే మరోవైపు తమను కలిసేందుకు వచ్చిన అభిమానులను నిరాశపరచకుండా వారితో ఆయన ఫొటోలు దిగారు. కాగా, రెండోరోజు ఆయన పలువురు పారిశ్రామికవేత్తలతో ముఖాముఖి సమావేశమై పెట్టుబడులు పెట్టాలని కోరారు. గూగుల్ సీటీవో ప్రభాకర్ రాఘవన్, జనరల్ అటమిక్స్ సీఈవో డాక్టర్ వివేక్‌లాల్, నియోట్రైబ్ వెంచర్స్ ఫౌండర్ కిట్టూ కొల్లూరి, జనరల్ కేటలిస్ట్ ఎండీ నీరజ్ అరోరా, ఐస్పేస్ ప్రెసిడెంట్ రాజేశ్ కొత్తపల్లి, సీఎఫ్‌వో ప్రసాద్ పాపుదేసి, గూగుల్ మాజీ అధికారి సారిన్ సువర్ణ, స్కియోటా కంపెనీ ప్రతినిధులతో లోకేశ్ భేటీ అయ్యారు.

సర్వే రాళ్ల కొను'గోల్‌మాల్'పైనా విచారణ

- గనుల వెంకటరెడ్డిపై మరో కేసు?
- మైన్స్ శాఖను కీలక ఫైళ్లు కోరిన ఏసీబీ

అమరావతి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వంలో భూముల సర్వే పేరిట జరిపిన సర్వే రాళ్ల కొనుగోళ్లలో జరిగిన భారీ గోల్‌మాల్‌పైనా ఏసీబీ విచారణ ప్రారంభించింది. ఇందులోనూ గనుల శాఖ మాజీ డైరెక్టర్ వీజీ వెంకటరెడ్డి పాత్ర ఉందన్న ఫిర్యాదులు ప్రభుత్వానికి అందాయి. రాళ్ల కొనుగోలుకు రెవెన్యూ, సర్వే శాఖల నుంచి నిధుల విడుదలపై స్పష్టత రాకముందే ఏపీఎండీసీ నుంచి రూ.470 కోట్ల చెల్లింపులు జరిపారు. ఇందుకు ప్రభుత్వ అనుమతి, ఆమోదం లేకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం ఒక ఎత్తయితే.. రాళ్ల కొనుగోళ్లలో భారీగా ముడుపులు కూడా పొందారన్న ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఏసీబీ ఉన్నతాధికారి నేతృత్వంలోని బృందం తాజాగా ఏపీఎండీసీ ఎండీ, గనుల శాఖ డైరెక్టర్ కార్యాలయాలకు వెళ్లింది. గనుల శాఖ డైరెక్టర్, ఏపీఎండీసీ ఎండీ ప్రవీణ్‌కుమార్‌ను కలిసి రెవెన్యూ శాఖ చేపట్టిన భూముల సర్వే కోసం కొనుగోలు చేసిన సర్వే రాళ్లకు సంబంధించి నడిపిన ఫైళ్లు, చేసిన చెల్లింపులు, సర్వేశాఖ ఇచ్చిన ఇండెంట్, ఏయే ఏజెన్సీల నుంచి ఎంతమేర రాయి కొన్నారో తెలిపే ఫైళ్ల వివరాలు కావాలని కోరింది. ముఖ్యంగా సర్వే రాళ్ల కొనుగోలుపై 15 అంశాల్లో నిర్దిష్ట సమాచారం కోరినట్టు సమాచారం. ప్రస్తుతం ఏసీబీ ఇసుక అక్రమాలపైనా విచారణ చేస్తోంది. ఈ కేసులో కీలకమైన ఫైళ్లను స్వాధీనం చేసుకుని వెంకటరెడ్డిని అరెస్టు చేసింది. ప్రస్తుతం ఆయన జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నారు. సోమవారం నుంచి ఆయన్ను రెండో విడత ఏసీబీ విచారించనుంది. ఇసుకతోపాటు సర్వేరాళ్ల కొనుగోళ్ల గోల్‌మాల్‌పై ప్రశ్నించనుంది. జగన్ ప్రభుత్వం 2019లో భూముల సర్వే మొదలుపెట్టింది. ప్రతి గ్రామం, పొలాల్లో సర్వేచేసిన తర్వాత సరిహద్దు రాళ్లు పాతాలని అనుకున్నారు. రాళ్ల కొనుగోలు బాధ్యతను గనుల శాఖకు అప్పగించారు. సర్వే శాఖ ఇండెంట్ ఇస్తే గనుల శాఖ దాన్ని ప్రాసెస్‌చేసేలా విధానాలు రూపొందించారు. తొలుత, రెండు ప్రైవేటు సంస్థల ద్వారా గ్రానైట్ రాళ్లు కొన్నారు. ఇందులో ఓ జూనియర్ అధికారి తన బావమరిదితో కంపెనీ పెట్టించి, ఆ సంస్థకే రాయి సరఫరా టెండర్ దక్కేలా చక్రం తిప్పారు. ఇదంతా వెంకటరెడ్డికి తెలిసే జరిగిందన్న ఫిర్యాదులున్నాయి. తొలి విడత జరిపిన కొనుగోళ్ల విలువ రూ.170 కోట్లు. అస్మదీయ కంపెనీతో జరిపిన కొనుగోళ్లలో ఒక్కో గ్రానైట్ రాయిని రూ.450కి కొన్నారు. ఇందులో అధికారులకు రూ.200 కమీషన్‌గా అందినట్టు ప్రభుత్వం దృష్టికి వెళ్లింది. ఆ తర్వాత రాజస్థాన్ నుంచి ప్రత్యేకంగా తేలికైన రాళ్లను తెప్పించారు. ఇందులోనూ అవినీతి జరిగిందన్న ఫిర్యాదులు వచ్చాయి. మూడో విడతగా ఒకేసారి 77 లక్షల రాళ్లను కొనుగోలు చేసి జిల్లాలకు పంపించారు. నిజానికి వీటికి సంబంధించిన బిల్లులను సర్వే శాఖ.. లేదంటే రెవెన్యూ శాఖ చెల్లించాలి. కానీ ఏపీఎండీసీ నిధుల నుంచి రూ.450 కోట్లు చెల్లించారు. రెవెన్యూ శాఖ ఆ డబ్బును తిరిగి ఏపీఎండీసీకి రీయింబర్స్ చేయలేదు. మరో 60 లక్షల రాళ్లు కొనుగోలు చేసి.. పాలిషింగ్ చేయించడం కోసం రూ.600 కోట్లతో ఎంగ్రేవింగ్ యూనిట్‌లు ఏర్పాటు చేయాలని కూడా ప్రతిపాదించారు. దానికి ప్రభుత్వం ఆమోదం తెలుపలేదు. కాగా.. గ్రానైట్ రాళ్ల కొనుగోలులో భారీగా అవినీతి, అక్రమాలు జరిగాయని 'ఆంధ్రజ్యోతి' ఆధారాలతో వెలుగులోకి తీసుకొచ్చింది. ఇద్దరు జూనియర్ అధికారులతో కలిసి వెంకటరెడ్డి మంత్రాంగం జరిపి అక్రమాలకు పాల్పడ్డారని ఇటీవల ప్రభుత్వానికి లిఖితపూర్వక ఫిర్యాదులు వచ్చాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఈ అంశాలపై కూడా విచారణ జరపాలని ఏసీబీని ఆదేశించింది. దీంతో ఆ విభాగం వాటిపై ఇప్పటికే రెవెన్యూ శాఖ నుంచి కీలక సమాచారం సేకరించింది. కొనుగోళ్లు, చెల్లింపులు, సరఫరా ఏజెన్సీల ఎంపిక వంటి కీలక అంశాల ఫైళ్లు, ఇతర సమాచారానికి సంబంధించిన డేటా సమకూర్చడంతోపాటు సమన్వయం కోసం గనుల శాఖ ఓ ప్రత్యేక అధికారిని నియమించినట్లు తెలిసింది. ఫైళ్ల పరిశీలన అనంతరం వెంకటరెడ్డిపైన, మరో ఇద్దరు అధికారులపైన మరో కేసు నమోదు చేయనున్నట్లు సమాచారం.



Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.